శనివారం 28 నవంబరు 2026

https://www.telugudesam.org

చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

నేడు రాజమండ్రికి సీఎం చంద్రబాబు

-జిల్లా కోర్టు, బార్ అసోసియేషన్ వేడుకలకు హాజరు

- వివరాలు 3లో..

మహిళా సాధికారతకు రాజకీయ ప్రాతినిధ్యం కీలకం



- డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం జరగదు
- రెండు బిల్లులకూ అన్ని రాజకీయ పార్టీలు మద్దతివ్వాలి
- బిల్లులను వ్యతిరేకించిన వారిని మహిళలు తిరస్కరిస్తారు
- మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ బిల్లులకు సీఎం చంద్రబాబు మద్దతు
- కేంద్రమంత్రి కుమారస్వామితో కలిసి ఢిల్లీలో మీడియా సమావేశం

2

"మహిళలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు, జనాభాకు అనుగుణంగా పార్లమెంటు స్థానాలను పెంచాల్సిన అవసరం ఉంది. మహిళా రిజర్వేషన్ల అమలుతో పాటు నియోజకవర్గాల పునర్విభజనలోనూ అన్ని రాష్ట్రాలకు సమన్యాయం జరగాలి. జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగకుండా, ప్రతి రాష్ట్రంలోనూ ప్రస్తుత స్థానాలపై 50 శాతం సీట్లు పెంచాలి. 2029 ఎన్నికల నాటికి డీలిమిటేషన్ పూర్తి చేసి, మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. మహిళా రిజర్వేషన్ల బిల్లును వ్యతిరేకించే వారిని మహిళలు తిరస్కరిస్తారు. దేశ భవిష్యత్తు, ప్రజాస్వామ్య ప్రాతినిధ్య విస్తరణ కోసం అన్ని రాజకీయ పార్టీలు ఈ నిర్ణయాలకు మద్దతు ఇవ్వాలి"

నియోజకవర్గాల పునర్విభజన ఏపీకి మంచి అవకాశం

క్యాబినెట్ భేటీ అనంతరం మంత్రులతో సీఎం చంద్రబాబు

3

ప్రతి ఎన్నికనూ సీరియస్‌గా తీసుకోవాలి..

కూటమి విజయ పరంపర కొనసాగాలంటూ లోకేష్ పిలుపు



3



రాయలసీమ లిఫ్ట్‌పై జగన్‌వి పచ్చి అబద్ధాలు!



8

- వాస్తవాలను ప్రజల ముందుంచే ధైర్యం గొడ్డలిపార్టీకి ఉందా?
- 2020లోనే ఎన్జీటీ స్టే ఇచ్చింది..
- 2023లో రూ.2.65 కోట్ల జరిమానా విధించింది
- అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్నది జగనా? చంద్రబాబా?
- నిలదీసిన జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు

రాష్ట్రాభివృద్ధికి రూ.36 వేల కోట్ల పెట్టుబడులు..

3

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి కల్పనకు ఊతమిచ్చేలా ఆరు సంస్థల రూ.36 వేల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పరిశ్రమల ఏర్పాటులో అనుమతుల జాప్యాన్ని నివారించేందుకు 'ఏపీ ఎంఎస్ఎంఈ రైట్ టు బిజినెస్ బిల్లు-2026'కు పచ్చజెండా ఊపింది. అమరావతిలో ప్రభుత్వ భవనాలు, మౌలిక వసతుల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించడంతో పాటు విద్యుత్ ఉత్పత్తి, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు ఆమోదముద్ర వేసింది. భూ సమస్యల పరిష్కారం, పారిశ్రామిక పార్కులు, కొత్త పెట్టుబడులకు ప్రాధాన్యతనిస్తూ సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మొత్తం 30 అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

- పరిశ్రమలకు భారీ ప్రోత్సాహం
- అమరావతి నిర్మాణాలకు భారీగా నిధులు
- విద్యుత్ రంగంలో కీలక నిర్ణయాలు
- భూ సమస్యల పరిష్కారానికి చర్యలు
- 30 కీలక ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం

మత్స్యకారుల ప్రాణరక్షణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు



7

- తుఫాను హెచ్చరికలు, భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- అధికారుల అలసత్వంతో ప్రాణనష్టం జరిగితే కఠిన చర్యలు
- సమీక్షలో రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

పంచాయతీ ఎన్నికల్లో వైసీపీకి ప్రజా మద్దతు కరువు



6

- 26 శాతానికే పరిమితమైన గొడ్డలిపార్టీ
- బ్యాలెట్.. ఈవీఎం ఏదైనా ప్రజా మద్దతు కూటమికే
- ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాం.. అందుకే ఆదరణ
- కుప్పంలో టీడీపీ కార్యకర్త మృతిపై వైసీపీ, సాక్షి దుష్ప్రచారం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

చీకటి గెలుపు.. రక్తపాత గెలుపు జగన్‌దే!

ప్రజలు మెచ్చి ఇచ్చిన గెలుపు చంద్రన్నది!!

5

- 'రిపోర్టర్స్ కలెక్టివ్' గతంలో అమరావతిపై తప్పుడు ఆరోపణలు చేసింది
- ఇప్పుడు చిత్తూరు పార్లమెంటు పోలింగ్‌ను వక్రీకరించింది
- రిపోర్టర్స్ కలెక్టివ్, సాక్షి రాతల వెనుక జగన్ ఉన్నారన్నది వాస్తవం

మహిళా సాధికారతకు రాజకీయ ప్రాతినిధ్యం కీలకం

- డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం జరగదు
- రెండు బిల్లులకూ అన్ని రాజకీయ పార్టీలు మద్దతివ్వాలి
- బిల్లులను వ్యతిరేకించిన వారిని మహిళలు తిరస్కరిస్తారు
- మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ బిల్లులకు సీఎం చంద్రబాబు మద్దతు
- కేంద్రమంత్రి కుమారస్వామితో కలిసి ఢిల్లీలో మీడియా సమావేశం



ఢిల్లీ (చైతన్య రథం): మహిళలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు, దేశ జనాభాకు అనుగుణంగా పార్లమెంటు స్థానాలను పెంచాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలు, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు వెళ్తోందని పేర్కొన్నారు. ఈ కీలక నిర్ణయాలకు మద్దతు తెలిపేందుకే ఢిల్లీకి వచ్చినట్లు వెల్లడించారు. కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ఇతర కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ల అంశం ఇప్పుడు కీలక దశకు చేరుకుందని చంద్రబాబు పేర్కొన్నారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయం చారిత్రాత్మకమని అభివర్ణించారు. అన్ని రంగాల్లో మహిళలు ముందుకు దూసుకుపోతున్నారని, విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారని చెప్పారు. ఇప్పుడు రాజకీయ రంగంలోనూ వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన సమయం వచ్చిందన్నారు. మహిళా సాధికారతకు సామాజిక, ఆర్థిక, రాజకీయ భాగస్వామ్యం ఎంతో కీలకమని ముఖ్యమంత్రి వివరించారు.

జనాభాకు అనుగుణంగా ప్రాతినిధ్యం పెరగాలి

1971 జనాభా లెక్కల ఆధారంగా 1976లో నియోజకవర్గాల పునర్విభజన జరిగిందని, తర్వాత కూడా పాత జనాభా ప్రాతిపదికనే లోక్‌సభ స్థానాల సంఖ్య కొనసాగుతోందని చంద్రబాబు వివరించారు. అప్పట్లో దేశ జనాభా 58.8 కోట్లుగా ఉండగా, లోక్‌సభలో 543 స్థానాలు ఉన్నాయని గుర్తుచేశారు. ప్రస్తుతం దేశ జనాభా సుమారు 147 కోట్లకు చేరుతున్న నేపథ్యంలో అదే 543 స్థానాలతో కొనసాగడం సమంజసం కాదన్నారు. జనాభా పెరుగుదలకు అనుగుణంగా ప్రజాప్రతినిధుల సంఖ్య కూడా పెరగాలని అభిప్రాయపడ్డారు. 1971లో ప్రతి పది లక్షల మందికి ఒక ఎంపీ ప్రాతినిధ్యం వహించే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం సుమారు 27 లక్షల మందికి ఒక ఎంపీ ప్రాతినిధ్యం వహిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గాల సంఖ్యను 50 శాతం పెంచితే ప్రతి 18 లక్షల మందికి ఒక ఎంపీ ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంటుందన్నారు. ప్రజల సమస్యలను పార్లమెంటులో సమర్థంగా ప్రస్తావించేందుకు, ప్రజాస్వామ్య ప్రాతినిధ్యాన్ని విస్తరించేందుకు ఇది దోహదపడుతుందని చెప్పారు.

దక్షిణాది ప్రయోజనాలకు భంగం వాటిల్లదు..

జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాలు గతంలో దేశానికి ఆదర్శంగా నిలిచాయని సీఎం గుర్తుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కుటుంబ నియంత్రణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి, ప్రచార కార్యక్రమాల ద్వారా సంతానోత్పత్తి రేటును తగ్గించగలిగామని వివరించారు. ప్రస్తుతం పరిస్థితులు మారాయని, జనాభా నియంత్రణతో పాటు జనాభా నిర్వహణపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.
దక్షిణాది రాష్ట్రాల్లో ఫెర్టిలిటీ రేటు తక్కువగా ఉన్న నేపథ్యంలో 2026 జనాభా లెక్కలను మాత్రమే ప్రాతిపదికగా తీసుకుని నియోజకవర్గాల పునర్విభజన చేపడితే ఈ రాష్ట్రాలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలు రాజకీయ ప్రాతినిధ్యం విషయంలో నష్టపోకూడదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రతి రాష్ట్రంలోనూ ప్రస్తుతం ఉన్న స్థానాలపై 50 శాతం అదనపు సీట్లు పెంచే విధానం తీసుకురావడం సముచితమన్నారు. దీనివల్ల దక్షిణాది రాష్ట్రాలకు కూడా పూర్తి ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ప్రజల్లో అనవసరమైన అసంతృప్తి, ఆందోళనలు తలెత్తకుండా, అన్ని ప్రాంతాలకు సమాన న్యాయం జరిగేలా డీలిమిటేషన్ ప్రక్రియ ఉండాలని అభిప్రాయపడ్డారు.

ఏపీకి 25 నుంచి 38 స్థానాలు

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 25 లోక్‌సభ స్థానాలు ఉన్నాయని, 50 శాతం సీట్ల పెంపు జరిగితే ఆ సంఖ్య 38కి చేరుతుందని చంద్రబాబు వివరించారు. తమిళనాడులో 59, కర్ణాటకలో 42, తెలంగాణలో 26, కేరళలో 30కి లోక్‌సభ స్థానాలు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. మొత్తంగా దక్షిణాది రాష్ట్రాల్లో పార్లమెంటు స్థానాల సంఖ్య 195కు చేరుతుందని పేర్కొన్నారు. అన్ని రాష్ట్రాలకు సమానంగా సీట్ల పెంపు జరిగితే దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడటంతో పాటు దేశవ్యాప్తంగా ప్రజాప్రాతినిధ్యం విస్తరిస్తుందని చెప్పారు. 2001 నియోజకవర్గాల పునర్విభజన తర్వాత కూడా జనాభా పెరుగుదలకు అనుగుణంగా ప్రాతినిధ్యం పెరగలేదని, ప్రస్తుతం ప్రతి ఎంపీపై అధిక జనాభా భారం ఉందని వివరించారు. కొత్త డీలిమిటేషన్ ద్వారా ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. 2029 ఎన్నికల నాటికి నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సిన అవసరం ఉందని, మహిళా రిజర్వేషన్ల అమలుకు కూడా ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.

మహిళా సాధికారతకు ఎన్టీఆర్ పునాది

మహిళలకు ఆస్తి హక్కు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని చంద్రబాబు గుర్తుచేశారు. 1986లోనే స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించి రాజకీయాల్లో వారి భాగస్వామ్యానికి పునాది వేశారని చెప్పారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో డ్వాక్రా సంఘాల ద్వారా మహిళల ఆర్థిక సాధికారతకు కృషి చేశానన్నారు. నేడు రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలు దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నారని పేర్కొన్నారు.
మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు 'స్వయం' బ్రాండ్‌ను తీసుకొచ్చామని, వాటిని అంతర్జాతీయ మార్కెట్లకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. విద్య, ఉద్యోగాల్లో మహిళలకు అవకాశాలు పెంచడంతో పాటు ఆర్టీసీలో డ్రైవర్లు, కండక్టర్ల నియామకాల్లోనూ ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. ఏపీలో స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించినప్పటి నుంచి వారి రాజకీయ భాగస్వామ్యం క్రమంగా పెరుగుతోందన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పది మేయర్ స్థానాల్లో ఎనిమిది స్థానాలను మహిళలు గెలుచుకున్నారని చెప్పారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన మహిళలు నగరాల ప్రథమ పౌరులుగా బాధ్యతలు చేపట్టడం సంతోషకరమన్నారు.

దేశ భవిష్యత్తుకు మహిళల భాగస్వామ్యం కీలకం


మహిళా రిజర్వేషన్ల కోసం ఆంధ్రప్రదేశ్ శాసనసభలో ఇప్పటికే తీర్మానం చేసి కేంద్రానికి పంపించామని చంద్రబాబు తెలిపారు. ఈ అంశంపై తమ ప్రభుత్వం నిరంతరం కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తోందన్నారు. ప్రధాని మోదీ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చేస్తున్న ప్రయత్నాలు ప్రశంసనీయమని, ఈ చారిత్రాత్మక నిర్ణయం దేశ మహిళల ఆకాంక్షలను నెరవేరుస్తుందని పేర్కొన్నారు.
గతంలో మాజీ ప్రధాని దేవెగౌడ హయాంలోనూ మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టినా వివిధ కారణాలతో ఆమోదం పొందలేకపోయిందని గుర్తుచేశారు. గత సమావేశాల్లో కొన్ని రాజకీయ పార్టీలు ఈ బిల్లును వ్యతిరేకించాయని, అలాంటి తప్పిదాలు మరోసారి జరగకూడదని విజ్ఞప్తి చేశారు. మహిళలకు మరింత ప్రాతినిధ్యం కల్పించాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నప్పుడు దానికి మద్దతు ఇవ్వాల్సిన బాధ్యత అన్ని పార్టీలపై ఉందన్నారు.
మహిళా రిజర్వేషన్ల విషయంలో ఎలాంటి వివక్షకు తావులేకుండా బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించాలని కోరారు. ఈ నెలాఖరులో జరిగే పార్లమెంటు సమావేశాల్లో సభ్యులంతా బిల్లుకు అనుకూలంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. చారిత్రక తప్పిదానికి పాల్పడవద్దని రాజకీయ పార్టీలకు, ప్రజాప్రతినిధులకు సూచించారు.
భారతీయులు సాంకేతికత, నాయకత్వ రంగాల్లో ఇప్పటికే ప్రపంచస్థాయిలో తమ ప్రతిభను చాటుతున్నారని, దేశం మరింత ముందుకు వెళ్లాలంటే సమర్థవంతమైన మహిళా నాయకత్వం అవసరమని చంద్రబాబు పేర్కొన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారత సాధించినప్పుడే మహిళలు దేశ అభివృద్ధిలో మరింత క్రియాశీలక పాత్ర పోషించగలరన్నారు. మహిళల భాగస్వామ్యంతోనే భారత్ ప్రపంచంలో అగ్రస్థానానికి చేరుకోవాలన్న ఆకాంక్ష నెరవేరుతుందని చెప్పారు.
మహిళా రిజర్వేషన్ల బిల్లును వ్యతిరేకించే వారిని మహిళలు తిరస్కరిస్తారని సీఎం చంద్రబాబు అన్నారు. దేశ ప్రయోజనాలు, మహిళల భవిష్యత్తు, ప్రజాస్వామ్య ప్రాతినిధ్య విస్తరణను దృష్టిలో పెట్టుకుని అన్ని రాజకీయ పార్టీలు కలిసికట్టుగా నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

నియోజకవర్గాల పునర్విభజన

ఏపీకి మంచి అవకాశం

క్యాబినెట్ భేటీ అనంతరం మంత్రులతో సీఎం చంద్రబాబు





అమరావతి (చైతన్య రథం): నియోజకవర్గాల పునర్విభజన ఆంధ్రప్రదేశకు మంచి అవకాశమని ముఖ్యమంత్రి చంద్రబాబు.. మంత్రుల వద్ద స్పష్టం చేశారు. ప్రస్తుత జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన చేస్తే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని అభిప్రాయపడ్డారు. అందుకే దేశవ్యాప్తంగా లోక్‌సభ స్థానాలను 50 శాతం పెంచే ప్రతిపాదన అన్ని రాష్ట్రాలకు ప్రయోజనకరమని మంత్రివర్గంలో వివరించారు. దిల్లీ రావాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఫోన్ చేశారని, పవన్ కల్యాణ్‌ను కూడా ఆహ్వానించారని తెలిపారు. ఈనెల 29 నుంచి తెదేపా, జనసేన, భాజపా ఎంపీలంతా తప్పనిసరిగా ఢిల్లీలో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. శనివారం రాజమహేంద్రవరంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల కార్యక్రమానికి హాజరవుతానని, వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున విందు ఏర్పాటు చేస్తున్నామని చంద్రబాబు మంత్రులకు వివరించారు. ఈ విందుకు పవన్‌ను కూడా ఆహ్వానించినట్టు తెలిపారు.

అమరావతిపై గొడ్డలిపార్టీ విష ప్రచారం

అమరావతిపై గొడ్డలి పార్టీ అదే పనిగా విషప్రచారం చేస్తోందని చంద్రబాబు మండిపడ్డారు. ప్రపంచబ్యాంకు, ఏడీబీకి ఫిర్యాదులు చేస్తూ రాజధాని నిర్మాణాన్ని అడ్డుకోవాలని చూస్తోందని విమర్శించారు. రైతుల త్యాగాలను కూడా హేళన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి కోసం రైతులు చేసిన పోరాటానికి గుర్తుగా స్మారక నిర్మాణం చేపట్టాలని లోకేశ్ సూచించగా.. సీఎం అంగీకరించారు. డిసెంబరు 1న హార్టికల్చర్ హబ్‌ను ప్రారంభించనున్నట్టు మంత్రులకు తెలిపారు. దీని అమలుకు ప్రత్యేక మిషన్ ఏర్పాటు చేసి, సీఈవోను నియమిస్తున్నట్టు వెల్లడించారు. విశాఖ రుషికొండ ప్యాలెస్‌ను పర్యాటక రంగానికి వినియోగించాలని కేబినెట్ సబ్ కమిటీ సూచించింది. గత ప్రభుత్వ దుబారా ప్రజలకు తెలియాలంటే ప్యాలెస్‌ను సందర్శనకు అందుబాటులో ఉంచాలని పవన్ కల్యాణ్ సూచించారు. దీనిపై వెంటనే ఏర్పాట్లు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. పెట్టుబడుల రక్షణ చట్టాన్ని జనవరి నాటికి ఆమోదించి, ఏప్రిల్ 1నుంచి అమల్లోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల ప్రారంభం, పూర్తికి స్పష్టమైన క్యాలెండర్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఒప్పందాలకే పరిమితం కాకుండా పరిశ్రమల నిర్మాణం, ప్రారంభం వరకు నిర్దిష్ట కార్యాచరణ ఉండాలని స్పష్టం చేశారు.




రాజమహేంద్రవరంలో నేడు సీఎం చంద్రబాబు పర్యటన

- **జిల్లా కోర్టు 222 ఏళ్లు, బార్ అసోసియేషన్ 131 ఏళ్ల వేడుకల్లో పాల్గొననున్న సీఎం**

అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. రాజమహేంద్రవరంలో జరిగే జిల్లా కోర్టు 222 ఏళ్లు, బార్ అసోసియేషన్ 131 ఏళ్ల వేడుకల్లో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. ఉదయం 9.30 గంటలకు అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి ఉదయం 10 గంటలకు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కాలేజ్‌కు చేరుకుంటారు. 10.15 గంటలకు మంజీరా సరోవర్ ప్రీమియర్ హోటల్‌కు వెళ్తారు. మంజీరా సరోవర్ ప్రీమియర్ హోటల్‌లో 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.05 గంటల వరకు నిర్వహించే జిల్లా కోర్టు 222 సంవత్సరాలు, బార్ అసోసియేషన్ 131 సంవత్సరాల వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. రాజమహేంద్రవరంలో కార్యక్రమం ముగిసిన అనంతరం మధ్యాహ్నం 01.45 గంటలకు అమరావతి క్యాంప్ కార్యాలయానికి చేరుకుంటారు.

రాజేంద్ర కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సాయం ప్రకటించిన సీఎం చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): కుప్పంలో ఎన్నికల అధికారి వాహనం ఢీకొని మృతి చెందిన టీడీపీ కార్యకర్త రాజేంద్ర కుటుంబానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అండగా నిలిచారు. రాజేంద్ర మృతిపై తీవ్ర సానుభూతి వ్యక్తం చేసిన సీఎం.. ఆయన కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. రాజేంద్ర కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.10 లక్షలు, పార్టీ తరఫున మరో రూ.10 లక్షలు.. మొత్తంగా రూ.20 లక్షల ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. కష్టకాలంలో కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మరోవైపు కుప్పం టీడీపీ నాయకులు రాజేంద్ర నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.




బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ మృతి పట్ల సీఎం చంద్రబాబు సంతాపం



అమరావతి (చైతన్య రథం): అస్సాంలోని భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బీఎస్ఎఫ్ కానిస్టేబుల్ కదిమి వేణు నదిలో మునిగి మరణించడం తీవ్ర విచారకరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. 31 ఏళ్ల వయసులోనే వేణు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం కొత్తపల్లె గ్రామానికి చెందిన కదిమి వేణు మృతి పట్ల ముఖ్యమంత్రి తీవ్ర సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు సామాజిక మాధ్యమం వేదికగా స్పందించారు.

విద్యావేత్త మంగాదేవి మృతి పట్ల మంత్రి నారా లోకేష్ దిగ్భ్రాంతి



అమరావతి (చైతన్య రథం): ప్రముఖ విద్యావేత్త డా. ఎన్ మంగాదేవి భౌతికంగా మనకు దూరమయ్యారన్న వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. పిల్లలపట్ల అపారమైన ప్రేమతో, విలువలతో కూడిన విద్యను అందిస్తూ వేలాది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దిన ఆమె సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. బాలకుటీర్, చేతన వంటి విద్యాసంస్థల ద్వారా మంగాదేవి సమాజానికి ఎనలేని సేవలు అందించారని లోకేష్ పేర్కొన్నారు. విద్యారంగానికి, సమాజానికి ఆమె చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని తెలిపారు. మానవతామూర్తి మంగాదేవి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆమె కుటుంబ సభ్యులకు, బాలకుటీర్ కుటుంబ సభ్యులందరికీ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు మంత్రి నారా లోకేష్ ట్వీట్ చేశారు.

రాష్ట్రాభివృద్ధికి రూ.36 వేల కోట్ల పెట్టుబడులు..

- **పరిశ్రమలకు భారీ ప్రోత్సాహం**
- **అమరావతి నిర్మాణాలకు భారీగా నిధులు**
- **విద్యుత్ రంగంలో కీలక నిర్ణయాలు**
- **భూ సమస్యల పరిష్కారానికి చర్యలు**
- **30 కీలక ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం**

అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం రాష్ట్ర పారిశ్రామిక, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఊతమిచ్చేలా మొత్తం 30 అంశాలకు ఆమోదముద్ర వేసింది. పరిశ్రమల ఏర్పాటులో అనుమతుల జాప్యాన్ని నివారించేలా 'ఏపీ ఎంఎస్ఎంఈ రైట్ టు బిజినెస్ బిల్లు-2026'కు ఆమోదం తెలిపింది. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఒప్పందాలు చేసుకున్న ఆరు సంస్థల పెట్టుబడి ప్రతిపాదనలకు పచ్చజెండా ఊపింది. ఈ సంస్థల ద్వారా రాష్ట్రానికి సుమారు రూ.36 వేల కోట్ల పెట్టుబడులు రావడంతో పాటు వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

పరిశ్రమలకు భారీ ప్రోత్సాహం

పెనుకొండలో రూ.19 వేల కోట్ల పెట్టుబడితో కియా రెండో ఆటోమొబైల్ తయారీ ప్లాంట్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. శ్రీకాకుళం జిల్లాలో రూ.13,667 కోట్లతో అదానీ ఇంటిగ్రేటెడ్ టైటానియం కాంప్లెక్స్ ఏర్పాటు ప్రతిపాదనకు, అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో రూ.1,800 కోట్లతో సెయింట్ గోబైన్ ఫ్లోట్ గ్లాస్ తయారీ పరిశ్రమ స్థాపనకు ఆమోదముద్ర వేసింది. ఈ ప్రాజెక్టులతో రాష్ట్రంలో పారిశ్రామిక కార్యకలాపాలు మరింత విస్తరించడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. ఎంఎస్ఎంఈ రంగంలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతుల ప్రక్రియను సరళతరం చేసేందుకు 'ఏపీ ఎంఎస్ఎంఈ రైట్ టు బిజినెస్ బిల్లు-2026'కు ఆమోదం తెలిపింది. కొత్త పరిశ్రమల ఏర్పాటులో అధికారిక అనుమతుల కోసం ఎదురుచూసే సమయాన్ని తగ్గించి, పెట్టుబడిదారులకు సులభతరమైన వాతావరణం కల్పించడం ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం.

అమరావతి నిర్మాణాలకు భారీగా నిధులు

రాజధాని అమరావతిలో ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. హైకోర్టు, శాసనసభ, సచివాలయ నిర్మాణ పనులకు అవసరమైన నిధుల కేటాయింపులకు ఆమోదం తెలిపింది. సమీకృత సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాల నిర్మాణ వ్యయాన్ని గతంలో ఉన్న రూ.4,688 కోట్ల నుంచి రూ.6,641 కోట్లకు పెంచింది. రాజధాని పరిధిలోని గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.1,215 కోట్ల విలువైన పనులకు ఆమోదం తెలిపింది. శాఖమూరులో అమరావతి సంగమం నిర్మాణానికి రూ.626 కోట్ల ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాజధానిలో గ్రీన్ వర్క్స్ ప్యాకేజీ-2 కింద రూ.180.68 కోట్ల అభివృద్ధి పనులకు అనుమతులు మంజూరు చేసింది. ఈ పనుల ద్వారా రాజధాని ప్రాంతంలో పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వనుంది.

విద్యుత్ రంగంలో కీలక నిర్ణయాలు

రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇంధన రంగంలోనూ కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా సామర్థ్యాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో కోల్ ఇండియాతో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసేందుకు ఏపీజెన్కోకు అనుమతి ఇచ్చింది. వైఎస్సార్ కడప జిల్లా మైలవరంలో 1,000 మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు 1,127 ఎకరాల భూమి కేటాయింపునకు ఆమోదం తెలిపింది. నంద్యాల జిల్లాలో 210 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టు బదిలీకి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రకాశం జిల్లాలో రోజుకు 12 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు సైతం ఆమోదం తెలిపింది.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

రెవెన్యూ శాఖకు సంబంధించి కూడా కేబినెట్ కీలక నిర్ణయాలు



తీసుకుంది. అనంతపురం జిల్లాలో 9,917 ఎకరాల భూములను 22-ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో 4,352 మంది రైతులకు ప్రయోజనం కలగనుంది. రైల్వేకోడూరు పరిధిలోని 10,192 ఎకరాల భూములకు సంబంధించి వెబ్‌ల్యాండ్ రికార్డుల్లో ఉన్న తప్పులను సరిదిద్దేందుకు అనుమతించింది. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, వివాదాల్లో ఉన్న భూముల విషయంలో కొత్తగా ఎలాంటి హక్కులు కల్పించకుండా తగిన నిబంధనలు పాటించాలని నిర్ణయించింది. భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత, వివాదాల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేసింది.

ఇతర పారిశ్రామిక ప్రతిపాదనలు

పారిశ్రామిక రంగాన్ని మరింత విస్తరించే దిశగా కోసలనగరం ఇండస్ట్రియల్ పార్కుకు రూ.1,500 కోట్ల రుణ ప్రతిపాదన, శ్రీకాకుళం జిల్లా మూలపేటలో గ్రీన్‌ఫీల్డ్ కెమికల్ పార్కు ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలపైనా కేబినెట్ నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు రాజధాని నిర్మాణం, విద్యుత్ ఉత్పత్తి, భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ మంత్రివర్గం ఈ నిర్ణయాలు తీసుకుంది.

సమసమాజ నిర్మాణానికి
కనకదాస కృషి స్ఫూర్తిదాయకం: సీఎం చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): కుల, మత తారతమ్యాలకు అతీతంగా సమసమాజ నిర్మాణం కోసం కృషి చేసిన గొప్ప వాగ్గేయకారుడు భక్త కనకదాస అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొనియాడారు. భక్త కనకదాస జయంతి సందర్భంగా ఆ మహనీయుడి సేవలను స్మరించుకుందామని పిలుపునిచ్చారు. తన కీర్తనల ద్వారా భక్తి మార్గాన్ని బోధించడంతోపాటు సమాజంలో సామాజిక చైతన్యాన్ని రగిలించిన మహానుభావుడు కనకదాస అని పేర్కొన్నారు. ఆయన బోధనలు, ఆశయాలు సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు సామాజిక మాధ్యమం వేదికగా భక్త కనకదాసకు నివాళులర్పించారు.

భక్త కనకదాస జయంతి సందర్భంగా మంత్రి లోకేష్ నివాళి

సామాజిక తత్వవేత్త, స్వరకర్త, భక్త కనకదాస జయంతి సందర్భంగా రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఘన నివాళి అర్పించారు. తన రచనలు, కీర్తనల ద్వారా సమాజంలో అసమానతల నిర్మూలనకు భక్త కనకదాస చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. కుల, మత భేదాలు లేని సమసమాజ నిర్మాణం కోసం ఆయన సాగించిన పోరాటం, అందించిన సందేశం నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని మంత్రి కొనియాడారు. సమానత్వం, సామాజిక సామరస్యం వంటి విలువలను తన రచనల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లిన భక్త కనకదాస ఆశయాలను స్మరించుకుంటూ నివాళులు అర్పిస్తున్నట్లు నారా లోకేష్ ట్వీట్ చేశారు.



ప్రజా నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేయాలి: మంత్రి నారా లోకేష్

అమరావతి (చైతన్య రథం): పట్టణం, పరిషత్, పల్లె.. ఎన్నిక ఏదైనా ప్రజల తీర్పులో మార్పు లేదని, కూటమి ప్రభుత్వ సుపరిపాలనపై ప్రజలు అచంచల విశ్వాసం కనబరుస్తున్నారని రాష్ట్ర విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో కూటమి మద్దతుతో పోటీ చేసిన అభ్యర్థులు ఘన విజయం సాధించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులకు అభినందనలు తెలియజేస్తూ.. ఈ ఫలితాలు ప్రజలు కూటమిపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునే బాధ్యత ప్రజాప్రతినిధులందరిపై ఉందని స్పష్టం చేశారు.

విజయం సాధించామనే అహంకారం దరిచేరనీయకుండా ప్రజలతో మమేకమై, సేవా దృక్పథంతో పనిచేయాలని విజేతలకు సూచించారు. కేంద్రం నుంచి గ్రామ పంచాయతీ వరకు కూటమి ప్రజాప్రతినిధులు కొలువుదీరడం రాష్ట్రాభివృద్ధికి మేలి మలుపు కానుందని అభిప్రాయపడ్డారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు సమిష్టిగా పనిచేయాలని, సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ముందుకు సాగాలని మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం వేదికగా స్పందించారు.

ప్రతి ఎన్నికనూ సీరియస్‌గా తీసుకోవాలి..

కూటమి విజయ పరంపర కొనసాగాలంటూ లోకేష్ పిలుపు

అమరావతి (చైతన్య రథం): పంచాయతీ ఎన్నికలను చిన్నవిగా భావించకుండా ప్రతి ఎన్నికనూ సీరియస్‌గా తీసుకోవాలని టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పట్టణ, పరిషత్ ఎన్నికల్లో ఎంత కష్టపడ్డామో.. పంచాయతీ ఎన్నికల్లో అంతకంటే ఎక్కువ కష్టపడి పనిచేయాలని సూచించారు. తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులు అద్భుత విజయాలు సాధించారని, ఇదే విజయ పరంపర రెండు, మూడు విడతల ఎన్నికల్లోనూ కొనసాగాలని ఆకాంక్షించారు. పార్టీ ముఖ్య నేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో తొలి విడత పంచాయతీ ఎన్నికల ఫలితాలు, రాబోయే రెండు, మూడు విడతల ఎన్నికల సన్నద్ధతపై నారా లోకేష్ సమీక్షించారు. తొలి విడతలో విజయం సాధించిన అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. 2024 ఎన్నికల్లో సాధించిన విజయం పంచాయతీ ఎన్నికల వరకు కొనసాగుతోందని పేర్కొన్నారు.

మనకు బలం ఉందనే ధీమాతో రిలాక్స్ కావద్దని, ఎన్నికలను ఎన్నికలుగానే పరిగణించి ప్రతి ఎన్నికనూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని స్పష్టం చేశారు. పోలింగ్ శాతం ఎంత ఎక్కువగా ఉంటే కూటమి అభ్యర్థుల మెజార్టీలు అంతగా పెరుగుతాయని చెప్పారు. జనసేన, బీజేపీ కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఎన్నికలు లేని నియోజకవర్గాలకు చెందిన నేతలు సైతం అవసరమైన నియోజకవర్గాల్లో పంచాయతీ ఎన్నికల ప్రచారం, సమన్వయ కార్యక్రమాల్లో సేవలందించాలని కోరారు. క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే పార్టీ దృష్టికి తీసుకురావాలన్నారు. బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో విజయం సాధించడంతోపాటు, బలంగా ఉన్న చోట్ల మరింత మెజార్టీ సాధించేలా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. వరుస ఓటములతో గొడ్డలి పార్టీ ఫ్రస్ట్రేషన్‌కు



గురవుతోందని, ఎన్నికల్లో ఆ పార్టీ నేతలు హింసకు పాల్పడుతున్నారని నారా లోకేష్ ఆరోపించారు. ప్రత్యర్థుల దాడులు, కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కూటమి పార్టీల మధ్య సమన్వయం, సమష్టి కృషితో రానున్న పంచాయతీ ఎన్నికల్లోనూ విజయాలు సాధించాలని పిలుపునిచ్చారు.



తుపానుల ప్రభావాన్ని తట్టుకునేలా సమగ్ర ప్రణాళిక

- **రూ.4851కోట్ల ప్రతిపాదనలు కేంద్రమంత్రి ఖట్టర్‌కు అందజేసిన మంత్రి గొట్టిపాటి**
- **90 శాతం నిధులు భరించాలని విజ్ఞప్తి**

న్యూఢిల్లీ (చైతన్యరథం): రాష్ట్రంలోని తీర ప్రాంతాల్లో తుపానుల ప్రభావాన్ని తట్టుకునేలా పటిష్టమైన విద్యుత్ మౌలిక సదుపాయాల నిర్మాణానికి రూ.4,851 కోట్లతో సమగ్ర ప్రణాళికను కేంద్ర ప్రభుత్వం ముందు ప్రతిపాదించినట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఢిల్లీలో కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమైన ఆయన, ఇటీవల రాష్ట్రంలో వచ్చిన తుపానుల కారణంగా విద్యుత్ వ్యవస్థకు జరిగిన నష్టాన్ని వివరించారు. భూగర్భ విద్యుత్ కేబుళ్లు, స్పన్‌పోల్స్‌తో విద్యుత్ లైన్ల పునర్నిర్మాణానికి అవసరమైన మొత్తం వ్యయంలో 90 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం అందించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర సహకారం లభిస్తే మూడేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే ప్రకృతి వైపరీత్యాల సమయంలో విద్యుత్ అంతరాయాలను తగ్గించడంతో పాటు, ఆస్తి నష్టాన్ని పరిమితం చేసి, విద్యుత్ సరఫరాను వేగంగా పునరుద్ధరించేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. కేంద్రం సహకరిస్తే మూడేళ్లలో పనులు పూర్తయ్యే కార్యాచరణ వివరించారు. తుపాను నిరోధక వ్యవస్థతో ప్రకృతి విపత్తులను సమర్థంగా ఎదుర్కోవచ్చని, ఆస్తి నష్టం తగ్గుతుందని, త్వరగా పునరుద్ధరణ పనులు చేపట్టవచ్చని మంత్రి గొట్టిపాటి వివరించారు. మంత్రి గొట్టిపాటి ప్రతిపాదనలకు కేంద్రమంత్రి ఖట్టర్ సానుకూలంగా స్పందించారు.

చీకటి గెలుపు.. రక్తపాత గెలుపు జగన్‌దే!

ప్రజలు మెచ్చి ఇచ్చిన గెలుపు చంద్రన్నది!!

- **'రిపోర్టర్స్ కలెక్టివ్' గతంలో అమరావతిపై తప్పుడు ఆరోపణలు చేసింది...**
- **నేడు చిత్తూరు పార్లమెంటు పోలింగ్‌ను వక్రీకరించింది...**
- **దీంతో చంద్రబాబు గెలుపుపై, 2024 రాష్ట్ర ఎన్నికల విజయంపై సాక్షి మీడియా దుష్ప్రచార దాడి చేస్తున్నది... రిపోర్టర్స్ కలెక్టివ్, సాక్షి రాతల వెనుక జగన్ ఉన్నారన్నది వాస్తవం.**

చిత్తూరు పార్లమెంటు స్థానంలో ఎంపీ ఓట్లకు, ఎమ్మెల్యేల ఓట్లకు తేడా 31 వేలు అనే 'రిపోర్టర్స్ కలెక్టివ్' ఆరోపణ అబద్ధం. ఈ స్థానంలో ఫామ్ 17 సీ పార్ట్ 1, 2 ప్రకారం ఓట్ల తేడా 0 శాతం మాత్రమే.

AC No	AC Name	PC Voter Turnout	AC Voter Turnout
166	Chandragiri	251797	251788
170	Nagari	176399	176399
171	G.D. Nellore (SC)	181777	181779
172	Chittoor	164788	164788
173	Puthalapattu (SC)	193730	193730
174	Palamaner	235469	235476
175	Kuppam	202920	202920
	Total	**1406880**	**1406880**

- పోలింగ్ మధ్యలో ఆర్వోలు, కలెక్టర్ ఇచ్చే అనెక్సర్-44 కాలమ్ 42లో ప్రతి రెండు గంటలకు ఇచ్చే ఓట్ల సంఖ్య శాతాలు ఉజ్జాయింపు (ప్రొవిజనల్) మాత్రమే.. అవి ఖచ్చితమైనవి (ఫైనల్) కాదని ఆ రిపోర్టులోనే పేర్కొని ఉంటుంది. దీన్ని కప్పిపెట్టడం దురుద్దేశం కాదా?
- పోలింగ్ ముగిసిన పిదప ఫామ్ 17 సీ పార్ట్-1, 2 లలో అన్ని పార్టీల పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్ల సంతకాలతో నమోదు అయ్యే ఓట్ల సంఖ్య, శాతాలు మాత్రమే చట్టప్రకారం ఫైనల్. దీని ప్రకారం చిత్తూరు పార్లమెంట్‌లో ఫామ్ 17 సీ పార్ట్-1, 2 ప్రకారం ఓట్ల తేడా 0 శాతం మాత్రమే.
- 2024 ఎన్నికల్లో జగన్ ప్రభుత్వంలో పెద్దిరెడ్డికి సన్నిహితులైన చిత్తూరు జిల్లా కలెక్టర్, ఆర్వోలు చంద్రబాబుకు అనుకూలంగా ఓట్లు ఎలా తారుమారు చేస్తారనే ఇంకితజ్ఞానం లేకుండా చంద్రబాబు గెలుపుపై జగన్ కిరాయి ముఠా నిందలు వేస్తున్నది.
- తన చీకటి గెలుపును చంద్రబాబుకు అంటగట్టి, చెప్పిన అబద్ధాన్నే వందసార్లు చెప్పిస్తూ, రాయిస్తూ ప్రజలను జగన్ మోసం చేస్తున్నారు.
- కుప్పంలో స్వేచ్ఛగా జరిగిన ఎన్నికల్లో 7 సార్లు చంద్రబాబును భారీ మెజారిటీతో గెలిపించారు.
- స్వేచ్ఛగా పోలింగ్ జరిగితే నేడు పులివెందుల, పుంగనూరులలో జగన్, పెద్దిరెడ్డిలకు ప్రజలు ఎలా బుద్ధి చెబుతున్నారో చూస్తున్నాం కదా!
- 2019 ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల తర్వాత క్యూలైన్లలో ఉన్న ఓటర్లు ద్వారా పోలింగ్‌లో పడ్డ ఓట్లు 13.82 శాతం.
- 2024 ఎన్నికల్లోనూ సాయంత్రం 5 గంటల తర్వాత క్యూలైన్లలో ఉన్న ఓటర్లు ద్వారా పడ్డ ఓట్లు కూడా 13.88 శాతమే. అంటే 2019, 2024 ఎన్నికల్లో ఒకే మోతాదులో పోలింగ్ జరిగింది.
- 2019లో సాయంత్రం 5 తర్వాత పోలైన ఓట్ల శాతాన్ని దాచి, కేవలం 2024లో ఇదే సమయంలో పోలైన ఓట్లను బూతద్దంలో చూపించడం కిరాయితనం కాదా?
- ఢిల్లీకి చెందిన "రిపోర్టర్స్ కలెక్టివ్" న్యూట్రల్ ప్లాట్‌ఫాం కాదు. ఇది జగన్ అనుకూల సంస్థ. గతంలో అమరావతిపై తప్పుడు రాతలు కూడా రాశారు.
- రాష్ట్రంలో 25 పార్లమెంట్ స్థానాలు ఉండగా ప్రత్యేకించి చిత్తూరు పార్లమెంటుపైనే ఎందుకు పడ్డారు? చంద్రబాబు ప్రతిష్ఠను టార్గెట్ చేయడానికే కదా?
- రెండున్నరేళ్ల కిందట అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు జరిగితే, సరిగ్గా స్థానిక సంస్థల ఫలితాల వెల్లడి సమయంలోనే (23 నవంబర్ 2026) ఈ ఫేక్ రిపోర్ట్ ఎందుకు ప్రచురించారు? దాన్ని పట్టుకుని సాక్షిలో చీకటి గెలుపు అంటూ చంద్రబాబుపై ఎందుకు విషం చిమ్మారు?
- బ్యాలెట్ ద్వారా జరిగిన స్థానిక ఎన్నికలలో వైసీపీ కన్నా కూటమికి 25 శాతం అధికంగా వచ్చిన ఓట్లపై చర్చను డైవర్ట్ చేయడానికే జగన్ ఈ స్పాన్సర్డ్ ఫేక్ రిపోర్ట్ ప్రచురించారనేది వాస్తవం కాదా?
- అలాగే ఎలహంక ప్యాలెస్‌లో చెల్లి వాటా ఎగనామం చర్చను కూడా డైవర్ట్ చేసే కుట్ర ఇందులో లేదా?
- సాయంత్రం 5 గంటల తర్వాత చిత్తూరు పార్లమెంట్ స్థానంలో ఉన్న 7 అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు (ఆర్వో) క్యూలైన్లలో ఉన్న 24,596 మందికి ఓటరు స్లిప్పులు ఇచ్చామని రిపోర్టు రాశారు.
- 7 అసెంబ్లీ ఆర్వోల రిపోర్టుకు భిన్నంగా పెద్దిరెడ్డికి సన్నిహితులైన నాటి కలెక్టర్ 56,067 మంది అని తన నివేదికలో రాశారు. ఇది కూడికల్లో పొరపడ్డారా లేక మరేమైనా జరిగిందా? ఏది ఏమైనా ఈ రిపోర్టు ప్రొవిజనల్ మాత్రమే గాని ఫైనల్ కాదు. ఎన్నికల ప్రక్రియలో దీనికి చట్టం ముందు విలువ ఉండదు. దీనికి అన్ని పార్టీల ఎన్నికల ఏజెంట్ల సంతకాలు ఉండవు. అది ఉజ్జాయింపు మాత్రమే. అందులో పొరపాట్లు కూడా జరిగే అవకాశం ఉంది.
- అనెక్సర్-44లో 48 కాలమ్స్ ఉంటాయి. ఇందులో 42వ కాలంలో ప్రతి 2 గంటలకు పోలైన ఓట్ల శాతం ప్రొవిజనల్ మాత్రమే కానీ ఫైనల్ కాదు. ఈ ప్రొవిజనల్ నమోదుల్లో కాంగ్రెస్ పాలనలో గానీ, నేడు ఎన్డీయే పాలనలో గానీ ఇలాంటి తేడాలు అన్ని రాష్ట్రాలలో వ్యక్తమయ్యాయి. కనుక ఇది పరిగణలోకి తీసుకోదగినది కాదు.
- పోలింగ్ రోజున పోలింగ్ ముగిసిన పిదప ప్రిసైడింగ్ అధికారి (పీఓ) ఈవీఎం మిషన్లలోని ఓట్లను ఫామ్ 17 సీ పార్ట్-1 లో అసెంబ్లీ (ఏసీ), పార్లమెంట్ (పీసీ) లకు విడివిడిగా నమోదు చేసి తయారు చేస్తారు. అక్కడ ఉన్న అన్ని పార్టీల (టీడీపీ, జేఎస్పీ, బీజేపీ, వైసీపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, ఇండిపెండెంట్లు) పోలింగ్ ఏజెంట్లకు అధికారిక ఫామ్ 17 సీ పార్ట్-1 కాపీ ఇస్తారు. పార్టీల ఎన్నికల ఏజెంట్ల సంతకాలు కూడా తీసుకుంటారు. దీనిలో ఓట్లు అవకతవకలు జరిగాయని వైసీపీ గానీ మరో పార్టీ పోలింగ్ ఏజెంట్ గానీ అభ్యంతరం రాయలేదు. సక్రమంగా ఉన్నవి కనుక ఈవీఎంకు ప్రభుత్వ సీల్‌తో పాటు అన్ని పార్టీల పోలింగ్ ఏజెంట్లు సీల్ వేసి దాన్ని కౌంటింగ్ కేంద్రానికి పంపుతారు. ఇది అధికారిక ప్రక్రియ. ఇందులోని ఓట్ల సంఖ్య మాత్రమే ఫైనల్.
- కౌంటింగ్ రోజున: అన్ని పార్టీల కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో అధికారులు ఈవీఎంల సీళ్లు సరిచూపించి దాన్ని ఓపెన్ చేస్తారు. ఈవీఎంలో ఏ పార్టీ అభ్యర్థికి ఎన్ని ఓట్లు పడ్డాయో కౌంటింగ్ ఏజెంట్లకు చూపించి ఫామ్ 17సీ పార్ట్-2 లో నమోదు చేస్తారు. ఈ ప్రక్రియలో కూడా వైసీపీ కౌంటింగ్/పోలింగ్ ఏజెంట్‌తో సహా మరే పార్టీ ఏజెంట్ కూడా అభ్యంతరం పెట్టలేదు, రాయలేదు.
- రిజల్ట్ షీట్: పోలింగ్ స్టేషన్ వారీగా, అభ్యర్థి వారీగా వచ్చిన ఓట్ల వివరాలను ఫామ్-20లో పోటీ చేసిన అభ్యర్థుల సమక్షంలోనే తయారు చేస్తారు. దీనిపై కూడా వైసీపీ అభ్యర్థులతో సహా మరే పార్టీల అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేయలేదు.
- సాయంత్రం 5 గంటల తర్వాత క్యూలైన్‌లో ఉండి 17 లక్షల మంది ఓట్లు వేయడం గోల్‌మాల్ కాదా? అని శంకలు లేవనెత్తుతున్నారు. 2024 అసెంబ్లీ/పార్లమెంట్ ఎన్నికలలో సాయంత్రం 5 తర్వాత పోలైన ఓట్లు 13.82%.
- 2019 అసెంబ్లీ/పార్లమెంట్ ఎన్నికలలో కూడా సాయంత్రం 5 గంటల తర్వాత క్యూలైన్లలో ఉండి పోలైన ఓట్లు 13.88 శాతంగా నమోదు అయి ఉన్నవి. దీనికి కిరాయి మేధావులు ఏమి సమాధానం చెబుతారు?
- జగన్ ముఖ్యమంత్రి అయిన 2019 ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల తర్వాత పోలైన 13.88 శాతం ఓట్లు సహజమని వైసీపీ వాదన. మరి 2024లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన ఎన్నికల్లో సాయంత్రం 5 తర్వాత పోలైన 13.82 శాతం గోల్‌మాల్ ఎలా అవుతుంది? తనకు వర్తించిన రూలు ఎదుటి వారికి వర్తించదా?
- కుప్పం అసెంబ్లీ స్థానంలో సాయంత్రం 5 తర్వాత క్యూలైన్లలో 9,689 మందికి ఓటర్లకు స్లిప్పులు ఇచ్చినట్లు అధికారిక రికార్డులు స్పష్టం చేస్తున్నవి.
- కుప్పంలో చంద్రబాబు 2024లో 45 వేల ఓట్లకు పైగా మెజారిటీతో గెలిచారు. కుప్పం ప్రజలు ఇప్పటికీ 7 సార్లు చంద్రబాబును ఎమ్మెల్యేగా గెలిపించారు. చీకటి గెలుపు అని కుప్పం ప్రజల తీర్పును సాక్షి అవమానిస్తున్నది. ఇది నేరం కాదా?
- "30 ఏళ్ల తర్వాత నా ఓటు నేను వేసుకోగలిగాను" అని మొన్న పులివెందుల స్థానిక సంస్థల ఎన్నికల్లో బ్యాలెట్ బాక్స్‌లో ఒక ఓటరు స్లిప్ వేశారు. అంటే పులివెందులలో బెదిరించి, రక్తపాతంతో గెలుస్తున్నారనేది జగమెరిగిన సత్యం, రుజువైన సత్యం. చీకటి గెలుపు గానీ, రక్తపాత గెలుపు గానీ జగన్‌కు వర్తిస్తుంది కానీ చంద్రబాబుకు వర్తించదు. తన అవలక్షణాలు చంద్రబాబుకు అంటగట్టి, చెప్పిన అబద్ధమే వందసార్లు చెప్పడం, చెప్పించడం జగన్ నైజం.
- చంద్రబాబు ప్రతిష్ఠను దెబ్బతీయడానికి అబద్ధపు ప్రచార హోరు సాగిస్తున్నారు. ఇందుకు సాక్షితో పాటు కిరాయి మేధావుల్ని రంగంలోకి దించారు. ఎన్డీయే గుడ్డి వ్యతిరేకులైన కొందరు ఢిల్లీ మేధావుల్ని కూడా వాడుకుంటున్నారు.
- అబద్ధపు ప్రచారాన్ని, కుల, మత, ప్రాంతీయ విద్వేష ప్రచారాన్ని ఏపీ ప్రజలు నమ్మరు. 2019లో ఒక అవకాశం ఇచ్చి సీఎంను చేస్తే ప్రజల ధన, మాన, ప్రాణాలకు, ఆస్తులకు ప్రమాదం తలపెట్టిన జగన్‌ను ప్రజలు ఇక నమ్మబోరని స్థానిక ఎన్నికల్లో ఎన్డీయేకి పెరిగిన ఓట్ల శాతం రుజువు చేస్తున్నది.

సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం, సుపరిపాలనలో చంద్రబాబు ఆయనకు ఆయనే సాటి. 2029లోనూ కూటమిని గెలిపించి స్వర్ణాంధ్రను సాకారం చేసుకుంటారు ప్రజలు.

- గురజాల మాల్యాద్రి,
చైర్మన్, టీడీపీ నాలెడ్జ్ సెంటర్



చైతన్యరథం

పంచాయతీ ఎన్నికల్లో వైసీపీకి ప్రజా మద్దతు కరువు

- 26 శాతానికే పరిమితమైన గొడ్డలిపార్టీ
- బ్యాలెట్.. ఈవీఎం ఏదయినా ప్రజల మద్దతు కూటమికే
- ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాం.. అందుకే ప్రజలు ఆదరించారు
- కుప్పంలో టీడీపీ కార్యకర్త మృతిపై వైసీపీ, సాక్షి పత్రిక దుష్ప్రచారం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో జరిగిన తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో కూటమికి ప్రజలు మద్దతు తెలపడం ప్రభుత్వంపై వారికున్న నమ్మకానికి నిదర్శనమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వం,ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ నాయకత్వం, యువనేత నారా లోకేష్ ఆలోచనా విధానంపై ప్రజలు విశ్వాసం ఉంచారని తెలిపారు.కూటమి అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, విజయం సాధించిన అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజలు కూటమికి మద్దతు తెలిపారు.. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన తొలి విడత పంచాయతీ ఎన్నికల్లోనూ అదే ఆదరణ కనిపించింది.. ఈ ఎన్నికల్లో వైసీపీని 26శాతం సీట్లకే ప్రజలు పరిమితంచేశారు.. గ్రామీణ ఓటర్లలోనూ వైసీపీ పట్ల ఆదరణ తగ్గుతోందని ఈ ఫలితాలు తెలియజేస్తున్నాయన్నారు.

బ్యాలెట్.. ఈవీఎం ఏదయినా ప్రజల తీర్పు కూటమికే

2024 ఎన్నికల్లో ఈవీఎంలపై వైసీపీ నాయకులు అనేక ఆరోపణలు చేశారని, ఇప్పుడు బ్యాలెట్ పద్ధతిలో జరిగిన ఎన్నికల్లోనూ ప్రజలు కూటమికి మద్దతు తెలిపారని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్, బ్యాలెట్, ఈవీఎం.. ఏ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించినా ప్రజలతీర్పు కూటమికి అనుకూలంగానే ఉందని తెలిపారు. ఎన్నికల విధానంపై ఆరోపణలు చేయడం మానుకొని ప్రజల తీర్పును గౌరవించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు గ్రామీణ ప్రజలకు చేరుతున్నాయని, వాటిని గుర్తించే ప్రజలు ఓట్లు వేశారని పల్లా అన్నారు. ప్రజలకు అందుతున్న సంక్షేమాన్ని, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని గుర్తించి కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపారని పేర్కొన్నారు.

2021లో వైసీపీ దౌర్జన్యాలు.. ఇప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో దౌర్జన్యాలు, బెదిరింపులు, దాడులు, బలవంతపు ఏకగ్రీవాలు చోటుచేసుకున్నాయని పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించిందన్నారు. అభ్యర్థుల ఎంపికలో విద్యార్హతలు, సామాజిక న్యాయం, స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్నామని,ప్రజలు కూడా అన్ని అంశాలను పరిశీలించి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు.

కుప్పం ఘటనపై వైసీపీది తప్పుడు ప్రచారం

కుప్పం మండలం వానగుట్టపల్లిలో వైసీపీ నేతల దాష్టీకానికి మృతి చెందిన రాజేంద్రన్ తెలుగుదేశం పార్టీ కార్యకర్త అని, ఆయనకు పార్టీ సభ్యత్వం కూడా ఉందని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. వైసీపీ కార్యకర్త మృతి చెందినట్లు ప్రచారం చేస్తూ టీడీపీ నాయకులపై నిందలు వేయడం సరికాదన్నారు. ఏమ రాజేంద్రన్ టీడీపీ పార్టీ సభ్యత్వ నెం.19023144 (2024-2026) వివరాలే ఇందుకు ఆధారమని తెలిపారు. వాస్తవాలను పక్కనపెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేయడం వైసీపీకి అలవాటుగా మారిందని విమర్శించారు. ప్రజలు ఇలాంటి ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎన్నికల్లో ప్రజల మద్దతు పొందలేకపోయిన వైసీపీ నాయకులు వారి ఓటమిని జీర్ణించుకోలేక కూటమి నాయకులపై దౌర్జన్యాలు,అక్రమ అరెస్టుల ఆరోపణలు చేస్తున్నారని పల్లా తప్పుబట్టారు. టీడీపీ,జనసేన,బీజేపీ ఎప్పుడూ ప్రజాస్వామ్యబద్ధమైన ఎన్నికలకే ప్రాధాన్యత ఇస్తాయని చెప్పారు. ప్రజల ఆశీస్సులతో గెలిచి, వారి మద్దతు తోనే ప్రభుత్వాన్ని నడపాలన్నది చంద్రబాబు నాయుడు ఆలోచన అని తెలిపారు. అకాలంగా మృతి చెందిన టీడీపీ కార్యకర్త రాజేంద్రన్ కుటుంబాన్ని పార్టీ అన్ని విధాలా ఆదుకుంటుందని పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. పార్టీ సభ్యత్వ బీమా ద్వారా రూ.5 లక్షలు అందిస్తామని,కుటుంబానికి అవసరమైన ఇతర సహాయ సహకారాలు కూడా అందిస్తామని తెలిపారు. కార్యకర్తే అధినేత అన్నది తెలుగుదేశం పార్టీ విధానమని, కష్టాల్లో ఉన్న కార్యకర్తలకు అండగా నిలవడం తమ బాధ్యతని స్పష్టం చేశారు. బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించి నాయకులుగా తీర్చిదిద్దిన పార్టీ తెలుగుదేశం అని పేర్కొన్నారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేయాల్సిన బాధ్యత పత్రికలకు ఉండాలని పల్లా హితవు పలికారు. రాజకీయ ప్రయోజనాల కోసం వార్తలు రాయడం, వాస్తవాలను పరిశీలించకుండా కథనాలు ప్రచురించడం సరికాదన్నారు. సాక్షి పత్రికలో వస్తున్న కథనాలు ప్రజలను తప్పుదారి పట్టించేలా ఉన్నాయని విమర్శించారు. పత్రికా విలువలను పాటిస్తూ వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

త్రిపుల్ ఇంజన్ సర్కార్‌తో స్వర్ణాంధ్రప్రదేశ్

రాష్ట్రంలో ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో డబుల్ ఇంజన్ సర్కార్ పనిచేస్తోందని, స్థానిక సంస్థల్లోనూ కూటమి గెలుపుతో 'త్రిపుల్ ఇంజన్ సర్కార్' ఏర్పడి అభివృద్ధి మరింత వేగవంతమవుతుందనే నమ్మకంతో ప్రజలు ఓట్లు వేస్తున్నారని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. రాబోయే రెండు, మూడు విడతల పంచాయతీ ఎన్నికల్లోనూ ఇదే స్ఫూర్తి కొనసాగుతుందని, వైసీపీ మరింత దిగువ స్థాయికి పడిపోవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు, యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ విజయం మరింత స్ఫూర్తినిచ్చిందని పల్లా శ్రీనివాసరావు అన్నారు.

గ్రామాల ప్రగతికి కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వండి

- మంత్రి వాసంశెట్టి సుభాష్ విజ్ఞప్తి
- ద్రాక్షారామం సర్పంచ్ ఎన్నికల్లో ఇంటింటి ప్రచారం



రామచంద్రపురం (చైతన్యరథం): గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, రాష్ట్ర అభివృద్ధి ప్రస్థానం మరింత ముందుకు సాగేందుకు కూటమి బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులకు ప్రజలు తమ మద్దతు అందించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ విజ్ఞప్తి చేశారు. డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం రూరల్ మండలం ద్రాక్షారామం గ్రామ సర్పంచ్ అభ్యర్థి యండమూరి ఈశ్వరరావు, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న కూటమి బలపరిచిన అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గొల్లపల్లి అమూల్య, జిల్లా టీడీపీ అధ్యక్షుడు గుత్తుల సాయి, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, ఎంపీపీ డాక్టర్ మడకా రాంబాబు, మాగాపు అమ్మిరాజు, శాఖా బాబి, తదితరులు శుక్రవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని పలు వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని కూటమి అభ్యర్థులకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు కోసం కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో ప్రజలు కూటమిపై నమ్మకంతో తమ ఓటు వేసి ఘనమైన విజయాన్ని అందించారని గుర్తుచేశారు. అదే ప్రజా మద్దతు గ్రామపంచాయతీ ఎన్నికల్లోనూ కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించే నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. గత సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే ప్రజలు ఎన్డీఏ కూటమి పాలనపట్ల అమితమైన నమ్మకంతో ఉన్నారని వ్యాఖ్యానించారు. ఈ మంచి ప్రభుత్వానికి, స్థానిక ఎన్నికల్లో కూడా అండగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గొల్లపల్లి అమూల్య మాట్లాడుతూ.. ప్రజల ఆశీర్వాద బలంతో గ్రామపంచాయతీ ఎన్నికల్లో కూటమి జైత్రయాత్ర కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధి జరిగితేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని, గ్రామ పంచాయతీలు అభివృద్ధికి పునాదులుగా నిలుస్తాయన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. గ్రామాల్లో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు ప్రజల సమస్యలకు స్థానికంగానే పరిష్కారం చూపే బాధ్యత సర్పంచ్, వార్డు సభ్యులపై ఉంటుందని పేర్కొన్నారు.

మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు అందించిన మద్దతు స్ఫూర్తిదాయకమని, అదే విధంగా గ్రామపంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి బలపరిచిన అభ్యర్థులకు ప్రజలు తమ మద్దతు తెలియజేయాలని కోరారు. గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో పోటీలో ఉన్న సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు, కూటమి శ్రేణులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మత్స్యకారుల ప్రాణరక్షణలో

నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

- తుఫాను హెచ్చరికలు, భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- మిగిలిన బోట్లకూ త్వరితగతిన ట్రాన్స్‌పాండర్లు
- అర్హులైన మత్స్యకారులందరికీ బీమా రక్షణ
- ప్రభుత్వం ఇచ్చిన భద్రత నియమాలు పాటించేలా చూడాలి
- అధికారుల అలసత్వంతో ప్రాణనష్టం జరిగితే కఠిన చర్యలు
- సమీక్షలో రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు
- రాష్ట్రవ్యాప్తంగా బోట్ల ఫిట్‌నెస్, భద్రతా పరికరాలపై సమగ్ర తనిఖీలకు మంత్రి ఆదేశం

అమరావతి (చైతన్యరథం): మత్స్యకారుల ప్రాణరక్షణ, వారి కుటుంబాల భద్రత, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లే ప్రతి మత్స్యకారుడూ ప్రభుత్వం నిర్దేశించిన భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మత్స్యకారుల భద్రత, ట్రాన్స్‌పాండర్ల ఏర్పాటు, బోట్ల ఫిట్‌నెస్, బీమా సౌకర్యం, తదితర అంశాలపై మంత్రి శుక్రవారం విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫానులు, విపత్కర పరిస్థితుల్లో మత్స్యశాఖ, విపత్తుల నిర్వహణ శాఖ, ఆర్టీజీఎస్ జారీ చేస్తున్న హెచ్చరికలను పట్టించుకోకుండా కొందరు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్తుండటం ఆందోళనకరమన్నారు. సముద్రంపై ఎంత అనుభవం ఉన్నప్పటికీ ప్రకృతి విపత్తులను తేలిగ్గా తీసుకోవద్దని హితవు పలికారు. ఒక్కోసారి చిన్నపాటి నిర్లక్ష్యం కూడా విలువైన ప్రాణాలను బలితీసుకుంటుందని, కుటుంబాలను తీవ్ర విషాదంలోకి నెడుతుందని పేర్కొన్నారు. తుఫానుల సమయంలోనే కాకుండా సాధారణ వేటకు వెళ్లేటప్పుడు కూడా ప్రభుత్వం రూపొందించిన ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని కచ్చితంగా అనుసరించాలని సూచించారు. భద్రతా ప్రమాణాలపై మత్స్యకారులకు ముందుగా పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, ఆ తర్వాత కూడా నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో కఠినంగా వ్యవహరించడం మత్స్యకారుల ప్రాణాలను కాపాడటానికేనని స్పష్టం చేశారు.

ట్రాన్స్‌పాండర్ల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ

రాష్ట్రంలోని సుమారు 80 శాతం మత్స్యకార బోట్లకు ఇప్పటికే ట్రాన్స్‌పాండర్లు అమర్చినట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మిగిలిన బోట్లకు కూడా వీలైనంత త్వరగా వీటిని ఏర్పాటు చేసేందుకు మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సముద్రంలో అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ట్రాన్స్‌పాండర్లను ఎలా వినియోగించాలి, వాటి ద్వారా సహాయం ఎలా పొందాలనే అంశాలపై మత్స్యకారులకు ప్రత్యేక అవగాహన కల్పించాలని సూచించారు. పరికరాలను అమర్చడంతోనే బాధ్యత పూర్తయినట్లు భావించకుండా అవి సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. సాంకేతిక లోపాలున్న వాటికి తక్షణమే మరమ్మతులు చేయించాలని, సాధ్యంకాని పక్షంలో కొత్తవి అందించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ట్రాన్స్‌పాండర్ల ఏర్పాటు, నిర్వహణ, వినియోగంపై అవగాహన కల్పించడంలో అధికారుల అలసత్వాన్ని ఉపేక్షించబోమని హెచ్చరించారు.

ప్రతి బోటు ఫిట్‌నెస్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలి

రాష్ట్రవ్యాప్తంగా తీరప్రాంతాల్లోని మత్స్యకార బోట్ల ఫిట్‌నెస్, భద్రతా ప్రమాణాలపై మరోసారి సమగ్ర తనిఖీలు నిర్వహించాలని మత్స్యశాఖ కమిషనర్‌ను మంత్రి ఆదేశించారు. ఎన్ని బోట్లకు ట్రాన్స్‌పాండర్లు అమర్చారు, ఇంకా ఎన్నింటికి ఏర్పాటు చేయాల్సి ఉంది, అమర్చిన వాటిలో ఎన్ని పనిచేస్తున్నాయి, మిగిలిన బోట్లలో ఏర్పాటు చేయకపోవడానికి కారణాలేమిటనే వివరాలతో పూర్తిస్థాయి నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. సాంకేతిక సమస్యలతో పాటు అధికారుల స్థాయిలో ఏవైనా లోపాలు ఉన్నాయా అనే అంశాన్ని కూడా పరిశీలించాలన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లే ముందే బోట్ల ఫిట్‌నెస్, అవసరమైన రక్షణ



పరికరాలు సక్రమంగా ఉన్నాయని నిర్ధారించుకోవాలని స్పష్టం చేశారు. ట్రాన్స్‌పాండర్లు పాడైనా, ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తినా మత్స్యకారులు వెంటనే సంబంధిత ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్ లేదా గ్రామస్థాయిలోని విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని సూచించారు. ఫిర్యాదులు అందిన వెంటనే అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలన్నారు. సంబంధిత సిబ్బంది నుంచి సరైన స్పందన లేకపోతే నేరుగా తన దృష్టికి సందేశం ద్వారా తీసుకురావచ్చని, అటువంటి విషయాలపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటామని మత్స్యకారులకు మంత్రి భరోసా ఇచ్చారు.

అర్హులైన మత్స్యకారులందరికీ బీమా

మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంలో బీమా అత్యంత కీలకమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. అర్హులైన ఏ ఒక్క మత్స్యకారుడూ బీమా రక్షణకు దూరం కాకూడదని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు ద్వారా అమలవుతున్న బీమా పథకం పరిధిలోకి అర్హులందరినీ తీసుకురావాలని మత్స్యశాఖ కమిషనర్‌ను ఆదేశించారు. సముద్రంలో చేపల వేట సాగించేవారితో పాటు చేపలు, రొయ్యల చెరువుల్లో పనిచేసే కార్మికులు, ఫీడ్ రంగం సహా మత్స్య అనుబంధ కార్యకలాపాలపై ఆధారపడిన వారికి కూడా ఆయా పథకాల అర్హత నిబంధనల మేరకు బీమా ప్రయోజనాలు అందేలా చూడాలన్నారు. ఇందుకోసం అర్హుల వివరాలను సమగ్రంగా పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అర్హులైన మత్స్యకారులు బీమా ప్రయోజనాలను కోల్పోయే పరిస్థితి తలెత్తకూడదని మంత్రి హెచ్చరించారు. అటువంటి ఘటనలు జరిగితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు నిబంధనల ప్రకారం నష్టపోయిన మొత్తాన్ని సంబంధిత అధికారుల నుంచి రికవరీ చేసే పరిస్థితి కూడా రావచ్చని స్పష్టం చేశారు. అధికారుల చిన్నపాటి అలసత్వం కూడా ఒక మత్స్యకార కుటుంబానికి జీవితాంతం తీరని నష్టాన్ని మిగిల్చే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ జవాబుదారీతనంతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

మత్స్యకారుల భద్రతపై రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక సమీక్ష

అనుకోకుండా జరిగే కొన్ని ప్రమాదాలను నివారించడం సాధ్యం కాకపోవచ్చని, అయితే మానవ తప్పిదాలు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా జరిగే ప్రాణనష్టాన్ని ఎంతమాత్రం సహించబోమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించకపోవడం, అవసరమైన రక్షణ పరికరాలు అందించకపోవడం, సాంకేతిక లోపాలను సకాలంలో పరిష్కరించకపోవడం వల్ల ప్రమాదాలు సంభవిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా మత్స్యశాఖ అధికారులతో తక్షణమే ప్రత్యేక సమీక్ష నిర్వహించి, భద్రతా ప్రమాణాల అమలుపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కమిషనర్‌కు సూచించారు. క్షేత్రస్థాయిలో చేపట్టిన చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రతి అధికారి అప్రమత్తంగా వ్యవహరించేలా చూడాలని ఆదేశించారు. మత్స్యకారుల ప్రతి ప్రాణం ప్రభుత్వానికి అత్యంత విలువైనదని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. వారి భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదన్నారు. మత్స్యకారులు ప్రభుత్వ హెచ్చరికలను గౌరవిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అధికారులు తమ విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. మత్స్యకారుల ప్రాణరక్షణతో పాటు వారి కుటుంబాల సంక్షేమం, ఆర్థిక భద్రతకు కూటమి ప్రభుత్వం పూర్తి కట్టుబాటుతో ఉందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

కుప్పంలో టీడీపీ కార్యకర్త రాజేంద్ర మృతికి..

గొడ్డలిపార్టీ దాడులే కారణం

- మృతుడు వైసీపీ కార్యకర్త అంటూ తప్పుడు ప్రచారం
- రాజేంద్ర కుటుంబానికి పార్టీ తరఫున రూ.10 లక్షల ఆర్థిక సాయం
- కుటుంబానికి అండగా ఉంటామని యువనేత లోకేష్ హామీ
- 2021లో అరాచకాలతో కుప్పంలో గెలిచిన జగన్ పార్టీ
- ఇప్పుడూ అవే కుట్రలకు దిగిన ఎమ్మెల్సీ భరత్
- టీడీపీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

అమరావతి (చైతన్యరథం): 40 ఏళ్లుగా ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న కుప్పం నియోజకవర్గంలో 2019-24 మధ్య వైసీపీ పాలనలో రాజకీయ కక్షలు, దౌర్జన్యాలు,దాడులతో భయానక వాతావరణం సృష్టించారు... ఇప్పుడు అదే సంస్కృతిని ఆ పార్టీ శ్రేణులు కొనసాగిస్తున్నాయని టీడీపీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మండిపడ్డారు. శుక్రవారం కుప్పంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ కుప్పంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నప్పటికీ, గురువారం కుప్పం మండలం వానగుట్టపల్లి పంచాయతీ రీకౌంటింగ్ అంశంపై చర్చ జరుగుతున్న సమయంలో వైసీపీ శ్రేణులు రెచ్చిపోయి రాళ్ల దాడులకు దిగారన్నారు. ఈ దాడుల్లో ఎన్నికల అధికారుల వాహనాలు ధ్వంసమయ్యాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో వాహనాన్ని వేగంగా తరలించే క్రమంలో జంపనూరుకు చెందిన టీడీపీకార్యకర్త రాజేంద్ర మృతి చెందారు. కేవలం వైసీపీ శ్రేణులు చేసిన రాళ్ల దాడి కారణంగానే టీడీపీ కార్యకర్త మృతిచెందాడు.మృతుడు టీడీపీ సభ్యత్వం కలిగి ఉన్న కార్యకర్త. ఆయన కుమారుడు పార్టీలో చురుగ్గా ఉన్నారు. టీడీపీ కార్యకర్తను వారి పార్టీ కార్యకర్త అంటూ గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారంచేస్తోంది.అలాగే శాంతిపురం మండలం కర్ల గట్టలో టీడీపీ బలపరిచిన అభ్యర్థి విజయం సాధించడంతో కక్షపూరితంగా టీడీపీ నాయకుడు చంద్రశేఖర్ ఇంటిపై దాడిచేసి,కారును ధ్వంసం చేయడంతోపాటు ఇంటి తలుపులపై రాళ్లతో దాడిచేశారు. చంపేవాడైనా.. అవసరమైతే చచ్చేవాడినైనా అభ్యర్థిగా నిలబెట్టాలంటూ వైసీపీ ఎమ్మెల్సీ భరత్ గతంలో చేసిన రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఇలాంటి ఘటనలకు కారణమవుతున్నాయి. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాలతో ఐదేళ్లపాటు కుప్పంలో అరాచక రాజకీయాలు సాగించారు. 2021స్థానిక ఎన్నికల్లో దౌర్జన్యాలు చేయకుండా ప్రజల ఓట్లతోనే గెలిచామని చెప్పే ధైర్యం భరత్‌కు ఉందా? ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా అధికారులపై దాడులు చేయడం, గెలిచిన



అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. మా నాయకుడు చంద్రబాబు మాకుసంస్కారం నేర్పించారు. వైసీపీ శ్రేణులు దాడులకు తెగబడ్డా మేము ఎక్కడా ఎదురుదాడులకు దిగలేదు.కుప్పంలో జరిగిన ఘటనలపై చట్టపరమైన చర్యలుతీసుకోవాలని పోలీసులను కోరాం. మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి టీడీపీ తరఫున రూ.10లక్షల ఆర్థిక సాయం అందజేశాం. పార్టీ తరఫున రాజేంద్ర కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి నారా లోకేష్ తెలిపారు. కార్యకర్తలకు, వారి కుటుంబాలకు కష్టకాలంలో అండగా నిలవడం తెలుగుదేశం పార్టీ సంస్కృతి. రాజకీయాలు హుందాగా చేయాలి. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించాలి. దాడులకు పాల్పడితే చట్టం చూస్తూ ఊరుకోబోదని ఎమ్మెల్యే శ్రీకాంత్ స్పష్టం చేశారు.

రాయలసీమ లిఫ్ట్‌పై జగన్‌వి పచ్చి అబద్ధాలు

- వాస్తవాలను ప్రజల ముందు ఉంచే ధైర్యం గొడ్డలిపార్టీకి ఉందా?
- 2020లోనే ఎన్జీటీ స్టే ఇచ్చి, 2023లో రూ.2.65 కోట్ల జరిమానా విధించింది
- అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్నది జగనా? చంద్రబాబా?
- రాయలసీమ లిఫ్ట్ స్కీం తాగునీటి అవసరాల కోసమేనని జీవో ఇచ్చింది జగన్ కాదా?
- ఇప్పుడు రాయలసీమ భవిష్యత్తును మార్చే ప్రాజెక్టు అంటూ మాట మార్చి మోసం
- రాయలసీమలో 102 ప్రాజెక్టులను ప్రీ క్లోజర్ చేసిన ఘనత జగన్‌దే
- కూటమి ప్రభుత్వం 27 నెలల్లోనే రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై రూ.13,484 కోట్ల ఖర్చు
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు (చైతన్యరథం): రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రంగా విమర్శించారు. అనుకూల మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా జగన్ రోజూ ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా ప్రజలు వాటిని నిజాలుగా నమ్మే పరిస్థితి లేదని ఆయన స్పష్టం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు జగన్ హయాంలోనే నిలిచిపోయిందనడానికి స్పష్టమైన ప్రభుత్వ ఉత్తర్వులు, ఎన్జీటీ ఆదేశాలు ఆధారాలుగా ఉన్నాయని మంత్రి నిమ్మల తెలిపారు.

స్టే ఉత్తర్వులపై కనీసం అప్పీలు కూడా చేయలేదు..

2020లో ఒక చేత్తో రాయలసీమ లిఫ్ట్‌కు పరిపాలనా అనుమతులు ఇచ్చి, రెండో చేత్తో ఎన్జీటీ ద్వారా స్టే తెప్పించింది జగన్ మోహన్ రెడ్డి కాదా? నాడు ఎన్జీటీ స్టే విధిస్తే కనీసం అప్పీలు కూడా దాఖలు చేయకుండా రాయలసీమకు ద్రోహం చేశారు. 22.03.2023న ఎన్జీటీ ఈ ప్రాజెక్టుపై రూ.2.65 కోట్ల జరిమానా విధించినప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నది జగన్ మోహన్ రెడ్డి కాదా? ఆనాడు తన రాజకీయ గురువు కేసీఆర్‌ను ఒప్పించి ప్రాజెక్టును ఎందుకు కొనసాగించలేకపోయారో సమాధానం చెప్పాలి. ఈ రెండు సందర్భాల్లోనూ ముఖ్యమంత్రిగా ఉన్నది జగన్‌మోహన్‌రెడ్డినని, చంద్రబాబు కాదని స్పష్టం చేశారు.

అంతేకాకుండా, 2023 ఆగస్టు 11న జారీ చేసిన జీవో నంబర్ 364లో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు సాగునీటి అవసరాల కోసం కాదని, కేవలం పరిమితమైన తాగునీటి అవసరాల కోసమేనని అప్పటి వైసీపీ ప్రభుత్వం పేర్కొందని మంత్రి నిమ్మల గుర్తుచేశారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రాజెక్టు పరిధిని తాగునీటి అవసరాలకే పరిమితం చేస్తూ జీవో ఇచ్చిన జగన్, ఇప్పుడు అదే ప్రాజెక్టును రాయలసీమ భవిష్యత్తును మార్చే జీవనాడిగా అభివర్ణించడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. నాటి ఏపీ సీఎం జగన్‌కు వార్నింగ్ ఇచ్చి రాయలసీమ లిఫ్ట్‌ను నిలిపివేశామని తెలంగాణ మాజీ మంత్రి హరీష్ రావు స్వయంగా ప్రకటించినా జగన్ కానీ, ఆయన పత్రిక కానీ ఎందుకు సమాధానం చెప్పడం లేదని మంత్రి నిమ్మల నిలదీశారు.

సీమ ద్రోహి జగన్

రాయలసీమ ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతిక అర్హత జగన్‌కులేదని మంత్రి నిమ్మల అన్నారు. 2019 నుంచి 2024వరకు వైసీపీ పాలనలో రాయలసీమకు చెందిన 102 సాగునీటి ప్రాజెక్టులను జీవో నంబర్ 365 ద్వారా ప్రీ క్లోజర్ చేశారని విమర్శించారు. కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల రైతాంగానికి ఉపయోగపడే ప్రాజెక్టులను నిలిపివేసి, ఇప్పుడు రాయలసీమ అభివృద్ధి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. రాయలసీమ రైతులకు వరప్రదాయినిగా నిలిచే డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని కూడా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 90శాతం సబ్సిడీ లభించే ఈ పథకాన్ని అమలు చేయకుండా రైతులకు అన్యాయం చేశారని విమర్శించారు. రాయలసీమకు గుండెకాయ వంటి శ్రీశైలం ప్రాజెక్టు భద్రత విషయంలోనూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని మంత్రి అన్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో ప్లంజ్ పూల్ మరమ్మతులకు ఐదేళ్లపాటు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.205 కోట్లతో మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేసి ప్రాజెక్టు భద్రతకు చర్యలు చేపట్టిందన్నారు. అదేవిధంగా రాయలసీమ సాగు, తాగునీటి అవసరాలకు కీలకమైన తుంగభద్ర ప్రాజెక్టు గేట్ల నిర్వహణను కూడా గత ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. 2024 వరదల సమయంలో 19వ నంబర్ గేటు కొట్టుకుపోవడం గత పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొత్తం గేట్లను ఆధునీకరించి కొత్త గేట్లను ఏర్పాటు చేసిందని, ఇటీవల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక



ముఖ్యమంత్రులతోపాటు కేంద్ర జలశక్తి మంత్రి సమక్షంలో వాటిని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. గోరకల్లు రిజర్వాయర్ విషయంలోనూ గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మంత్రి అన్నారు. గోరకల్లు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు ఉంటేనే అవుకు, గండికోట, చిత్రావతి రిజర్వాయర్లకు నీరు చేరుతుందని, తద్వారా పులివెందుల సహా రాయలసీమ ప్రాంతాలకు సాగు, తాగునీరు అందుతుందని వివరించారు. గోరకల్లు భద్రతకు అవసరమైన మరమ్మతులు చేపట్టకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మంత్రి నిమ్మల విమర్శించారు.

టీడీపీ హయాంలోనే..

2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులపై రూ.12,000 కోట్లు ఖర్చు చేశామని, 2019-24 మధ్య ఐదేళ్ల వైసీపీ పాలనలో కేవలం రూ.2,000 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని మంత్రి నిమ్మల తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ పరిమాణం పెరిగినా రాయలసీమ సాగునీటి రంగానికి వైసీపీ ప్రభుత్వం కేటాయింపులు పెంచలేదని విమర్శించారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 27 నెలల్లోనే రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై రూ.28,000 కోట్ల మేర ఖర్చు చేయగా, అందులో రాయలసీమ ప్రాజెక్టులకే రూ.13,484 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల కోసం మరో రూ.10,014 కోట్లు కేటాయించనున్నట్లు వెల్లడించారు.

చంద్రబాబు దూరదృష్టి వల్లే..

రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా జలాల్లో 512 టీఎంసీల వాటా సాధించడంలో చంద్రబాబు నాయుడు దూరదృష్టి కీలక పాత్ర పోషించిందని మంత్రి నిమ్మల పేర్కొన్నారు. పట్టిసీమ ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేసి గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించడం వల్ల కృష్ణా జలాలపై ఒత్తిడి తగ్గి, శ్రీశైలం జలాలను రాయలసీమ అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఏర్పడిందన్నారు.

సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యత

హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులను కూటమి ప్రభుత్వం వేగవంతం చేసి, సుమారు రూ.3,800 కోట్ల వ్యయంతో 738వ కిలోమీటరు వరకు కృష్ణా జలాలను తీసుకెళ్లిందని తెలిపారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేయలేని పనులను కూటమి ప్రభుత్వం వేగంగా ముందుకు తీసుకెళ్తోందని చెప్పారు. రాయలసీమలో గాలేరు-నగరి, హంద్రీ-నీవా, తెలుగుగంగ, గోరకల్లు, అవుకు, గండికోట వంటి కీలక ప్రాజెక్టుల నిర్మాణానికి ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు చేసిన కృషి మరువలేనిదన్నారు. రాయలసీమను మరోసారి రతనాల సీమగా మార్చాలన్న లక్ష్యంతో చంద్రబాబు ప్రభుత్వం సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు కూడా భవిష్యత్తులో రూ.20 వేల కోట్ల ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు.

ప్రజాదరణను తట్టుకోలేక..

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు లభిస్తున్న ప్రజాదరణను చూసి తట్టుకోలేక జగన్‌మోహన్‌రెడ్డి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకుంటున్నారని మంత్రి నిమ్మల విమర్శించారు. హంద్రీనీవా పనులు వేగంగా చేసి, చివరి భూములకు సైతం నీరందిస్తున్నారని పొరుగు రాష్ట్రాల నాయకులు చంద్రబాబును పొగుడుతుంటే జగన్ కడుపు మంటతో అసత్య ప్రచారానికి దిగడం ఆయన రాజకీయ అసహనానికి నిదర్శనమన్నారు. రాయలసీమ ప్రజలకు జగన్‌మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాల్సిన మూడు కీలక ప్రశ్నలున్నాయని మంత్రి నిమ్మల స్పష్టం చేశారు.

1. 2020లో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌పై ఎన్జీటీ స్టే విధించినప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నది ఎవరు?
2. 2023 మార్చి 22న రూ.2.65 కోట్ల జరిమానా విధించినప్పుడు అధికారంలో ఉన్నది ఎవరు?
3. రాయలసీమ లిఫ్ట్ కేవలం పరిమిత తాగునీటి అవసరాల కోసమేనని జీవో జారీ చేసింది ఎవరు?

ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా కూటమి ప్రభుత్వంపై నిందలు వేయడం ద్వారా వాస్తవాలను మార్చలేరన్నారు. రాయలసీమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతాంగానికి, ప్రజలకు న్యాయం చేస్తామని మంత్రి నిమ్మల స్పష్టం చేశారు.

నర్సీపట్నంలో ఎన్ఏసీ భవనానికి శంకుస్థాపన

- రూ.4 కోట్లతో నిర్మాణం
- యువతకు నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు

నర్సీపట్నం (చైతన్యరథం): అనకాపల్లిజిల్లా నర్సీపట్నం నియోజవర్గం బైపిరెడ్డిపాలెం ఐటీఐ కళాశాల సమీపంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ) భవన నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన జరిగింది. అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, ఆయన సతీమణి మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మావతి కొబ్బరికాయ కొట్టి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, ఎకరం విస్తీర్ణంలో రూ.4కోట్ల వ్యయంతో గ్రౌండ్ ఫ్లోర్,మొదటి అంతస్తు నిర్మిస్తామని తెలిపారు.



నర్సీపట్నం నియోజకవర్గంలో సుమారు 2వేల మంది మేస్త్రీలు ఉన్నారని, నిర్మాణ రంగంపై సుమారు 20 వేల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ భవనం పూర్తయ్యాక తాపీ పని, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, ల్యాండ్ సర్వేయర్, బార్ బెండింగ్, స్టీల్ ఫిక్సింగ్ వంటి రంగాల్లో శిక్షణ ఇస్తామన్నారు. పని నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్నవారితోపాటు ఇప్పటికే పని వచ్చినవారికి కూడా నైపుణ్యాలుఅందిస్తారని చెప్పారు. కొత్తగా శిక్షణ పొందాలనుకునే వారి కోసం 35 ఏళ్ల లోపు వయస్సు ఉన్నవారికి 3 బ్యాచ్‌లుగా ఒక్కో బ్యాచ్‌కు 30 మంది చొప్పున ఒకేసారి 90 మందికి 3 నెలల పాటు శిక్షణ ఇస్తారని వివరించారు. శిక్షణ సమయంలో హాస్టల్ వసతితో పాటు భోజనం కల్పిస్తారని, 3 నెలలు పూర్తయ్యాక సర్టిఫికెట్ అందజేసి నైపుణ్యాలకు తగిన అవకాసాలు కూడా ఇప్పిస్తారని తెలిపారు. ఇప్పటికే పని తెలిసిన వారికి 15 రోజుల పాటు 45 ఏళ్ల లోపు వయస్సు ఉన్నవారికి రిఫ్రెషర్ శిక్షణ నిర్వహిస్తారని, రోజుకు రూ. 300 చొప్పున శిక్షణ భత్యంగా అందజేస్తారని చెప్పారు. శిక్షణ సమయంలో మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తారని, శిక్షణ ముగిశాక సర్టిఫికెట్ ఇస్తారని వెల్లడించారు. శిక్షణకు హాజరయ్యే వారు తప్పనిసరిగా రేషన్ కార్డుతో పాటు ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను కార్యాలయంలో అందజేసి నమోదు చేసుకోవాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ సూర్యచంద్ర, వార్డు కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు చారిత్రాత్మక ముందడుగు

- **నారీశక్తికి ప్రాధాన్యం ఇస్తున్న ప్రధాని మోదీ**
- **మహిళల రాజకీయ ప్రాతినిధ్యంలో ఏపీది మార్గదర్శక పాత్ర**
- **రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్**

అమరావతి (చైతన్యరథం): మహిళా రిజర్వేషన్ బిల్లుపై ముందుకు సాగాలన్న కేంద్ర మంత్రివర్గ నిర్ణయాన్ని తెలుగుదేశం పార్టీ రాజ్యసభ సభ్యుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ స్వాగతించారు. నారీశక్తికి సముచిత గౌరవం కల్పించే ఈ చర్య దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు మూడింట ఒక వంతు ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా విధాన రూపకల్పనలో వారి భాగస్వామ్యం మరింత బలోపేతమవుతుందని తెలిపారు.

మహిళలకు రాజకీయ అవకాశాలు కల్పించడంలో తెలుగుదేశం పార్టీకి స్పష్టమైన దృక్పథం, సుదీర్ఘ నిబద్ధత ఉన్నాయని విజయ్ అన్నారు. నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ నాయకత్వంలో స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లతోపాటు, అంతకుమించి అవకాశాలు కల్పించేందుకు పార్టీ ప్రాధాన్యం ఇచ్చిందని పేర్కొన్నారు.

క్షేత్రస్థాయిలో మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించడంలో ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలిచింది. గ్రామాలు, పట్టణాల్లో మహిళలు ప్రజాప్రతినిధులుగా ఎదిగి, ప్రజల సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించారు. ఆ అనుభవం జాతీయ స్థాయిలో మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు స్ఫూర్తినిస్తుంది. ఇది ప్రతి తెలుగు వ్యక్తి గర్వించదగిన సందర్భమని విజయ్ అన్నారు.

మహిళా ప్రాతినిధ్యాన్ని కేవలం స్థానాల కేటాయింపునకు పరిమితం చేయకుండా, సమర్థ నాయకత్వంగా తీర్చిదిద్దడం కూడా అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. నాయకత్వ శిక్షణ, సామర్థ్య వికాసం, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే అవకాశాల ద్వారా మహిళా ప్రజాప్రతినిధులను బలోపేతం చేయాలని సూచించారు. ఆరోగ్యం, విద్య, పారిశుద్ధ్యం, తాగునీరు, జీవనోపాధి, సామాజిక సంక్షేమం వంటి అంశాల్లో మహిళల అనుభవం, దృక్పథం పాలనకు మరింత బలాన్ని చేకూరుస్తాయని తెలిపారు.

సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన మహిళలు సర్పంచులు, కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులుగా



ఎదిగి సమర్థతను చాటుకున్నారని విజయ్ పేర్కొన్నారు. సమాన అవకాశాలు కల్పిస్తే మహిళల్లోని నాయకత్వ ప్రతిభ సమాజాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. స్థానిక సంస్థల్లో పెరిగిన మహిళా నాయకత్వం, రాష్ట్ర మరియు జాతీయ స్థాయిల్లోనూ మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

మహిళల క్రియాశీల భాగస్వామ్యం లేకుండా సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదన్నది తెలుగుదేశం పార్టీ విశ్వాసమని విజయ్ స్పష్టం చేశారు. మహిళలకు రాజకీయంగా, ఆర్థికంగా అవకాశాలు కల్పించేందుకు చంద్రబాబు నాయుడు కృషి చేశారని, మహిళలు, యువత సాధికారతకు ప్రాధాన్యం ఇస్తూ ఆ దృక్పథాన్ని శ్రీ నారా లోకేష్ ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలోనూ మహిళలు నాయకత్వ బాధ్యతలు చేపట్టేలా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

మహిళా రిజర్వేషన్లు సంఖ్యాపరమైన ప్రాతినిధ్యంతోపాటు, నిర్ణయాధికారంలో సమాన భాగస్వామ్యానికి దోహదపడాలని విజయ్ అన్నారు. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగడం వల్ల ప్రజా సమస్యలపై విస్తృత చర్చకు, మానవాభివృద్ధికి సంబంధించిన అంశాలకు మరింత ప్రాధాన్యం లభిస్తుందని అభిప్రాయపడ్డారు.

మహిళా రిజర్వేషన్లకు తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. మహిళా సాధికారత లక్ష్యాలు ఆచరణలో సాకారమయ్యేలా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ నాయకత్వంలో కృషి చేస్తామని తెలిపారు. నారీశక్తికి ప్రాధాన్యం ఇస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి శుక్రవారం ఒక ప్రకటనలో విజయ్ అభినందనలు తెలియజేశారు.

తప్పు చేసి, తప్పించుకునే యత్నం.. ఇదే జగన్ సిద్ధాంతం

- **స్థానిక ఎన్నికల్లో వైసీపీ దౌర్జన్యాలపై ఎస్ఈసీకి టీడీపీ నేతల ఫిర్యాదు**
- **కుప్పం ఘటనలో టీడీపీ నేత మృతి చెందితే.. వైసీపీ కార్యకర్త అంటూ సాక్షి, జగన్ ఫేక్ ప్రచారం**
- **మహిళా ఎన్నికల అధికారిని చంపేందుకు వైసీపీ మూకల యత్నం**
- **ఓటర్లు, పోలీసులపై దాడులు చేయడమే వైసీపీ రాజకీయమా అని ప్రశ్నించిన ఎమ్మెల్సీ వర్ల రామయ్య**
- **రాష్ట్ర వ్యాప్తంగా 12 ప్రాంతాల్లో అల్లర్లకు పాల్పడిన వైసీపీ గూండాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఈసీకి వినతి**



అమరావతి (చైతన్యరథం): కుప్పం ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయంతోనే వైసీపీ శ్రేణులు పక్కా ప్రణాళికతో హింసాకాండకు పాల్పడ్డాయని, ఇప్పుడు తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఫేక్ ఐడీలతో సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నాయని తెలుగుదేశం పార్టీ మండిపడింది.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగకుండా అడ్డుకోవడమే కాకుండా, దాడులకు పాల్పడి ప్రాణాలు తీసిన ఘటనలను కూడా రాజకీయ లబ్ధి కోసం వక్రీకరించడం వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో చోటుచేసుకున్న అక్రమాలు, దౌర్జన్యాలు, దాడులపై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. అశోక్ బాబు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ ఎస్. రాజశేఖర్ శుక్రవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠాను కలిసి ఫిర్యాదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 12 ప్రాంతాల్లో జరిగిన హింసాత్మక ఘటనలకు సంబంధించిన వీడియో క్లిప్పింగ్‌లు, ఫొటోలతో కూడిన పెన్‌డ్రైవ్‌ను ఆధారాలుగా అందజేశారు. ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళా ఎన్నికల అధికారిపైనే దాడికి యత్నం

కుప్పంలో గురువారం రీకౌంటింగ్ అంశాన్ని పరిశీలించేందుకు పోలింగ్ బూత్ వద్దకు వచ్చిన మహిళా రూట్ ఆఫీసర్ వందనాపై వైసీపీ మూకలు దౌర్జన్యానికి దిగడం అత్యంత దారుణమని టీడీపీ నేతలు పేర్కొన్నారు. ఆమెను బూత్‌లోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో పాటు, కారుపై దాడికి ప్రయత్నించారని తెలిపారు. డ్రైవర్ వెంటనే కారును రివర్స్‌లో వేగంగా వెనక్కి తీసుకెళ్లకపోతే మహిళా అధికారికి ప్రాణహాని జరిగి ఉండేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడి, తోపులాట సమయంలో అక్కడే ఉన్న టీడీపీ నేత కిందపడగా, కారు ఆయన మీదుగా వెళ్లడంతో ప్రాణాలు కోల్పోయారని వివరించారు. అయితే ఈ ఘటనలో తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు మృతుడిని వైసీపీ కార్యకర్తగా చిత్రీకరిస్తూ ఫేక్ ఐడీల ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. మృతుడు ఏమ రాజేంద్రన్ టీడీపీ పార్టీ సభ్యత్వ నెం. 19023144 (2024-2026) వివరాలే ఇందుకు ఆధారమని టీడీపీ నేతలు తెలిపారు.

కార్యకర్త రాజేంద్ర కుటుంబానికి భరోసా

ఇప్పటికే మృతుడు రాజేంద్ర కుటుంబ సభ్యులను స్థానిక టీడీపీ నేతలు పరామర్శించి ఓదార్చారన్నారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్త కుటుంబాన్ని అధిష్టానం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని, ఆర్థికంగా, నైతికంగా అండగా ఉంటామని టీడీపీ నేతలు హామీ ఇచ్చారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను కోరారు.

రాష్ట్రవ్యాప్తంగా 12 ప్రాంతాల్లో వైసీపీ దౌర్జన్యాలు

రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో వైసీపీ శ్రేణులు అల్లర్లు, దాడులు, ఓటర్ల బెదిరింపులకు పాల్పడ్డాయని టీడీపీ నేతలు ఎస్ఈసీ దృష్టికి తీసుకెళ్లారు.

చిత్తూరు జిల్లా కుప్పం మండలం కర్లగట్ట పంచాయతీలో వారి పార్టీ అభ్యర్థి ఓటమిని జీర్ణించుకోలేక వైసీపీ మూకలు ఓటర్ల ఇళ్లపై రాళ్లు రువ్వి అద్దాలు పగలగొట్టాయి. టీడీపీ నేత చంద్రశేఖర్ ఇంటిపై దాడి చేసి ఫర్నిచర్, కారును ధ్వంసం చేశాయి.

వైఎస్సార్ కడప జిల్లా బద్వేలు మండలం కోనసముద్రంలో పోలింగ్‌ను అడ్డుకునేందుకు వైసీపీ శ్రేణులు ఓటర్లు, టీడీపీ కార్యకర్తలపై దాడి చేయడంతో పలువురు గాయపడ్డారు.

శ్రీకాకుళం 19వ వార్డులోని బూత్ నంబర్లు 1, 2 వద్ద బుక్కా యుగేందర్ రౌడీషీటర్లను తీసుకొచ్చి ఓటర్లను బెదిరించారు. దీంతో భయపడిన ప్రజలు ఓటు వేయడానికి కూడా వెనుకాడారు.

రాజమహేంద్రవరం కాంగ్రెస్ మేయర్ అభ్యర్థి బి. అన్వితా భర్త జి.వి. శ్రీరాజ్ తాను ఓటు వేస్తున్న వీడియోను ఫేస్‌బుక్‌లో పోస్టు చేసి ఓటు గోప్యత నిబంధనలను ఉల్లంఘించారు.

అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటలో టీడీపీ అభ్యర్థి మొయిద్దీన్ కారును వైసీపీ మూకలు ధ్వంసం చేయడంతో పాటు టీడీపీ నేతల ఇళ్లపై రాళ్లదాడికి పాల్పడ్డాయి.

అనంతపురం జిల్లా ఎనుములదొడ్డిలో విధుల్లో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ భాషాపై వైసీపీ గూండాలు కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. మహంతాపురంలో పోలింగ్ అనంతరం బూత్‌లోకి చొరబడి సిబ్బందిపై దాడి చేసి రిగ్గింగ్‌కు ప్రయత్నించారు.

ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం పెద్దవరంలో ఓటర్లకు పంపిణీ చేసేందుకు వైసీపీ నేతలు సిద్ధం చేసిన కత్తెర గుర్తు ముద్రించిన 950 చీరలు, 1,250 కత్తెరలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

శ్రీ సత్యసాయి జిల్లా మల్లెంపల్లిలో 23 మంది వైసీపీ నేతలు, కార్యకర్తలు జరిపిన దాడిలో టీడీపీ నేతలు రూపేష్, చంద్రశేఖర్ తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలయ్యారు.

నంద్యాల జిల్లా కనాల గ్రామ పంచాయతీ పోలింగ్ బూత్‌ల వద్ద వైసీపీ శ్రేణులు కావాలనే గొడవలకు దిగి ఓటర్లను అడ్డుకున్నారు.

నెల్లూరు జిల్లా వింజమూరు పోలింగ్ బూత్ వద్ద వైసీపీ నేత మేకపాటి రాజగోపాల్ రెడ్డి వచ్చి ఎస్ఐతో వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

గెలిచే అభ్యర్థులే లక్ష్యంగా దాడులు

ఎన్నికల్లో గెలుస్తున్న, ఇప్పటికే విజయం సాధించిన టీడీపీ అభ్యర్థులతో పాటు విధుల్లో ఉన్న ఎన్నికల అధికారులు, పోలీసులపై కూడా దాడులకు దిగడం వైసీపీ అరాచక మనస్తత్వానికి నిదర్శనమని టీడీపీ నేతలు విమర్శించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసే హక్కును కాలరాస్తూ, భయభ్రాంతులకు గురిచేసి ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవాలని ప్రయత్నించారని ఆరోపించారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ ఘటనలన్నింటిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి, దాడులకు పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను టీడీపీ నేతలు కోరారు. ఎన్నికల అధికారిపై దాడి జరిగిన విషయాన్ని తీవ్రంగా పరిగణించిన ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా, ఈ ఘటనకు బాధ్యులైన వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

2020లో ఆగిన రాయలసీమ లిఫ్ట్ పనులను...

2024లో గెలిచిన చంద్రబాబు ఆపడమేమిటి?

- నిత్యకృత్యంలా అసత్యాలు వండివారుస్తున్న గొడ్డలిపార్టీ, సాక్షి మీడియా
- ఎన్‌జీటీ స్టే ఇచ్చింది ఎవరి హయాంలో?
- అప్పుడు అధికారంలో ఉన్న జగన్ ఎందుకు అప్పీలుకు వెళ్లలేదు?
- కేసీఆర్ హెచ్చరిస్తే జగన్ పనులు ఆపేశారంటూ బీఆర్ఎస్ నేత హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలకు బదులివ్వాలి
- జగన్‌కు ఎమ్మెల్యే కాలవ స్ట్రాంగ్ కౌంటర్

అమరావతి (చైతన్యరథం): అసత్యాలు వండి వార్చడం, అబద్ధాలను విచ్చలవిడిగా ప్రచారం చేయడమే జగన్మోహన్‌రెడ్డి, ఆయన ఆధ్వర్యంలో నడుస్తున్న సాక్షి మీడియాకు నిత్యకృత్యంగా మారిందని... రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చంద్రబాబు ఏదో ఆపేశాడరట్టు దుష్ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ధ్వజమెత్తారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించిన రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేస్తూ 2020లో ఎన్జీటీ ప్రాథమిక స్టే ఉత్తర్వులు జారీ చేసింది.. 2021 డిసెంబర్‌లో స్టే విధిస్తే తుది ఉత్తర్వులు జారీ చేసింది..అప్పుడు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఎవరు.. వైఎస్ జగన్మోహన్ రెడ్డే కదా. ఆయన 2024 మే వరకు ముఖ్యమంత్రిగా కొనసాగారు. పర్యావరణ అనుమతులు లేవని, ఇతరత్రా అనేక అభ్యంతరాలు ఉన్నాయని లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ఎన్జీటీ నిలిపివేస్తే 2024 మే వరకు అధికారంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి ఎందుకు అప్పీలుకు వెళ్లలేదు? కేవలం ఒక కాంట్రాక్టర్‌కు వెయ్యి కోట్లు దోచిపెట్టడానికే రాయలసీమ లిఫ్ట్ పనులు ప్రారంభించారు. రైతుల ప్రయోజనాల కోసం కాదు. చంద్రబాబు లాంటి దూరదృష్టి ఉన్న నాయకుడు ఇలాంటి కార్యక్రమాన్ని ప్రారంభించి ఉంటే, కచ్చితంగా అవసరమైన అనుమతులన్నీ పొందిన తర్వాతే ముందుకు వెళ్లేవారు. ప్రజల సొమ్మును దోచుకోవడానికి, తన అనుయాయులకు వందల కోట్ల రూపాయలు కట్టబెట్టడానికి జగన్ పన్నిన స్వార్థపూరిత పన్నాగమే ఈ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్. 2020లోనే రాయలసీమ లిఫ్ట్ ను జగన్ చేత నిలుపుదల చేయించామని తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు తాజా వ్యాఖ్యలకు జగన్ సమాధానం చెప్పాలి. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా శ్రీశైలం డ్యామ్‌లో 854 అడుగుల నీటిమట్టం ఉన్నప్పుడే పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమకు నీటిని తరలించే అవకాశం ఉందని చెబుతున్నారు. మరి 798 అడుగుల నీటిమట్టం ఉన్నప్పటికీ ముచ్చుమర్రి ద్వారా నీటిని తీసుకునే అవకాశం ఉన్నా ఆ వ్యవస్థను జగన్ పాలనలో ఎందుకు నిర్వీర్యం చేశారు. ఐదేళ్ల పాలనలో హంద్రీనీవా, మాల్యాల వంటి ప్రాజెక్టుల విద్యుత్ బిల్లులు కూడా చెల్లించలేని రాయలసీమ ద్రోహి జగన్మోహన్ రెడ్డి అని కాలవ ధ్వజమెత్తారు.

హంద్రీనీవాపై ప్రశ్నలకు బదులివ్వు..

జగన్‌కు హంద్రీనీవాపై కాలవ కొన్ని ప్రశ్నలు సంధించారు. అనంతపురం జిల్లా మనవడినని చెప్పుకుంటావు. మరి ఈ జిల్లాకు ప్రయోజనం చేకూర్చే హంద్రీ-నీవా ప్రాజెక్టును ఎందుకు విస్తరించలేకపోయావు? జరుగుతున్న పనులను కూడా ఆపేసి, 2,700 క్యూసెక్కుల నీటిని కూడా తీసుకురాలేని దయనీయ పరిస్థితికి హంద్రీ-నీవాను ఎందుకు తీసుకెళ్లావు. 2017లో చంద్రబాబు



సుమారు రూ.1000 కోట్లతో హంద్రీ-నీవా సామర్థ్యాన్ని 3,850 క్యూసెక్కులకు పెంచేందుకు పనులు ప్రారంభించారు. దాదాపు 35 నుంచి 40 శాతం పనులు పూర్తయ్యాయి. నువ్వు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పనులను ఎందుకు నిలిపివేశావు. అనంతపురం జిల్లా బాగుపడటం నీకు ఇష్టం లేదా? కర్నూలు జిల్లా అభివృద్ధి చెందడం ఇష్టం లేదా? కర్నూలు జిల్లాలో అత్యంత వెనుకబడిన పడమటి ప్రాంతాలకు నీళ్లు రావడం ఇష్టం లేదా? పత్తికొండ, డోన్, ఆలూరు వంటి నియోజకవర్గాలకు ఎంతో ఉపయోగపడే హంద్రీ-నీవా కాలువల సామర్థ్యాన్ని ఎందుకు పెంచలేదు? దీనికి నువ్వు, నీ సాక్షి పత్రిక సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

టీడీపీ హయాంలోనే సీమ ప్రాజెక్టుల పనులు

నీ ఐదేళ్ల పాలనలో హంద్రీ-నీవాకు ఎంత ఖర్చు పెట్టావు? గాలేరు-నగరికి ఎంత ఖర్చు పెట్టావు? భైరవానితిప్ప ప్రాజెక్టును ఏం చేశావు? పేరూరు ప్రాజెక్టును ఏం చేశావు? 50 వేల ఎకరాలకు నీళ్లందించే ఉరవకొండ డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్టును ఏం చేశావు? మడకశిర బ్రాంచ్ కెనాల్‌ను ఏం చేశావు? కుప్పం బ్రాంచ్ కెనాల్ పరిస్థితి ఏమిటి? కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు నీళ్లు ఇచ్చామంటూ సినిమా సెట్టింగ్‌ల తరహాలో ప్రచారం చేసుకున్నావు. కానీ, 24 గంటలు గడవకముందే నీ ప్రచారంలోని డొల్లతనం బయటపడింది. అసలు రాయలసీమకు మంచి చేస్తున్నది ఎవరు? ఈ రోజు రాయలసీమ స్థితిగతులను మార్చగలిగే తెలుగుగంగ, హంద్రీ-నీవా, గాలేరు-నగరి, కుప్పం బ్రాంచ్ కెనాల్, మడకశిర బ్రాంచ్ కెనాల్ వంటి ప్రాజెక్టుల్లో సుమారు 80 శాతం పనులు మహనీయుడు ఎన్టీ రామారావు హయాంలో, దార్శనికుడు చంద్రబాబు నాయుడు పాలనలో చేపట్టినవే. ఐదేళ్ల జగన్ పాలనలో రాయలసీమ ప్రాజెక్టులకు రూ.2 వేల కోట్లు కూడా ఖర్చు చేయలేదని కాలవ ధ్వజమెత్తారు.

జగన్ కట్టుకథలు మానాలి

కూటమి ప్రభుత్వంలో రాయలసీమ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోంది. రాయలసీమ ప్రజలమంతా ఒక సరికొత్త భవిష్యత్తును చూస్తున్నారు. లక్ష కోట్ల రూపాయలతో చేపట్టే రాయలసీమ హార్టికల్చర్ ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంత స్వరూపమే మారిపోతుంది. రాయలసీమను ప్రపంచ ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారు. నవ్యాంధ్రలో రాయలసీమ ప్రాజెక్టులకు చంద్రబాబు రూ.26 వేల కోట్లు ఖర్చు చేశారు. మరో రూ.10 వేల కోట్లు ఖర్చు చేయబోతున్నాం. రాయలసీమకు అడుగడుగునా అన్యాయం చేసిన జగన్ రెడ్డి మా గొంతు కోశారు. నీళ్లు రాకుండా చేశారు. రాయలసీమ భవిష్యత్తును నాశనం చేశారు. ఇప్పటికైనా నీ కట్టుకథలు, అసత్య ప్రచారాలు మానుకో. వచ్చే రెండున్నర సంవత్సరాల కాలంలో ఉద్యానవన ప్రాజెక్టులు, సాగునీటి ప్రాజెక్టులు మరెన్నో రాయలసీమకు రానున్నాయి. ఇక్కడి రైతాంగానికి అద్భుతమైన భవిష్యత్తు ఉంది. ఈ అభివృద్ధిని అడ్డుకోవడానికి జగన్మోహన్ రెడ్డి చేస్తున్న కుట్రలను రాయలసీమ ప్రజలు అర్థం చేసుకోవాలని కాలవ కోరారు.

సీమ 'పథకం'పై జగన్ 'అసత్యాల' ఎత్తిపోతలు'!

రాయలసీమ ఎత్తిపోతల పథకం విషయంలో పులివెందుల ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సామాజిక మాధ్యమాలద్వారా ఎత్తిపోసిన అసత్యాలకు రాయలసీమ ప్రజలతరపున అడుగుతున్న ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పాలి. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడానికి మీరు చేసింది ఏమిటి? సీమ ఎత్తిపోతలపై జగన్ చేసిన వాదనల్లో వాస్తవాలెక్కడ? మీరు చేసిన ఆరోపణలకు ఆధారాలేమిటి? సీమ సాగునీటి పథకంపై రాజకీయ ఆరోపణలు చేయడంసులభమే. కానీ ప్రాజెక్టుకు ఎదురైన న్యాయపరమైన చిక్కులను పరిష్కరించడానికి మీరు చేసిన ప్రయత్నాలు ఏమిటి? రాయల సీమ ఎత్తిపోతల పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకించి జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ)లో న్యాయపరమైన అభ్యంతరాలు వ్యక్తంచేయడం, 2020 లోనే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన కేసు ఎన్‌జీటీలో విచారణకు రావడం, పర్యావరణ అనుమతులు, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ), కేంద్ర జలశక్తి శాఖ అనుమతుల అంశాలు తెరపైకి రావడం నిజం కాదా? 2020అక్టోబరులో అవసరమైన అనుమతులు పొందేవరకు నిర్మాణ పనులు కొనసాగించరాదని ఎన్‌జీటీ ఆదేశించడం, తర్వాత 2021 డిసెంబరులో కూడా పర్యావరణ అనుమతులు వచ్చే వరకు పనులు నిలిపివేయాలని ట్రైబ్యునల్ స్పష్టం చేయడం వాస్తవం కాదా? ఇంతటి కీలకమైన న్యాయపరమైన చిక్కులు ఎదురైతే వాటిని పరిష్కరించడానికి మీరు చేసిన కృషి ఏమిటి? ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను కేఆర్ఎంబీ, కేంద్ర జల సంఘం పరిశీలనకు పంపడంలో, అపెక్స్ కౌన్సిల్ ఆమోదం పొందడంలో ఎందుకు జాప్యం చేశారు? కేంద్ర పర్యావరణ శాఖ 2021లో కోరిన అదనపు సమాచారాన్ని సకాలంలో ఇవ్వకపోవడంపై 2023 జూలైలో కేంద్ర మంత్రి పార్లమెంటులో వెల్లడించిన వివరాలకు జగన్ ఏం సమాధానం చెబుతారు? మీట్వీట్‌లో సీమ లిఫ్టుపై కేసీఆర్ ప్రభుత్వం ఎన్‌జీటీని ఆశ్రయించిన వాస్తవాన్ని మాత్రం ఎందుకు ప్రస్తావించ లేదు? జగన్ గల్లా పట్టుకుని ఆ పథకాన్ని నాటి సీఎం కేసీఆర్ ఆపించారని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను మీరు ఎందుకు ఖండించలేదు? ప్రజలు అడుగుతున్న ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత జగన్‌పై ఉంది.

పోతిరెడ్డిపాడు ద్వారా కృష్ణా జలాలను తరలిస్తున్నందున రాయలసీమ ఎత్తిపోతల పథకానికి కొత్తగా పర్యావరణ అనుమతులు అవసరం లేదని జగన్ చెప్పారు. ఒక ప్రాజెక్టు ఉద్దేశం, నీటిని ఎత్తిపోసే విధానం, కాలువల విస్తరణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం పాతప్రాజెక్టుల పేర్లు చెప్పి కొత్త నిర్మాణాలకు అనుమతుల అవసరం లేదని జగన్ ఎలా నిర్ణయిస్తారు? అధికారంలో ఉన్నప్పుడు నిబంధనలకు నీళ్లొదిలి, కనీస అనుమతులు లేకుండా ప్రాజెక్టు పనులు మొదలుపెట్టి, న్యాయపరమైన చిక్కుల్లోకి నెట్టిన జగన్‌రెడ్డి నేడు నీతులు వల్లించడం విడ్డూరంగా లేదా? రాయలసీమ ప్రయోజనాల పట్ల చిత్తశుద్ధి ఉంటే వాస్తవాలను అంగీకరించాలి తప్ప అసత్య ప్రచారంతో రాజకీయ లబ్ధి పొందాలని చూడటం నీచ రాజకీయం కాదా? ఏ భారీ సాగునీటి ప్రాజెక్టు కైనా నికర జలాల కేటాయింపు, అపెక్స్ కౌన్సిల్ ఆమోదం, పర్యావరణ అనుమతులు అత్యంత కీలకం. పోతిరెడ్డిపాడు ద్వారా తరలించే నీటినే వాడుకుంటున్నామనే సాకుతో, కొత్త ప్రాజెక్టుకు ఎలాంటి పర్యావరణ అనుమతులు అక్కర్లేదనివాదించడం కనీస పరిపాలనా పరిజ్ఞానం లేకపోవడం కాదా? నాటి తెలంగాణ ప్రభుత్వం ఎన్జీటీని ఆశ్రయించి పనులను అడ్డుకుందనే కఠినమైన వాస్తవాన్ని విస్మరించడం వెనుక ఆంతర్యమేమిటి? పొరుగు రాష్ట్ర నేతల వ్యాఖ్యలపై నోరు మెదపని జగన్‌రెడ్డి సీఎం చంద్రబాబుపై విషం కక్కడం ద్వంద్వ నీతికి నిదర్శనం కాదా? సగం కూడా పూర్తి కాని, న్యాయవివాదాల్లో చిక్కుకున్న ప్రాజెక్టును దాదాపు పూర్తయింది అని చెప్పడం అంటే ప్రజల కళ్లకు గంతలు కట్టడం కాదా? మీ అసత్యాల ట్వీట్లతో చరిత్రను మార్చగలరా? ప్రాజెక్టు దాదాపు పూర్తయిందని చెప్పే ముందు, అసలు ఎన్ని పనులు పూర్తయ్యాయి? ఎన్ని నిధులు ఖర్చు చేశారు? ఎన్ని అనుమతులు సాధించారు? అనే వివరాలు వెల్లడించాల్సిన బాధ్యత మీ పై లేదా?

ప్రాజెక్టు ఆలస్యానికి కారణమైన న్యాయపరమైన, సాంకేతికపరమైన అడ్డంకులను పరిష్కరించకుండా, వాటి పరిష్కారానికి మీరు చేసిందేమిటో సమాధానం చెప్పకుండా సీఎం చంద్రబాబు పై నిందలు వేయడం వల్ల రాయలసీమ రైతులకు ఒరిగేదేమిటి? కాంగ్రెస్‌తో రాజకీయ స్నేహం కోసమే చంద్రబాబు మౌనంగా ఉన్నారని ఆరోపించడం కంటే, తన ఐదేళ్ల పాలనలో రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఉద్ధరించింది ఏమిటో జనానికి జగన్ వివరిస్తే సముచితంగా ఉండేది. ఏపీ సీఎం గా ఉన్న జగన్‌కి అప్పట్లో అపూర్వ సహోదరుడుగా వున్న తెలంగాణా సీఎం కేసీఆర్ అభ్యంతరాలకు ఎందుకు అడ్డు చెప్పలేదు? రాయలసీమ బిడ్డగా రాయలసీమ ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత మీ పై లేదా? ఆ బాధ్యతను ఎందుకు నిర్వర్తించలేకపోయారు? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా చంద్రబాబును నిందించడం, ఆత్మవంచనతో పాటు ప్రజలను వంచించడం కాదా? మీ పాలనలో జరిగిన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఇతరుల పై నిందలు వేయడం వల్ల రాయలసీమ ప్రజలకు ఒరిగేదేమీ లేదు. హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై స్పందించకుండా చంద్రబాబును లక్ష్యంగా చేసుకుని ట్వీట్ చేయడం వెనుక రాజకీయ ప్రయోజనాలే కనిపిస్తున్నాయి. రాయలసీమ ఎత్తి పోతల పథకం పేరిట జల రాజకీయాలకు తెరలేపుతారా? రాజకీయంగా కష్టం వచ్చినప్పుడల్లా రాయలసీమను ఒక రక్షణ కవచంగా వాడుకుంటారా? రాయలసీమ ప్రజలను రెచ్చగొట్టేందుకు నీళ్ల మంటలను రాజేస్తారా? మీరు అధికారంలో లేనప్పుడే రాయలసీమకు అన్యాయం జరుగుతోందని ప్రచారం చెయ్యడం కొందరు కుహనా మేధావులకు కూడా అలవాటుగా మారింది నిజం కాదా? మీరు అధికారంలో ఉంటే మాత్రం రాయలసీమ ప్రయోజనాలు పట్టవా? ఐదేళ్లు అధికారంలో ఉండి సీమలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు అయినా పూర్తి చేశారా? ఒక్క ఎకరాన్ని అయినా అదనంగా సాగులోకి తెచ్చారా? వాస్తవంగా జగన్ రెడ్డి హయాంలోనే రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలిచిపోయింది. మీ హయాంలో రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టులలో తట్టెడు మట్టి వేసిన దిక్కులేదు. మీ హయాంలోనే నిలిచి పోయిన రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని కూటమి ప్రభుత్వం ఆపిందని ప్రచారం చెయ్యడం సీఎం చంద్రబాబు పై బురద జల్లడానికే తప్ప మరొకటి కాదు. దోపిడీ కోసం మొదలు పెట్టిన రాయలసీమ లిఫ్ట్ పథకంలో మనీ లిఫ్ట్ అయినట్లు, ఆ ప్రాజెక్ట్‌లో రూ. 900 కోట్లు దోపిడీ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. కావున రాయలసీమ ప్రజలకు కావాల్సింది మీ అసత్యాల ట్వీట్లు కాదు, సాగునీరు.. ప్రాంతీయ ప్రయోజనాల పేరుతో రాజకీయ పబ్బం గడుపుకోవడం కాదు, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసే చిత్తశుద్ధి కావాలి. ఐదేళ్లు అధికారంలో ఉండి సీమ సాగునీటి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేకపోయారో సమాధానం చెప్పకుండా, ఇప్పుడు చంద్రబాబుపై బురద చల్లినంత మాత్రానా మీ వైఫల్యాల చరిత్ర చెరిగిపోదు. ఇప్పటికైనా రాయలసీమను రాజకీయ రక్షణ కవచంగా వాడుకోవడం మానుకుని, ఆ ప్రాంత రైతుల పక్షాన అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పండి.

- నీరుకొండ ప్రసాద్

బీమా వ్యవస్థను దెబ్బతీసి..
ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై నిందలా?

రైతులకు అండగా నిలవాల్సిన పంటల బీమా పథకాన్ని గత వైసీపీ ప్రభుత్వం తన నిర్లక్ష్యంతో సంక్షోభంలోకి నెట్టింది. ఇప్పుడు ఆ తప్పిదాలను సరిదిద్దుతూ, బీమా వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టేందుకు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే, వాటిని కూడా తప్పుపడుతూ వైసీపీ తన సొంత పత్రికలో అసత్య ప్రచారానికి తెరతీసింది. వాస్తవాలను పరిశీలిస్తే.. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రైతులకు జరిగిన నష్టం, అప్పటి ప్రభుత్వం వదిలివెళ్లిన బకాయిలు, వాటిని పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు స్పష్టంగా కనిపిస్తాయి. ఒకవైపు గత ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తూనే, మరోవైపు రైతులకు కూటమి ప్రభుత్వం అన్యాయం చేస్తోందంటూ బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు.



ఖరీఫ్-2025, ఖరీఫ్-2026 బీమా నమోదు వివరాలు

అంశం	ఖరీఫ్-2025	ఖరీఫ్-2026	పెరుగుదల
మొత్తం దరఖాస్తులు(లక్షల్లో)	18.88	44.09	2.3 రెట్లు
రుణం పొందని రైతుల దరఖాస్తులు (లక్షల్లో)	2.00	25.27	12.6 రెట్లు
బీమా చేసిన విస్తీర్ణం (లక్షల హెక్టార్లలో)	7.67	17.07	2.2 రెట్లు
బీమాలో చేరిన రైతులు (లక్షల్లో)	7.43	17.10	2.3 రెట్లు

బీమా వ్యవస్థను దెబ్బతీసిన జగన్!

2014-19 మధ్య చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి రూ.4,787 కోట్ల పంటల బీమా పరిహారాన్ని అందించింది. అప్పట్లో రైతులు తమ వంతుగా ఖరీఫ్‌కు 2 శాతం, రబీకి 1.5 శాతం, వాణిజ్య, ఉద్యాన పంటలకు 5 శాతం ప్రీమియం చెల్లిస్తే, మిగిలిన సింహభాగాన్ని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు భరించేవి. దీనివల్ల ఇన్సూరెన్స్ కంపెనీలకు జవాబుదారీతనం ఉండేది, రైతులకు సకాలంలో క్లెయిమ్స్ వచ్చేవి.

కానీ జగన్ రెడ్డి రాగానే 'ఉచితం' అనే రంగు పూసి, లోపల భారీ స్కామ్‌కు తెరలేపారు. ఆయన హయాంలో రైతులు ప్రీమియం కట్టినప్పటికీ, అర్హత పొందిన వారందరికీ పరిహారం అందకుండా ఈ-క్రాప్ పేరుతో కోతలు విధించారు. 2019-24 మధ్య ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి రూ.3000కోట్లకు పైగా ప్రీమియం బకాయిలు పేరుకుపోయాయి. ఈ బకాయిలే రాష్ట్రంలో పంటల బీమా అమలుకు పెద్ద అడ్డంకిగా మారాయి.

బకాయిల చెల్లింపునకు కూటమి ప్రభుత్వం చర్యలు

గత జగన్ ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన రూ.3,000 కోట్ల పంటల బీమా ప్రీమియం బకాయిల వల్ల ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పోర్టల్‌లో రాష్ట్ర ప్రక్రియ నిలిచిపోయి, 2023-24 సీజన్‌లో 33 లక్షల మంది రైతులు బీమా క్లెయిమ్‌లు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. అయితే, ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కేంద్రంతో చర్చించి, రబీ 2022-23 నుంచి ఖరీఫ్-2025 వరకు ఉన్న బకాయిలను మూడు ఆర్థిక సంవత్సరాల్లో (2026-27లో రూ.500 కోట్లు, 2027-28లో రూ.1,000 కోట్లు, 2028-29లో రూ.1,500 కోట్లు) దశలవారీగా చెల్లించేందుకు కేంద్ర ఆమోదం పొందింది.

ఇందులో భాగంగా ఇప్పటికే రబీ 2022-23 బకాయిల కోసం విడుదల చేసిన రూ.500 కోట్లలో రూ.250 కోట్లు బీమా కంపెనీలకు చెల్లించగా, రాష్ట్ర వాటా అందగానే పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కరించాలని కేంద్రం ఆదేశించింది. గత పాలకులు వదిలిన ఈ భారాన్ని కూటమి ప్రభుత్వం భరిస్తూ రైతులకు న్యాయం చేస్తుంటే, వాస్తవాలను విస్మరించి విమర్శలు చేయడం రాజకీయ స్వార్థంతో రైతులను తప్పుదోవ పట్టించడమే అవుతుంది.

బీమా నమోదులో 2.3 రెట్ల పెరుగుదల.. రైతుల్లో పెరిగిన నమ్మకం!

గతంలో బీమా వ్యవస్థ ఎదుర్కొన్న సమస్యలను పరిష్కరించడంతోపాటు భవిష్యత్తులో ప్రీమియం బకాయిలు పేరుకుపోకుండా కూటమి ప్రభుత్వం కొత్త విధానాన్ని అమలు చేస్తోంది. ఖరీఫ్-2026 నుంచి కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రత్యేక ఎస్క్రో ఖాతా విధానాన్ని ప్రవేశపెట్టింది. అంచనాతో రాష్ట్ర వాటాలో కొంత భాగాన్ని ముందుగానే జమ చేస్తోంది. ఈ ఖాతాలో మరో రూ.250 కోట్లు జమ చేయగా, ఖరీఫ్-2026కు సంబంధించి రూ.83 కోట్లు, రబీ 2026-27కు సంబంధించి రూ.44 కోట్లు అడ్వాన్స్ ప్రీమియంగా బీమా కంపెనీలకు చెల్లించింది.

మరోవైపు ఖరీఫ్-2026లో పంటల బీమా నమోదులో గణనీయమైన పెరుగుదల కనిపించింది. ఖరీఫ్-2025తో పోలిస్తే మొత్తం దరఖాస్తులు, బీమాలో చేరిన రైతులు, బీమా చేసిన విస్తీర్ణం రెండింతలకు పైగా పెరిగాయి. రాష్ట్రంలో సాగైన 31.01 లక్షల హెక్టార్లలో 17.07 లక్షల హెక్టార్లు, అంటే సుమారు 42 లక్షల ఎకరాలు, బీమా పరిధిలోకి వచ్చాయి. మొత్తం సాగు విస్తీర్ణంలో 55.05 శాతం బీమా చేయబడింది. బీమా చేసిన విస్తీర్ణంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ఆరో స్థానంలో నిలిచింది.

పంట నష్ట పరిహారంలోనూ అధిక సాయం.. పెరిగిన ఇన్‌పుట్ సబ్సిడీ!

పంటల బీమాతోపాటు ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. 2024 జూలై, ఆగస్టు-సెప్టెంబర్‌లో వచ్చిన వరదలు, భారీ వర్షాలు, 2025 మార్చిలో కురిసిన అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన 2.07 లక్షల మంది రైతులకు రూ.310.30 కోట్ల సాయం అందించింది.

మరోవైపు కేంద్ర ఎస్‌డీఆర్ఎఫ్/ఎన్‌డీఆర్ఎఫ్ నిబంధనల కంటే ఎక్కువగా పరిహారం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ రేట్లను పెంచింది. 07.01.2025న జారీ చేసిన జీవో ఎంఎస్ నెంబర్ 1 ప్రకారం వరి, పత్తి, వేరుశనగ, చెరకు పంటలకు హెక్టారుకు రూ.17,000గా ఉన్న సాయాన్ని రూ.25,000కు పెంచింది. ఎంపిక చేసిన ఇతర పంటలకు హెక్టారుకు రూ.15,000 చొప్పున అందిస్తోంది. పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ రెండూ వేర్వేరు. బీమా పరిహారం బీమా చేసిన విస్తీర్ణానికి మాత్రమే వర్తిస్తుంది. కానీ ఇన్‌పుట్ సబ్సిడీకి పంటల బీమా తప్పనిసరి కాదు. పంటకు 33 శాతం లేదా అంతకంటే ఎక్కువ నష్టం జరిగితే, బీమా చేయించుకున్నా లేకపోయినా అర్హులైన రైతులకు సాయం అందుతుంది. గరిష్ఠంగా 2 హెక్టార్ల నష్టపోయిన విస్తీర్ణానికి మాత్రమే సబ్సిడీ లెక్కిస్తారు.

ఖరీఫ్-2026లో నాలుగు విపత్తులు.. 14.59 లక్షల మంది రైతులకు పంట నష్టం

ఖరీఫ్-2026లో కరువు, అర్నబ్, మురసు తుఫాన్లు, సెప్టెంబర్‌లో వరదలు, భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. క్షేత్రస్థాయిలో పంట నష్టం నమోదు పూర్తయింది. నాలుగు విపత్తులకు సంబంధించి మొత్తం 14,59,225 మంది రైతులకు చెందిన 12,06,269.84 హెక్టార్లలో పంట నష్టం నమోదైంది. పెంచిన రాష్ట్ర ఎస్‌డీఆర్ఎఫ్ రేట్ల ప్రకారం వీరికి ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.2,532.89 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు.

అబద్ధాల ప్రచారంతో రైతులను మభ్యపెట్టలేరు

జగన్ ఐదేళ్ల పాలనలో పేరుకుపోయిన పంటల బీమా బకాయిలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోంది. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఏర్పడిన బకాయిల భారాన్ని మోస్తూనే, మరోవైపు బీమా నమోదులను పెంచి ఎక్కువ మంది రైతులకు పంటల బీమా భరోసా కల్పిస్తోంది. ప్రకృతి విపత్తులతో పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తూ ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటోంది.

ఒకవైపు గత ప్రభుత్వం వదిలివెళ్లిన బకాయిలను చెల్లించే బాధ్యత.. మరోవైపు ప్రస్తుత సీజన్‌లో రైతులకు బీమా రక్షణ కల్పించడం.. ఈ రెండు బాధ్యతలను కూటమి ప్రభుత్వం సమర్థంగా నిర్వహిస్తోంది. రైతులకు జరిగిన నష్టానికి గత పాలకులు సమాధానం చెప్పాల్సింది పోయి, ఇప్పుడు సాక్షి వేదికగా అబద్ధపు ప్రచారానికి దిగడం వైసీపీ రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనం. వాస్తవాలను పక్కనపెట్టి తప్పుడు కథనాలతో రైతులను మభ్యపెట్టలేరని గుర్తించాలి.

కరెంట్ అనాలిసిస్
తెలుసుకుందాం | విశ్లేషిద్దాం | సిద్ధమవుదాం
బి.నిర్మలాజ్యోతి, అనలిస్టు, టీడీపీ నాలెడ్జ్ సెంటర్

విపత్తుల వారీగా పంట నష్టం, ఇన్‌పుట్ సబ్సిడీ అంచనాలు

విపత్తు	జిల్లాలు	ప్రభావిత రైతులు	పంట నష్టం (హెక్టార్లు)	ఇన్‌పుట్ సబ్సిడీ అంచనా
ఖరీఫ్-2026 కరువు	20	9,87,231	9,30,899.69	రూ.1,863.23 కోట్లు
అర్నబ్ తుఫాను -అక్టోబర్ 2026	13	3,82,866	2,24,167.09	రూ.559.77 కోట్లు
మురసు తుఫాను -నవంబర్ 2026	9	52,402	32,621.68	రూ.78.65 కోట్లు
వరదలు, భారీ వర్షాలు -సెప్టెంబర్ 2026	13	36,726	18,581.38	రూ.31.24 కోట్లు
మొత్తం	--	14,59,225	12,06,269.84	రూ.2,532.89 కోట్లు

జోన్ - 1

(శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అరకు)

చైతన్యరథం

కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలి



విజయనగరం (చైతన్యరథం): కూటమి మద్దతు ఇస్తున్న అభ్యర్థులను సర్పంచులుగా గెలిపించాలని ఎమ్మెల్యే ఆదితి గజపతిరాజు కోరారు. శుక్రవారం విజయనగరం మండలం కొండకరకం, గుండాలపేటలో పాంద్రంకి రమాదేవి, గౌరీ నాయుడు పంచాయతీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో దేశం, రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుందని వివరించారు. అభివృద్ధిని కోరుకునే ప్రతి ఒక్కరూ కూటమి బలపరిచిన సర్పంచులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జడ్పీటీసీ సభ్యుడు వేసలపు శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు గంటా పోలి నాయుడు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం అప్పన్న ధ్వజస్తంభం స్వర్ణమయం... జాతీయ గుర్తింపు



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖపట్నం జిల్లా సింహాచలంలో కొలువై ఉన్న శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయ ధ్వజస్తంభ పీఠం స్వర్ణమయమైంది. అప్పన్నస్వామివారి ఆలయం ధ్వజస్తంభం పీఠానికి స్వర్ణతాపడం పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. విశాఖపట్నం సీఎంఆర్ టెక్స్‌టైల్ అండ్ జ్యువెలరీ సంస్థ అధినేత మావూరి వెంకటరమణ పెద్ద మనసు చేసుకున్నారు.. స్వామివారి ఆలయంలోని ధ్వజస్తంభం పీఠానికి రూ. 1.20 కోట్లతో బంగారు తాపడం చేయించారు. తాపడ పనులు పూర్తికావంతో.. అప్పన్న ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.. అనంతరం సంప్రదాయబద్ధంగా ధ్వజస్తంభం పీఠానికి ప్రోక్షణ జరిపించారు. ఈ పూజల్లో సీఎంఆర్ టెక్స్‌టైల్ అండ్ జ్యువెలరీ సంస్థ అధినేత మావూరి వెంకటరమణ దంపతులు, అప్పన్న ఆలయ ఈవో వెంకటరావు దంపతులు పాల్గొన్నారు.

అరకిలో బంగారంతో సింహాచలం ధ్వజస్తంభం పీఠానికి తాపడం

సీఎంఆర్ టెక్స్‌టైల్ అండ్ జ్యువెలరీ సంస్థ అధినేత మావూరి వెంకటరమణ అప్పన్న ఆలయంలో ధ్వజస్తంభం పీఠానికి దాదాపు అరకిలోకుపైగా బంగారంతో రాగిరేకులపై స్వర్ణతాపడం చేయించారు. ఈ తాపడం పనులు చెన్నై స్మార్ట్ క్రియేషన్స్‌కు చెందిన శిల్పి రామచంద్రారెడ్డి పర్యవేక్షణలో స్వర్ణకారులతో కలిసి ఈ పనులు పూర్తి చేశారు. ఇటు స్వర్ణ తాపడం పనులకు తయారీ సంస్థ 25 ఏళ్ల వారంటీ కూడా ఇచ్చింది.. ఈ మేరకు వారంటీకి సంబంధించి ధ్రువపత్రం కూడా జారీ చేసింది. సీఎంఆర్ టెక్స్‌టైల్ అండ్ జ్యువెలరీ సంస్థ అధినేత మావూరి వెంకటరమణ 2023లో రూ. 1.80 కోట్లతో ధ్వజస్తంభానికి స్వర్ణతాపడం పనులు కూడా చేయించారు. ఈ పూజలు, సంప్రోక్షణ మసమ సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ దంపతులు, దేవస్థానం ఈఓ జల్లేపల్లి వెంకటరావు దంపతులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ దంపతులు అప్పన్నను దర్శించుకుని.. అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కప్ప స్తంభ ఆలింగనం, గోదాదేవి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఆ తర్వాత ఆలయ పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఈ స్వర్ణ తాపడం పనుల కోసం చెన్నైకు చెందిన నిపుణులైన స్వర్ణకారులు దాదాపు ఏడాదిపాటు శ్రమించారన్నారు. ఈ తాపడానికి కావలసిన రేకుల్ని కష్టపడి సిద్ధం చేశారన్నారు. అప్పన్న స్వామివారి ధ్వజస్తంభాన్ని స్వర్ణయమం చేసే అదృష్టం తనకు దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు.

సింహాచలం ఆలయానికి జాతీయ గుర్తింపు

సింహాచలం అప్పన్న ఆలయానికి మరో జాతీయ గుర్తింపు వచ్చింది. ఆలయంలో భక్తులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన, సురక్షితమైన అన్నప్రసాదాలు అందిస్తున్నందుకు ప్రతిష్ఠాత్మక FSSAI (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఈట్ రైట్ ప్లేస్ ఆఫ్ వర్షిప్ జాతీయ గుర్తింపు దక్కింది. సింహాచలం దేవస్థానం ఈవో జల్లేపల్లి వెంకటరావుకు ఆహార భద్రతా అధికారులు ఈ ధ్రువీకరణ పత్రాన్ని ఈ నెల 24న అందజేసిన సంగతి తెలిసిందే. అప్పన్న ఆలయంలో కిచెన్‌ల పరిశుభ్రత, ముడి సరుకుల నాణ్యత, తాగునీటి సరఫరా వంటి ప్రమాణాలను పాటిస్తున్నారు. ఈ మేరకు స్వతంత్ర ఆడిట్ సంస్థ పరిశీలించి.. రెండేళ్ల కాలపరిమితితో ఈ సర్టిఫికెట్‌ను ఇచ్చింది. రాబోయే రోజుల్లోనూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటుగా మెరుగైన అన్నప్రసాదం అందిస్తామని ఈవో వెంకటరావు తెలిపారు.

గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించండి

● అరకు నియోజకవర్గ పరిశీలకులు బుద్ధ నాగ జగదీశ్వరరావు



అరకు (చైతన్యరథం): నియోజకవర్గంలో అనంతగిరి మండలంలో ఈ నెల 29 జరగబోతున్న సర్పంచ్ ఎన్నికలకు నియోజకవర్గ ఇన్చార్జి సియ్యర్ దన్ను దొర మాజీ ఎమ్మెల్సీ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి సర్పంచ్ అభ్యర్థుల పోటీ చేస్తున్న గ్రామాల్లో కాశీపట్నం, ఎస్ ఆర్ పురం, కొత్తూరు, చిలుకలు గడ్డ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను ఉద్దేశించి ఈ ప్రాంత వైసిపి ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి శాసనసభకు వెళ్లకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి కనీసం ప్రయత్నాలు చేయకుండా ప్రజలను గాలికి వదిలేసారని, ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాల విషయంలో కూడా ఎమ్మెల్యే విఫలమయ్యారని, కనుక మీ గ్రామాలు అభివృద్ధి కార్యక్రమాలు జరగాలంటే కూటమి మద్దతు నిలబెట్టిన అభ్యర్థులను గెలిపించుకున్నట్లయితే మీ గ్రామాలు అభివృద్ధికి కోట్లాది రూపాయలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కలిసి ఇప్పటికే రోడ్లు మారుమూల గ్రామాలకు నిర్మాణాలు చేపట్టారని, కేంద్ర ప్రభుత్వం ఆర్థిక నిధులతో కూటమి అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి తో పాటు మీ పిల్లల భవిష్యత్తు కి కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు ఉద్యోగ ఉపాధి అవకాశాలకు పెద్ద పీట వేస్తుందని నాగ జగదీష్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సియ్యర్ సుబ్బారావు శరణం నందకిషోర్ కే రవి భీమవరపు లలిత కూటమి నాయకులు పాల్గొన్నారు.

జడ్పీచైర్ పర్సన్ సిరి సహస్రకు గ్రామీణ వైద్యుల అభినందనలు



విజయనగరం (చైతన్యరథం): విజయనగరం జిల్లా స్థానిక ధర్మపురిలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ప్రతినిధులు నూతన జడ్పీ ఛైర్ పర్సన్ మజ్జి సిరి సహస్ర దంపతులకు అభినందనలు తెలిపారు. అనంతరం సిరిసహస్ర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి సహకరించి, తమను ఆశీర్వదించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్.ఎం.పి సంఘం సభ్యులకు ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వారి వెంట జోనల్ అధ్యక్ష కార్యదర్శులు జంగం జోషి, గెద్ద చిరంజీవి, జిల్లా అధ్యక్షులు కోట్ల పైడిరాజు, మహిళా అధ్యక్షురాలు భవాని, ఈసీ మెంబర్ ఆదినారాయణ, సీతారాం, వై. పైడిరాజు, చందక శ్రీను, తెర్లాం మండల ఆర్ఎంపీ సభ్యులు ఉన్నారు.

వైకుంఠ ద్వార దర్శనాల టిక్కెట్లు, టోకెన్ల జారీ వివరాలు ప్రకటించిన టీటీడీ



తిరుపతి (చైతన్యరథం): టీటీడీ కీలక ప్రకటన చేసింది. ఈ సారి తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 20 నుంచి 29వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిసైడ్ అయింది. టికెట్లు.. టోకెన్ల జారీ తేదీలతో పాటుగా టైమింగ్స్ ను వెల్లడించింది. స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్ల ఈ-డిప్ నమోదుకు అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. తొలి రెండు రోజుల్లో ప్రోటోకాల్ మినహా బ్రేక్ దర్శనాలను రద్దు చేసింది. వైకుంఠ ఏకాదశి వేళ శ్రీవారి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చే అవకాశం ఉంది. దీంతో, పది రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనం కొనసాగించాలని టీటీడీ నిర్ణయించింది. డిసెంబర్ 20 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్న వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి వివిధ దర్శన టికెట్లు, టోకెన్ల విడుదల తేదీల వివరాల పైనా స్పష్టత ఇచ్చింది. అందులో భాగంగా నవంబర్ 28న ఉదయం 10 గంటలకు శ్రీవాణి దర్శన టికెట్ల కోటా విడుదల చేయనున్నారు. నవంబర్ 30వ తేదీ ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల కానుంది. అదే విధంగా డిసెంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి డిసెంబర్ 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠ ఏకాదశి, ద్వాదశి తొలి రెండు రోజులకు సంబంధించిన స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్ల కోసం భక్తులు ఈ-డిప్‌లో నమోదు చేసుకోవచ్చని టీటీడీ వెల్లడించింది. సామాన్య భక్తులకు ప్రాధాన్యత కాగా, డిసెంబర్ 7వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఈ-డిప్ ద్వారా స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్ల కేటాయించనున్నారు. డిసెంబర్ 8వ తేదీ ఉదయం 10 గంటలకు దాతల దర్శన కోటా టికెట్ల విడుదల చేయనున్నారు. అయితే.. టీటీడీ నిర్ణయం మేరకు వైకుంఠ ఏకాదశి, ద్వాదశి తొలి రెండు రోజులైన డిసెంబర్ 20, 21 తేదీల్లో ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేయడం జరిగింది. ఈ రెండు రోజుల్లో అధిక సంఖ్యలో సామాన్య భక్తులకు స్వామివారి దర్శనం కల్పించేందుకు స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్లను ఈ-డిప్ విధానం ద్వారా ఆన్‌లైన్‌లో కేటాయించనున్నారు. అలాగే, ఈ రెండు రోజులకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను కూడా రద్దు చేసినట్లు వెల్లడించారు. కాగా.. భక్తులు దర్శన టికెట్లు, టోకెన్లను టీటీడీ అధికారిక వెబ్‌సైట్ https://ttdevasthanams.ap.gov.i అ ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలని టీటీడీ సూచిస్తోంది. వైకుంఠ దర్శనాల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ముందస్తు చర్యల పైన టీటీడీ తుది కసరత్తు చేస్తోంది.

ఓటు విలువను చాటిచెప్పిన భావి ఓటర్లు



విజయనగరం (చైతన్యరథం): భవిష్యత్ ఓటర్లలో చైతన్యం నింపేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లా యంత్రాంగం వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో ప్రశంసాపత్రాలు అందించారు. కొత్త ఓటర్లకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంచడమే లక్ష్యంగా మొదట నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు జరిగాయి. అక్కడ గెలిచిన వారికి జిల్లా స్థాయిలో మరో రౌండ్ పోటీలు నిర్వహించి 20 మందిని విజేతలుగా ఎంపిక చేశారు. "స్వచ్ఛమైన ఓటరు జాబితా ప్రాధాన్యం", "ఓటు విలువ" అంశాలపై వ్యాసరచన సాగింది. పాల్గొన్న విద్యార్థులు అందరినీ కలెక్టర్ అభినందించారు. జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్, జిల్లా రెవెన్యూ అధికారి సి. హెచ్. సత్తిబాబు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

బొబ్బిలి మండలం కోమటిపల్లిలో రాస్తారోకో

బొబ్బిలి (చైతన్యరథం): బొబ్బిలి మండలం కోమటిపల్లిలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య గురువారం అర్ధరాత్రి జరిగిన ఘటన ఉద్రిక్తతకు దారితీసింది. టీడీపీ వర్గీయులు తమను కొట్టారంటూ వైసీపీ వర్గీయులు రహదారిపై బైఠాయించారు. టీడీపీ కార్యకర్తల దాడితో సంపత్, అభిషేక్‌లు గాయపడ్డారని.. వారితో సహా రోడ్డుపై అటకాయించారు. పోలీసులు కూడా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. డీఎస్పీ గోవిందరావు, సీఐ నారాయణరావులు ఆందోళనకారులతో చర్చించారు. బొబ్బిలి – బలిజిపేట మధ్య రాకపోలకు అంతరాయం ఏర్పడింది.

కొవ్వూరు కూటమి సర్పంచులకు దేవినేని ఉమా అభినందనలు

●గ్రామాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచన



కొవ్వూరు (చైతన్యరథం): తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి సర్పంచుల అభినందన సభలో మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు, టీడీపీ నేత, పారిశ్రామికవేత్త పెండ్యాల అచ్చిబాబుతో కలిసి ఈ కార్యక్రమానికి హాజరై విజయం సాధించిన కూటమి సర్పంచులను అభినందించారు. ఈ సందర్భంగా దేవినేని ఉమా మాట్లాడుతూ ప్రజల విశ్వాసాన్ని చూరగొని విజయం సాధించిన సర్పంచులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వ సహకారంతో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం వంటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు. కూటమి ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులందరూ సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు.

యర్నగూడెం గ్రామ అభివృద్ధికి కూటమి అభ్యర్థి బొల్లిన పద్మజకు మద్దతివ్వండి

●మంచం గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలి : దేవినేని ఉమా



గోపాలపురం (చైతన్యరథం): గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, పారదర్శక పాలన, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం దేవరపల్లి మండలం ఎర్నగూడెం గ్రామంలో పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి బొల్లిన పద్మజకి మద్దతుగా నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో దేవినేని ఉమా పాల్గొని అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను కలిసి కూటమి అభ్యర్థి బొల్లిన పద్మజకి మద్దతు తెలియజేయాలని కోరారు. గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే నాయకత్వాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఎర్నగూడెం గ్రామ సమగ్ర అభివృద్ధికి కూటమి అభ్యర్థి బొల్లిన పద్మజకి మంచం గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశంపార్టీ నాయకులు పెనుమర్చి సుబ్బరాజు, సీనియర్ నాయకులు బల్ల సూర్యచక్రం తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరావతి రైతులకు 38 రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు



తుళ్లూరు (చైతన్యరథం): ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి, గన్నవరం విమానాశ్రయం అభివృద్ధికి భూములిచ్చిన 12 మంది రైతులకు శుక్రవారం 2026 నవంబర్ 27న రాయపూడిలోని ఏపీ సీఆర్డీఏ కార్యాలయంలో ఈ-లాటరీ విధానం ద్వారా 38 రిటర్నబుల్ ప్లాట్లను కేటాయించారు. దీనికి హాజరైన రైతుల సమక్షంలో ఆన్లైన్ ర్యాండమ్ సిస్టం ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు ముందుగా ట్రైల్ రన్ వేసిన అనంతరం ప్రత్యక్ష లాటరీ ప్రక్రియను చేపట్టారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు APCRDA ల్యాండ్స్ విభాగం డైరెక్టర్ (క్యాపిటల్ సిటీ) కె.ఎస్. భాగ్యరేఖ, గుంటూరు LPS కోఆర్డినేషన్ డిప్యూటీ కలెక్టర్ వి.డేవిడ్ రాజు ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేశారు. రాజధాని నిర్మాణానికి భూములను అందజేసిన బోరుపాలెం, మల్కాపురం, ఉండవల్లి గ్రామాలకు చెందిన 9 మంది రైతులకు 26 రెసిడెన్షియల్, 6 కమర్షియల్ ప్లాట్లను, గన్నవరానికి చెందిన ముగ్గురు రైతులకు 5 రెసిడెన్షియల్, 1 కమర్షియల్ ప్లాట్ను అధికారులు కేటాయించారు. రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని భాగ్యరేఖ కోరారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎ.జి.చిన్నికృష్ణ, ఐటీ, ప్లానింగ్, జీఐఎస్ కమ్యూనికేషన్స్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీకి మళ్లీ తుపాను ముప్పు... ఈ జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరిక



అమరావతి (చైతన్యరథం): ఏపీ వైపు మరో వైపు తుఫాను దూసుకొస్తోంది. వరుసగా రెండు తుఫాన్లతో ఏపీకి నష్టం జరిగింది. కాగా, ఇప్పుడు వరుసగా మరో రెండు తుఫాన్లు పొంచి ఉన్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది. నవంబర్ 30 నాటికి అండమాన్, ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడవచ్చని అంచనా వేసింది. అనంతరం ఇది మరింత బలపడి వాయుగుండంగా మారే సూచనలు ఉన్నాయని తెలిపింది. దీంతో, డిసెంబర్ తొలి వారంలో తుఫాను అవకాశం ఉందని అంచనాగా వెల్ల డించారు. దీంతో, యంత్రాంగం అప్రమత్తం అవుతోంది. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది. దక్షిణ అండమాన్ సముద్రంపై ఏర్పడనున్న ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఈ నెల 30వ తేదీ నాటికి అండమాన్, ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. ఈ అల్పపీడనం మరింత బలపడి డిసెంబర్ 2 నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే సూచనలు ఉన్నాయని విశ్లేషించింది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా పయనిస్తూ తమిళనాడు లేదా శ్రీలంక తీరాల వైపు కదిలే అవకాశం ఉందని వివరించింది. అల్పపీడనం వాయుగుండంగా బలపడిన తర్వాత పశ్చిమ వాయవ్య దిశగా కదిలే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ తెలిపింది. ఈ క్రమంలో తమిళనాడు లేదంటే శ్రీలంక తీరాల వైపు పయణించవచ్చని అంచనా వేస్తున్నారు.

ఏపీలో పలు జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం

కాగా, దీని గమనంపై వాతావరణ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం అల్పపీడనం ఏర్పడకముందే దాని గమనం, తీవ్రతపై స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు.. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో ఇవాళ మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యే చాన్స్ ఉంది. ఏపీలోని పలు జిల్లాల్లో వర్షాలు పడే అవకాశముందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. నెల్లూరు, కర్నూలు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు కురవవచ్చని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా చెదురుమదురుగా తేలికపాటి జల్లులు పడతాయని పేర్కొన్నారు. తెలంగాణలోనూ వర్షాలు దంచికొట్టనున్నాయి. హైదరాబాద్ నగరంలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. ఇవాళ సాయంత్రం కూడా నగరంలోని మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

20ఏ ఆర్టీసీ సర్వీసు పున: ప్రారంభించిన ఎమ్మెల్యే వెలగపూడి



మద్దిలపాలెం (చైతన్యరథం): దశాబ్దకాలంగా నిలిచిపోయిన 20ఏ ఆర్టీసీ బస్సు సర్వీసును ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పునఃప్రారంభించారు. హెచ్బీ కాలనీ నుంచి కృష్ణ కాలేజీ, మద్దిలపాలెం కాంప్లెక్స్, జగదాంబ కూడలి, పూర్ణమార్కెట్, పాత పోస్టాఫీసు మీదుగా మళ్లీ హెచ్బీ కాలనీకి ప్రయాణిస్తుంది. ప్రజలకు ఎంతో ఉపయోగమైన ఈ సర్వీసును పునరుద్ధరించాలని స్థానిక నాయకులు ఆర్టీసీ అధికారులను కోరడంతో ఎట్టకేలకు బస్సును తిరిగి ప్రారంభించారు. కార్యక్రమంలో 18వ వార్డు కార్పొరేటర్ ధనుద్డి, ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు, కార్పొరేటర్లు కాళ్ల లలిత, అనగాని శివరామకృష్ణ, పల్లా ఉమారాణి, సత్యనారాయణ, గంట్ల నాగరాజు రవికుమార్, మహేశ్వరరావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి : కలెక్టర్



జగ్గంపేట (చైతన్యరథం): రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఓటర్లు ఉదయం 7 గంటల నుంచి 1 గంట లోపు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ హరేంధీర ప్రసాద్ తెలిపారు. జగ్గంపేట, గండేపల్లి మండల కేంద్రాల్లో జరిగే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక సదుపాయలు అందుబాటులో ఉంచాలని, పోలింగ్ సామగ్రి పంపిణీ నుంచి ముగింపు వరకు పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. లెక్కింపు కేంద్రాల వద్ద కౌంటింగ్ టేబుళ్లు, రికార్డులు, ఫలితాల నమోదు, భద్రతపై దృష్టి సారించాలన్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో హరికృష్ణ సత్యరెడ్డి, స్వర్ణ గ్రామ మండల అధికారి శిరీష, ఏవో చంద్రరావు తదితరులు ఉన్నారు.

కూటమితో రాష్ట్ర సమగ్రాభివృద్ధి : గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

●చీరాల, పెదకాకానిలో ఎమ్మెల్యేలు కొండయ్య, నరేంద్రతో కలిసి ఎమ్మెల్యే నసీర్ ఎన్నికల ప్రచారం



గుంటూరు (చైతన్యరథం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పరిపాలన సాగుతోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన బాపట్ల జిల్లా చీరాల పట్టణంలో ఎమ్మెల్యే కొండయ్య, పొన్నూరు నియోజకవర్గం పరిధిలోని పెదకాకాని మండలంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రతో కలిసి విస్తృతంగా పర్యటించారు. కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేస్తోన్న చారిత్రాత్మక పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. సీఎం నారా చంద్రబాబునాయుడు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నారని, కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసాను కల్పిస్తున్నాయని తెలిపారు. తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో చదువుకునే ప్రతి విద్యార్థికి ఆర్థిక సాయం అందజేస్తూ తల్లుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టామని చెప్పారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో విధ్వంసానికి గురైన రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణ పనులు మళ్లీ పట్టాలెక్కాయని తెలిపారు. ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని, తద్వారా యువతకు భారీ ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పని చేస్తున్నాయని చెప్పారు. మైనారిటీ వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. మైనారిటీ యువతకు స్వయం ఉపాధి రుణాలు, విద్యార్థులకు విదేశీ విద్యా పథకం, షాదీఖానాల నిర్మాణం, ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాల చెల్లింపు వంటి కార్యక్రమాలను ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోందన్నారు.

జోన్ - 3 (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)

చైతన్యరథం

విజయవాడ నగర సమగ్ర అభివృద్ధికి సమష్టిగా కృషి చేస్తాం

●మేయర్‌గా వంగవీటి రాధాకృష్ణ, డిప్యూటీ మేయర్‌గా చెన్నుపాటి కాంతిశ్రీ బాధ్యతల స్వీకరణ



విజయవాడ (చైతన్యరథం): నగరపాలక సంస్థ మేయర్‌గా వంగవీటి రాధాకృష్ణ, డిప్యూటీ మేయర్‌గా చెన్నుపాటి కాంతిశ్రీ శుక్రవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తొలుత ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎంపీ చిన్ని, బుద్ధా వెంకన్న సీనియర్ నాయకులు, డిప్యూటీ మేయర్ కాంతి శ్రీ, కార్పొరేటర్లతో కలిసి దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత నగరపాలక సంస్థ కార్యాలయంలోని తమ ఛాంబర్లలో మేయర్, డిప్యూటీ మేయర్‌లు అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ.. విజయవాడ నగర ప్రజల ఆశీస్సులు, ఆకాంక్షల మేరకు వంగవీటి రాధాకృష్ణ మేయర్‌గా బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజల బలమైన కోరిక మేరకే రాధా మేయర్‌గా ఎన్నికయ్యారని, ఆయన నాయకత్వంలో విజయవాడ నగరం మరింత అభివృద్ధి చెందుతుందనే విశ్వాసం వ్యక్తం చేశారు.

విజయవాడ గొప్ప చారిత్రక ప్రాధాన్యత నగరం

అత్యంత పురాతన నగరాల్లో ఒకటైన విజయవాడకు గొప్ప చారిత్రక ప్రాధాన్యత ఉందని, ఆంధ్రప్రదేశ్‌లో రెండో అతిపెద్ద నగరంగా గుర్తింపు పొందిన విజయవాడను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని ఎంపీ పేర్కొన్నారు. మేయర్ వంగవీటి రాధాకృష్ణ నాయకత్వంలో నగర అభివృద్ధికి కూటమి నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తారని స్పష్టం చేశారు. అమరావతి ఏ విధంగా అభివృద్ధి చెందుతుందో అదే తరహాలో విజయవాడ నగరాన్ని కూడా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

ప్రజలకు మరింత మెరుగైన పాలన

కొత్తగా బాధ్యతలు చేపట్టిన నగరపాలక మండలి ముందు అనేక సమస్యలు, సవాళ్లు ఉన్నాయని, సమర్థవంతమైన నాయకత్వంలో వాటన్నింటినీ దశలవారీగా పరిష్కరిస్తారనే నమ్మకం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఆశిస్తున్న అభివృద్ధి ఫలాలను ప్రజలకు అందించడంలో నూతన పాలకవర్గం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ట్రిపుల్ ఇంజిన్ ప్రభుత్వ సమన్వయంతో విజయవాడ ప్రజలకు మరింత మెరుగైన పాలన, అభివృద్ధి ఫలాలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకం

●తెనాలి పరిధి కొలకలూరు గ్రామ అభివృద్ధికి పాటుపడే నాగేశ్వరరావుకి ఓటు వేయాలని కోరిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పాతర్ల



తెనాలి (చైతన్యరథం): ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో కీలకమైందని అందరూ తమ ఓటును హక్కును వినియోగించుకుని కొలకలూరు గ్రామ అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు కృషి చేస్తున్నా కూటమి అభ్యర్థి తెలుగుదేశం పార్టీ తెనాలి మండల అధ్యక్షులు నల్లిపోయిన నాగేశ్వరరావును అఖండ మెజార్టీతో గెలిపించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాతర్ల రమేష్ ఓటర్లకు పిలుపునిచ్చారు. తెనాలి మండలం కొలకలూరులో గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా జరిగిన ర్యాలీ సందర్భంగా పాతర్ల రమేష్ మాట్లాడుతూ... ప్రజల సమస్యల పరిష్కారానికి గ్రామ అభివృద్ధికి పని చేసే వ్యక్తి నాగేశ్వరరావు అని ప్రజలకు అందుబాటులో ఉంటాడని ఓటర్లకు ఆయన హామీ ఇచ్చారు. పిలిస్తే పలికే వ్యక్తి నాగేశ్వరరావు అని కత్తెర గుర్తుకు తమ అమూల్యమైన ఓటును వేసి నల్లిపోయిన నాగేశ్వరావును అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. కొలకలూరులో జరిగిన ర్యాలీలో తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ ఉపాధ్యక్షులు చాగంటి పాటి పూర్ణచంద్రరావు కొలకలూరు ఎంపీటీసీలు షేక్ అజీజ్. దాదిపద్మ. తెలుగుదేశం నాయకులు రమ్య, కొలకలూరు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దూళ్ళ నరేంద్ర కుమార్, తెలుగు నాయకులు శుద్ధపల్లి కృష్ణ, షేక్ జిలాని, గాదె వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వసంత హైమావతి పార్థివదేహానికి ఘనంగా నివాళులర్పించిన ఎంపీ కేశినేని

●మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి



నందిగామ (చైతన్యరథం): మాజీ హోంశాఖ మంత్రి వసంత నాగేశ్వరరావు సతీమణి, మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ మాతృమూర్తి వసంత హైమావతి మృతి పట్ల విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి, ప్రగాఢ విచారం వ్యక్తం చేశారు. శుక్రవారం నందిగామ నియోజకవర్గంలోని ఐతవరంలో ఉన్న వసంత హైమావతి స్వగృహానికి ఎంపీ కేశినేని చిన్ని వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె పార్థివదేహంపై పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మృతికి సంతాపం తెలియజేస్తూ, వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం మాజీ హోంశాఖ మంత్రి వసంత నాగేశ్వరరావును, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌ను, ఇతర కుటుంబ సభ్యులను ఎంపీ కేశినేని చిన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ, వసంత హైమావతి మృతి వసంత కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబ పెద్దగా అందరికీ ఆప్యాయతను పంచుతూ, కుటుంబ సభ్యుల ప్రేమాభిమానాలను పొందిన ఆమె మరణం బాధాకరమన్నారు. ఆమె మృతి పట్ల తనకు తీవ్ర విచారం కలిగిందని తెలిపారు. ఆప్తులను కోల్పోయిన బాధను మాటల్లో వర్ణించలేమని, ఈ విషాద సమయంలో వసంత నాగేశ్వరరావు, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌తో పాటు కుటుంబ సభ్యులందరికీ భగవంతుడు మనోధైర్యాన్ని, ధైర్యస్థైర్యాలను ప్రసాదించాలని ప్రార్థించారు. వసంత హైమావతి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ బాధను తట్టుకునే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆకాంక్షించారు.

పల్లెలు, పట్టణాల్లో కూటమికే ప్రజల పట్టం: చీఫ్ విప్ జీవీ

● బ్యాలెట్ అయినా, ఈవీఎం అయినా గెలుపు కూటమిదేనని నిరూపణ



వినుకొండ (చైతన్యరథం0: పల్లెలైనా, పట్టణాలైనా ప్రజలు ఎన్డీఏ కూటమికే పట్టం కట్టారని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 94శాతం, తొలివిడత పంచాయతీ ఎన్నికల్లో 78 శాతం స్థానాల్లో కూటమి విజయం సాధించిందని వెల్లడించారు. బ్యాలెట్ అయినా, ఈవీఎం అయినా గెలుపు కూటమిదేనని ప్రజలు నిరూపించారని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌ల సమిష్టి కృషి, 'సూపర్ సిక్స్' పథకాల వల్లే ఈ ప్రజా విజయం సాధ్యమైందని తెలిపారు. గత వైసీపీ పాలనను ప్రజలు తిరస్కరించారని, ఓటమి భయంతోనే వైసీపీ నేతలు పలుచోట్ల పోటీకి దూరంగా ఉన్నారని విమర్శించారు. వినుకొండ నియోజకవర్గంలోని 119 పంచాయతీలకు గాను 98 స్థానాల్లో కూటమి గెలిచిందని, బొల్లా బ్రహ్మనాయుడు సొంత గ్రామంలోనూ టీడీపీ మద్దతుదారుడు విజయం సాధించారని చెప్పారు. గ్రామాల్లో చిచ్చు పెట్టే వైఖరిని బొల్లా బ్రహ్మనాయుడు ఇప్పటికైనా మార్చుకోవాలని ఆయన హితవు పలికారు.

నూతన సర్పంచులకు చీఫ్ విప్ జీవీ సన్మానం

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించిన నూతన సర్పంచులను ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఘనంగా సన్మానించారు. వినుకొండ పట్టణంలోని చీఫ్ విప్ వారి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సర్పంచులను సన్మానించి కేక్ కట్ చేసి సర్పంచులకు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని మొత్తం 119 పంచాయతీలకు గాను 98 స్థానాలను కూటమి కైవసం చేసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంపై పూర్తి నమ్మకంతో ప్రజలు ఈ తీర్పునిచ్చారని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని ఆయన సర్పంచులకు దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పంచాయతీ ఎన్నికలపై టీడీపీ నేత బుద్ధా వెంకన్న సమీక్ష

జగ్గయ్యపేట (చైతన్యరథం): రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు ఈ నెల 29వ తేదీన జగ్గయ్యపేట నియోజకవర్గంలో జరగనున్న పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య గారిని పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ బుద్ధా వెంకన్న మర్యాదపూర్వకంగా కలిసి ఎన్నికల నిర్వహణ, పార్టీ తరపున చేపట్టాల్సిన కార్యాచరణ, క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్ర పార్టీ నాయకత్వం సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియలో అనుసరించాల్సిన వ్యూహాలు, స్థానిక పరిస్థితులు, గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ఇరువురు నేతలు సమీక్షించారు. ఈ సందర్భంగా బుద్ధా వెంకన్న గారు మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణతో నిర్వహిస్తూ, నాయకులు, కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియలో ముందుకు సాగుతామని తెలిపారు. పార్టీ నిర్ణయాలు, రాష్ట్ర నాయకత్వం ఆదేశాలకు అనుగుణంగా పనిచేయడం ప్రతి నాయకుడి బాధ్యత అని పేర్కొన్నారు.

విద్యాసేవకే జీవితాన్ని అంకితం చేసిన గొప్ప సేవామూర్తికి ఘన నివాళి!

● విద్యారంగానికి తీరని లోటు.. డాక్టర్ నన్నపనేని మంగాదేవి మృతి పట్ల మేయర్ లక్ష్మీ అపర్ణ తీవ్ర సంతాపం!



గుంటూరు (చైతన్యరథ:): గుంటూరు విద్యారంగంలో విశేష సేవలందించిన వెంకటేశ్వర బాలకోటి ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ నన్నపనేని మంగాదేవి శుక్రవారం చోడవరంలోని చేతన ఫౌండేషన్ ఆవరణలో కన్నుమూయడం పట్ల గుంటూరు నగర మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. డాక్టర్ మంగాదేవి భౌతికకాయాన్ని సందర్శించి, పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. విద్యారంగ అభివృద్ధికి, సమాజ సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప సేవామూర్తిని కోల్పోవడం గుంటూరు నగరానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆమె అందించిన విద్యాసేవలు, సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయని అన్నారు. లతఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, డాక్టర్ నన్నపనేని మంగాదేవి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్‌ను కలిసిన కలెక్టర్



గుంటూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎం.సత్యనారాయణ మూర్తిని జిల్లా కలెక్టర్ సీఎం.సాయికాంత్ వర్మ శుక్రవారం గుంటూరులో మర్యాద పూర్వకంగా కలిశారు. గుంటూరు కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ క్యాంపు కోర్టును జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తుంది. ఈ క్యాంపు కోర్టులో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం జిల్లాలకు సంబంధించి హెచ్ఎర్సీ వద్ద నమోదైన మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన కేసుల విచారణలతో పాటు మానవ హక్కుల ఉల్లంఘనలకు సంబంధించి నూతన కేసుల స్వీకరణ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ను మర్యాద పూర్వకంగా కలిశారు.

జోన్-5 (నంద్యాల, కర్నూలు, హిందూపూరం, అనంతపురం, కడప)

చైతన్యరథం

వాపుని చూసి బలుపు అనుకోవద్దు ప్రకాష్ రెడ్డి

●మేమే అక్రమాలకు పాల్పడి ఉంటే.. వాళ్లు ఎలా గెలిచారు

●మీ మెజారిటీ... మా రెబల్ అభ్యర్థులకు వచ్చిన ఓట్లతో సమానం

●రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత స్ట్రాంగ్ కౌంటర్

●ఎమ్మెల్యే సునీతను కలిసిన నూతన సర్పంచులు, వార్డు సభ్యులు



రాప్తాడు (చైతన్యరథం): నియోజకవర్గ పంచాయతీ ఎన్నికల్లో ఫలితాలను చూసి మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి బలుపుగా భావిస్తున్నారని.. అది కేవలం వాపు అన్నది తెలుసుకుంటే మంచిదని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. నియోజకవర్గంలోని మొత్తం 96 పంచాయతీలకు గాను 52చోట్ల టీడీపీ, ఒక చోట జనసేన.. మొత్తం 53 స్థానాలలో అభ్యర్థులు ఘన విజయం సాధించడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు రామగిరి మండలం, వెంకటాపురం, అనంతపురంలోని ఎమ్మెల్యే నివాసాలకు భారీగా తరలివచ్చి పరిటాల సునీతను కలిశారు. నూతన సర్పంచులు, వార్డు సభ్యులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. వారిని ఘనంగా సత్కరించారు. అలాగే తమకు అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యే సునీతను ఘనంగా సత్కరించి.. ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. ఎన్నికల్లో తాము అక్రమాలకు పాల్పడ్డామని ప్రకాష్ రెడ్డి ఆరోపించడం హాస్యాస్పదమని, వాపుని చూసి బలుపు అనుకోవద్దని ఘాటుగా విమర్శించారు. నిజంగా తామే అధికార బలంతో అక్రమాలకు పాల్పడి ఉంటే స్వల్ప తేడాతో కోల్పోయిన మరో 20 పంచాయతీలను కూడా గెలిపించుకునే వాళ్లమని స్పష్టం చేశారు. రామగిరి మండలం పేరూరు పంచాయతీలో వైసీపీ అభ్యర్థి కేవలం ఒక్క ఓటుతో గెలిచారని, తామే గనుక ఫలితాలను తారుమారు చేసేవాళ్లమైతే ఆ ఒక్క ఓటును మేనేజ్ చేసుకోలేమా అని సూటిగా ప్రశ్నించారు. మీ కరపత్రికలో 10 ఓట్ల ఆధిక్యం ఉంటే 200 ఓట్ల భారీ ఆధిక్యం వచ్చినట్లు తప్పుడు రాతలు రాసుకుంటున్నారని విమర్శలు చేశారు. అసలు 190 ఓట్లు మార్చడానికి సాధ్యమవుతుందా అని నిలదీశారు. ఎన్నికలు అత్యంత పారదర్శకంగా జరిగాయన్న విషయం మీకు కూడా తెలుసని అన్నారు. అసలు వైసీపీ గెలిచిన స్థానాల వెనుక ఉన్న అసలు లెక్కలను ప్రకాష్ రెడ్డి తెలుసుకోవాలని సునీత ఎద్దేవా చేశారు. ఒకే పంచాయతీలో తమ పార్టీకి చెందిన అభ్యర్థులు ఎక్కువ మంది రెబల్స్‌గా పోటీలో ఉండటం వల్ల ఓట్లు చీలిపోయి కొన్ని కీలక పంచాయతీలను తాము కోల్పోయామని వివరించారు. ఉదాహరణకు రాప్తాడు పంచాయతీలో వైసీపీ అభ్యర్థికి 1,405 ఓట్లు రాగా, బరిలో ఉన్న ముగ్గురు టీడీపీ మద్దతుదారులకు (965 + 1,365 + 1,305) కలిపి ఏకంగా 3,635 ఓట్లు వచ్చాయని, అంటే టీడీపీకి 2,230 ఓట్ల భారీ ఆధిక్యం ఉన్నప్పటికీ ఓట్లు చీలిపోవడం వల్ల వైసీపీ అభ్యర్థి కేవలం 40 ఓట్ల స్వల్ప మెజారిటీతో గెలిచారని గుర్తుచేశారు. ఇదే తరహాలో ఆత్మకూరు, చెన్నేకొత్తపల్లి మండలంలోని మేడాపురం, నాగసముద్రం పంచాయతీల్లో తమ రెబల్ అభ్యర్థుల వల్లే వైసీపీ గెలిచిందని, ఇదేనా మీ బలం అని ప్రశ్నించారు. అంతేకాకుండా నియోజకవర్గంలోని 5పంచాయతీల్లో టై, మరియు 1నుంచి 40 ఓట్ల లోపు అత్యంత స్వల్ప తేడాతో తాము ఓడిపోయామని.. రంగంపేట (9), గాండ్లపర్తి (24), రాప్తాడు (40), పేరూరు (1), బసంపల్లి (37) స్థానాల్లో వైసీపీకి వచ్చిన మొత్తం మెజారిటీ కేవలం 111 ఓట్లు మాత్రమేనన్నారు. ఇక పులేటిపల్లిలో సమాన ఓట్లు రాగా లాటరీలో వైసీపీకి దక్కిందని గణాంకాలతో సహా వివరించారు. మొత్తం 96 పంచాయతీల్లో కూటమి 55 శాతం స్థానాలు 13,252 మెజారిటీ ఓట్లతో కైవసం చేసుకుంటే, వైసీపీ 43 శాతం స్థానాల వద్దే 9,831 మెజారిటీ ఓట్ల వద్ద ఆగిపోయిందన్నారు. అంటే మా రెబల్ అభ్యర్థులకు వచ్చిన 09వేల ఓట్లకన్నా మీ మెజారిటీ 831ఓట్లు ఎక్కువ. గతంలో మీలాగా తాము అక్రమాలకు పాల్పడి ఉంటే.. ఒక్క స్థానం కూడా గెలవలేరన్నారు. ఇవి పార్టీ గుర్తు మీద కాకుండా స్థానికంగా ఎంపిక చేసిన అభ్యర్థులను బట్టి కూడా ఉంటాయన్నారు. మా పార్టీలో ఆశావహులు ఎక్కువ కావడం వలన కొన్ని చోట్ల మీకు అనుకూలంగా మారిందన్నారు. అంతే తప్ప ఇందులో ప్రకాష్ రెడ్డి గొప్పతనం, ఆ పార్టీని చూసి కాదన్నది తెలుసుకోవాలన్నారు. ఇకనైనా అబద్ధపు ప్రచారాలు మానుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత హితవు పలికారు.

అసభ్యకర పోస్టర్లతో కించపరిచారు : చిప్పగిరి టీడీపీ అభ్యర్థి రజని



ఆలూరు (చైతన్యరథం): అసభ్యకరంగా పోస్టర్లు పెట్టి తనను కించపరిచారని, ఇందుకు కారణమైన ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి సోదరుడు శ్రీరాములు కుమారుడు మధుసూదన్పై చర్యలు తీసుకోవాలని చిప్పగిరి టీడీపీ నేత యల్లంకి రజని ఆరోపించారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నాచేశారు. ఆమెకు మద్దతుగా గుంతకల్ ఎమ్మెల్యే జయరాం, చిప్పగిరి జడ్పీటీసీ సభ్యురాలు రాయచూరు సాహిదా బేగం, టీడీపీ నాయకులు ఆలూరు-గుంతకల్ రహదారిపై బైఠాయించారు. దీంతో గంటకు పైగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అనంతరం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం.. కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో ఫోన్లో మాట్లాడి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలపై అసభ్యకర పోస్టర్లు పెట్టడం శోచనీయమన్నారు. ఆలూరు సీఐ రవిశంకర్ రెడ్డి అక్కడికి చేరుకొని ధర్నా చేస్తున్న టీడీపీ శ్రేణులతో మాట్లాడి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని సర్దిచెప్పడంతో వారు ధర్నా విరమించారు. చిప్పగిరి గ్రామ సర్పంచ్ అభ్యర్థులుగా యల్లంకి రజని (టీడీపీ), పి.లిఖితరెడ్డి (వైసీపీ) పోటీపడ్డారు. పి.లిఖితరెడ్డి, రజనిపై 420 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఈ గెలుపుతో సంతృప్తి చెందని వైసీపీ నాయకులు తన ఇంటిపై దాడి చేశారని, అసభ్యకరమైన పోస్టర్లు పెట్టి కించపరిచారని రజని చిప్పగిరి పోలీస్ స్టేషన్లో ఆమె ఫిర్యాదు చేశారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి : ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య

వేటపాలెం (చైతన్యరథం): వేటపాలెం మండలంలోని కొత్తపేట పంచాయతీలో కూటమి పార్టీ సర్పంచ్ అభ్యర్థి తన్నీరు ప్రసాద్, విజయమే లక్ష్యంగా కొత్తపేట నందు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ అహ్మద్ పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ వారి నాయకత్వాన్ని బలపరచాలని, కొత్తపేట గ్రామ అభివృద్ధికి కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరాను. ఈ ప్రచారంలో గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతో సమస్యలను పరిష్కరిస్తాం : సుబ్రహ్మణ్యం

నంద్యాల (చైతన్యరథం): ప్రజల సహకారంతో నంద్యాల పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని పురపాలక చైర్పర్సన్ డాక్టర్ బాబాన్, వైస్ చైర్మన్ ఉప్పరి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. పట్టణంలోని 21వ వార్డు పరిధిలోని ఎస్బీఐ కాలనీ, సింగ్ కాలనీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణాన్ని శుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అన్నారు. నంద్యాల పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత, స్వచ్ఛమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో 21వ వార్డు కౌన్సిలర్ ప్రదీప్ రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ మురళీధర్, స్వర్ణ స్వర్ణ వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రాయలసీమ ముద్దుబిడ్డ చంద్రబాబు

● సీమ కరువు చరిత్రను తిరగరాస్తున్న దార్శనికుడు

●వైఎస్ జగన్‌పై ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ధ్వజం



రాయదుర్గం (చైతన్యరథం): రాయలసీమ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అనుసరించిన విధానాలపై ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాయదుర్గంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాయలసీమ ప్రయోజనాల పట్ల చంద్రబాబు నాయుడుకు ఉన్న చిత్తశుద్ధి, గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం అనుసరించిన విధానాలకు మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉందని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు వంటి దూరదృష్టి కలిగిన నాయకుడు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి ఉంటే, దాని కొనసాగింపునకు అవసరమైన అన్ని అనుమతులను ముందుగానే తీసుకునేవారన్నారు. ప్రజా ధనాన్ని వేల కోట్ల రూపాయల మేర దుర్వినియోగం చేయడానికి, తన అనుయాయులకు ప్రయోజనం చేకూర్చడానికి రూపొందించిన స్వార్థపూరిత పథకమే రాయలసీమ ఎత్తిపోతల పథకమని తాము భావిస్తున్నట్లు విమర్శించారు. శ్రీశైలంలో నీటిమట్టం 854 అడుగుల వద్ద ఉన్నప్పుడు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమ ఎత్తిపోతల పథకం కింద రోజుకు మూడు టీఎంసీల నీటిని తరలించవచ్చని జగన్ చెబుతున్నారని, అదే మంచి నిర్ణయమైనప్పుడు ముందుగానే అవసరమైన అనుమతులు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ పథకం ద్వారా కర్నూలు, అనంతపురం, హిందూపురం తదితర ప్రాంతాలకు వాస్తవంగా ఎంత ప్రయోజనం చేకూరిందో చెప్పాలని డిమాండ్ చేశారు. శ్రీశైలంలో 854 అడుగుల కంటే తక్కువ నీటిమట్టం ఉంటే నీటిని తీసుకోలేకపోతున్నామని చెబుతున్న జగన్, 790 అడుగుల నీటిమట్టం నుంచే ముచ్చుమర్రి ద్వారా నీటిని తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ ఆ వ్యవస్థను ఎందుకు నిర్వీర్యం చేశారని నిలదీశారు. కనీసం విద్యుత్ బిల్లులు కూడా చెల్లించకుండా హంద్రీ-నీవా ప్రాజెక్టును ఇబ్బందుల్లోకి నెట్టారని ఆరోపించారు. తన స్వగ్రామం అనంతపురం జిల్లాలో ఉందని, తాను ఈ జిల్లా మనవడినని చెప్పుకునే జగన్.. జిల్లాకు ప్రయోజనం చేకూర్చే హంద్రీ-నీవా ప్రాజెక్టు కాలువ సామర్థ్యాన్ని ఎందుకు పెంచలేకపోయారని ప్రశ్నించారు. 2017లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సుమారు రూ.1,000 కోట్లతో కాలువ సామర్థ్యాన్ని 3,800 క్యూసెక్కులకు పెంచే పనులను ప్రారంభించి, దాదాపు 40 శాతం పనులు పూర్తి చేయించారని గుర్తుచేశారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మిగిలిన పనులను ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. రాయలసీమ జిల్లాలు అభివృద్ధి చెందడం జగన్‌కు ఇష్టం లేదా? కర్నూలు జిల్లాలో అత్యంత వెనుకబడిన పశ్చిమ ప్రాంతాలకు నీరు అందడం ఇష్టం లేదా? పత్తికొండ, డోన్, ఆలూరు వంటి ప్రాంతాలకు ఎంతో ఉపయోగపడే హంద్రీ-నీవా కాలువ విస్తరణ పనులను ఎందుకు కొనసాగించలేదని ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు జగన్‌తో పాటు ఆయనకు సంబంధించిన సాక్షి పత్రిక కూడా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వాస్తవానికి 2014-19 మధ్య చంద్రబాబు నాయుడు పాలనలోనే ముచ్చుమర్రి ద్వారా 798 అడుగుల నీటిమట్టం నుంచే నీటిని తరలించే వెసులుబాటు కల్పించారని తెలిపారు. అలాంటి సౌకర్యాన్ని జగన్ ప్రభుత్వం ఎందుకు వినియోగించుకోలేదని, ఏ ప్రయోజనాల కోసం దానిని పక్కన పెట్టిందని ప్రశ్నించారు. హంద్రీ-నీవా ప్రాజెక్టుకు సంబంధించి వందల కోట్ల రూపాయల విద్యుత్ బిల్లులను పెండింగ్‌లో పెట్టిన విషయాన్ని ప్రభుత్వ రికార్డులు స్పష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు.

అయ్యప్ప స్వాముల కోసం 24 గంటల హెల్ప్‌లైన్

అమరావతి (చైతన్యరథం): అయ్యప్ప స్వాముల కోసం కేరళ ప్రభుత్వం మంచి సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. 2026-27 మండల-మకరవిళక్కు యాత్రా సీజన్ సందర్భంగా శబరిమలకు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వెళుంటారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అయ్యప్ప మాల ధరించి.. స్వాములు శబరిమలకు చేరుకుంటారు. అయితే ఈ యాత్రలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా.. కేరళ పోలీసులు 24 గంటల హెల్ప్ లైన్‌ను ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) హరీష్ కుమార్ వెల్లడించారు.

ఈ నెంబర్‌కు కాల్ చేస్తే చాలు...

శబరిమల యాత్రలో ఏదైనా సమస్య తలెత్తినా, ఏ సాయం కావాలన్నా.. కేరళ రాష్ట్రానికి చెందిన భక్తులు 14432 నెంబర్‌కు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు 04735-14432 నెంబర్‌కు కాల్ చేయవచ్చు. ఈ నెంబర్లకు డయల్ చేసి అత్యవసర సహాయం పొందవచ్చని పతనంతిట్ట జిల్లా పోలీస్ చీఫ్ ఆర్. ఆనంద్ తెలియజేశారు.

తప్పిపోయినా.. ప్రమాదాలు జరిగినా..

యాత్రలో తప్పిపోయిన వ్యక్తులను గుర్తించడం, రోడ్డు ప్రమాదాలు, మార్గం మధ్యలో వాహనాలు ఆగిపోయినా ఈ హెల్ప్ లైన్ నెంబర్‌కు ఫోన్ చేస్తే వెంటనే సాయం అందుతుంది. అంతే మరమ్మతులకు గురైన వాహనాలను నీలక్కల్‌కు తరలించడానికి, రికవరీ వాహనాలను ఏర్పాటు చేయడంలో అందుతుంది. దీంతోపాటు అత్యవసర వైద్య సాయం, అంబులెన్స్ సేవలు, ఆస్పత్రి సపోర్ట్‌ను కూడా అందించడం జరుగుతుంది. నీలిమల ట్రెక్కింగ్ మార్గంలో యాత్రికులకు గుండె సంబంధిత సమస్యలు తలెత్తినా తక్షణమే వైద్య సాయం అందించే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు.

రాస్ అల్‌ఖైమా రోడ్డు ప్రమాదం

మృతుల్లో ఆంధ్రా అమర ప్రేమికుడు



యూఏఈ: మొదటి చూపులో ప్రేమ కంటే చివరి చూపులో తోడు ఉండే ప్రేమ చాలా గొప్పది అని నిరూపించారు ఒంగోలు జిల్లా కొప్పోలు గ్రామానికి చెందిన బ్రహ్మణకాక వినోద్‌కుమార్. మంగళవారం రాస్ అల్‌ఖైమాలో జరిగిన ఘోర రోడ్డుప్రమాదంలో మరణించిన 13 మందిలో వినోద్‌కుమార్ ఒకరు. 31 ఏళ్ల వయసులో ఇటీవలే దాంపత్య జీవితంలో అడుగుపెట్టిన ఆయన అంతలోనే అనంత లోకాలకు వెళ్లిపోయారు. తన బంగారు భవిష్యత్తు కోసం ఎమిరేట్స్‌ను ఎంచుకొన్న ఆయన అక్కడే ప్రాణాలు కోల్పోయారు. విజిటింగ్ వీసాపై వెళ్లి ఉద్యోగం చూసుకుని ఎంప్లాయ్‌మెంట్ వీసాగా మార్చుకునేందుకు బస్సులో ఒమాన్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. ఎదురుగా ఆగి ఉన్న ఒక ట్రక్కును ఆ బస్సు ఢీకొనడంతో ఆయన ప్రాణాలు కోల్పోయారు. వినోద్‌కుమార్ భార్య రిజి రాస్ అల్ ఖైమాలో పని చేస్తున్నారు. కేరళకు చెందిన ఆమె ఒంగోలులో నర్సింగ్ విద్యకు వచ్చినప్పుడు వారిద్దరికీ పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత ప్రేమబంధంలో ఒక్కటై పెళ్లి చేసుకున్నారు. తనకు ఉద్యోగం లభించిన తర్వాత రాస్ అల్‌ఖైమాకు వెళ్లిన ఆమె తన భర్తను కూడా విజిటింగ్ వీసాపై పిలిపించుకున్నారు. వినోద్‌కు ఒక ఉద్యోగం కూడా దొరికింది. ఇద్దరి ఉద్యోగాలతో వారి కలలు సాకారమవు తున్న వేళ విధి కాటేసింది. వారి అన్యోన్యమై దాంపత్యం అరంభంలోనే అంతమైంది. శోక సముద్రంలో మునిగిపోయిన వినోద్ భార్యను పరామర్శించేందుకు వెళ్లిన వారి నోట మాట పెగల్లేదు. ప్రమాదంపై వివరాలను తెలుసు కోవడానికి రాస్ అల్ ఖైమా పోలీసు ప్రధాన కార్యాలయాన్ని బుధవారం దుబాయిలోని భారతీయ కాన్సుల్ జనరల్ డాక్టర్ ఇ.విష్ణువర్ధన్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా బాధితుల కుటుంబీకులతోనూ మాట్లాడా రు. మృతుల సంఖ్య ఎంతో ఇప్పుడే కచ్చితంగా చెప్పలేమని కూడా కాన్సుల్ జనరల్ అన్నారు. ప్రమాదం జరిగిన వెనువెంటనే రాస్ అల్ ఖైమాలోని అన్ని అత్యవసర విభాగాలతో పాటు దుబాయి వైమానిక అంబులెన్సులు కూడా ఘటనాస్థలానికి చేరుకుని మృతులను, క్షతగాత్రులను వివిధ ఆసుపత్రులకు తరలించారు. రోడ్డు ప్రమాదంపై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

ఇండో అమెరికన్లతో భారత్ సీజీ సమావేశం





అమెరికా: మిచిగాన్ పర్యటనలో భాగంగా భారత కాన్సుల్ జనరల్ (సీజీ) ఆనంద్ ప్రకాశ్ ప్రవాస భారతీయ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు మరియు ప్రజాప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశ మయ్యారు. ఈ కార్యక్రమానికి అమెరికా కాంగ్రెస్ సభ్యుడు థానేదార్ ముఖ్యఅతిథి గా హాజరై శోభను చేకూర్చారు. ఉత్సాహభరితంగా సాగిన ఈ ముఖాముఖి కార్యక్రమంలో వ్యాపారం, విద్య, నవకల్ప నల (ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్) రంగాల్లో ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే అవకాశాలను కాన్సుల్ జనరల్ వివరించా రు. ప్రవాస భారతీయులు ఎదుర్కొంటు న్న పలు సమస్యలను, సందేహాలను ఆయ న సావధానంగా విని వాటి పరిష్కారానికి తగిన భరోసా ఇచ్చారు. ప్రవాస భారతీయ సమాజ సంక్షేమానికి, వారితో నిరంతర అనుసంధానానికి భారత కాన్సులేట్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆనంద్ ప్రకాశ్ పునరు ద్ఘాటించారు.

టీటీడీకి 14 టన్నుల కూరగాయల వితరణ

పర్చూరు: తిరుమల వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో అన్న ప్రసాదాల తయారీ కి ఉపయోగించేందుకు 14 టన్నుల కూరగాయలను ఎన్నారై భక్తుడు కుల్లా అశోక్ విరాళంగా అందించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పర్చూరు నియోజకవర్గం లోని కొల్లావారిపాళెం ఆయన స్వస్థలం. కొల్లా అశోక్ తన పుట్టిన రోజు సందర్భం గా ఈ భారీ విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు ఆయన అందజేసిన కూరగాయల ను బుధవారం టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి చేతులమీదుగా అన్న ప్రసాదం అధికారులకు అందజేశా రు. తన పుట్టినరోజు సందర్భంగా గత బుధవారం తిరుమలకు వచ్చిన అశోక్.. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్ర సాద భవనంలో వంటకాల తయారీకి ఉప యోగించేలా మొత్తం 14 టన్నుల కూరగా యలను సమర్పించారు. ఇందులో తొమ్మిది రకాల కూరగాయలు ఉన్నాయి. తిరుమల కు వచ్చే భక్తులకు నిత్యం అన్నప్రసాదాలు అందించే కార్యక్రమానికి తన వంతు సహ కారం అందించాలనే ఉద్దేశంతో ఈ విరాళం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమం తో జరుపుకోవాలన్న ఆలోచనతో ఈ నిర్ణ యం తీసుకున్నట్లు పేర్కొన్నారు. శ్రీవారి సన్నిధిలో భక్తులకు అన్న ప్రసాదం అందిం చడం ఎంతో పవిత్రమైన సేవగా భావిస్తు న్నానని అశోక్ తెలిపారు.



దుబాయిలో పద్మశాలీ సమాజం ప్రస్థానం

నూలుపోగుతో మొదలై పద్మంగా వికాసం

దుబాయి: గల్ఫ్ దేశాలకు వలసలు అరంభమైన కాలంలో నౌకలలో ప్రయాణించి వెళ్లిన తెలుగు వారిలో పద్మశాలీలు చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నారు. ఒక చిన్న నూలు పోగుతో మొదలైన వారి ప్రవాసం ప్రస్తుతం ఒక సువిశాల ఎడారి వరకూ చేరుకుని సగర్వంగా పద్మశాలీగా చెప్పుకుంటూ పండుగలు చేసుకునే స్థాయికి ఎదిగింది. బొంబాయి, భీవండి, షోలా పూర్‌లకు వలస వెళ్లి మరాఠీ సంస్కృతిలో మమేకమైనా తమ మూల తెలుగు తనాన్ని మరువలేదు. ఇప్పుడు ఎల్లలు దాటినా తమ సంస్కృతి, ఆచారాల పట్ల పద్మశాలీలకు ఉన్న అభిరుచి కార్తీక మాసం సందర్భంగా దుబాయి లో జరిగిన వన భోజనాల కార్యక్రమం ప్రతిబింబించింది. దుబాయి పద్మశాలీ సంఘం



ఆధ్వర్యంలో జరిగిన వనభోజనాలతో నిత్య యాంత్రిక జీవనంతో నిమగ్నమై ఉండే దుబాయి నగర పద్మశాలీలలో ఆధ్యాత్మికత, ఆత్మీయత వెల్లివిరిసింది. ఆడపడుచులు ఈ కార్యక్రమ నిర్వహణలో కీలక పాత్రవహిం చారు. యోగిత గాలిపెల్లి, దీపిక అలిగేటి, జయ బద్దూరి, లక్ష్మి గుంటుక, అనూజ అనుమల్లలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్దేశించా రు. ముంబైలో పుట్టి పెరిగినా తెలుగు వాసన అందునా తెలంగాణ మాగాణిని మరువని ఆడబిడ్డలు తమ సత్తాను ప్రదర్శించారు. బాల బాలికల ఆటల పోటీలను స్థానిక మెట్రోపోలి టన్ ఇండియన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదివే నందిని ఏలిగేటి అనే బాలిక రసవత్తంగా నిర్వ హించింది. భార్యాభర్తలు కలిసి కపుల్ గేమ్స్‌గా నిర్వహించిన వివిధ పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమ నిర్వహణను పద్మశాలీ సంఘం నాయకులు సదానందం, లక్ష్మీ నారా యణ, జగదీష్, సుధాకర్, ఆశోక్, శ్రీనివాస్‌లు సమన్వయం చేశారు.



అప్పర్‌హౌస్ ఎంపీ అభ్యర్థిగా

ఆస్ట్రేలియా ఎన్నికల బరిలో సామ సింధు



కాచిగూడ: ఆస్ట్రేలియా ఎన్నికల్లో హైదరాబాద్‌లోని కాచిగూడకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని సామ సింధు(40) పోటీచేస్తున్నారు. మెల్‌బోర్న్ లోని వెస్టర్న్ విక్టోరియా ప్రాంతం నుంచి ది రిపబ్లికన్ పార్టీ అప్పర్ హౌస్ ఎంపీ అభ్యర్థిగా ఆమె బరిలో ఉన్నారు. మహబూ బాబాద్ జిల్లా కంబాలపల్లికి చెందిన వ్యాపారవేత్త సామ వీరారెడ్డి... తొలుత తన కుటుంబంతో కలి సి నగరంలోని దోమలగూడకు, తర్వాత కాచిగూడలో స్థిరపడ్డారు. ఆయన కుమార్తె సింధు మియాపూర్ శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్, టీఆర్ఆర్ ఇంజ నీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేశారు. ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా పని చేశారు. సునీల్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని పెళ్లి చేసుకుని దశాబ్దాన్నర క్రితం ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ వెళ్లి స్థిరపడ్డారు. కాచిగూడలో ఆమె తండ్రి వీరారెడ్డి ఈ వివరాలను వెల్లడించారు.

రాఫెల్ విజేతలకు ట్యాకో బహుమతులు

అమెరికా: సెంట్రల్ ఓహియోలోని ప్రముఖ తెలుగు సంస్థ ట్యాకో(టీఏసీవో) నిర్వహించిన దీపావళి వేడుకల్లో భాగంగా 2027 సభ్యత్వ రాఫెల్ విజేతల పేర్లను ప్రకటించింది. ఎంపిక చేసిన 11 మందిని విజేతలకు దాతలు, సంస్థలు ఆకర్షణీయ మైన బహుమతులను అందించా రు. రామకృష్ణ కామతం కోఆర్డ్ డ్రైస్ సెట్ (సరిమా బొటిక్), శ్వేత సింగ్ వంట నూనె (వీ ప్యూరిటీ), శ్రీకాంత్ మడుపోసు డ్రైస్ సెట్ (త్రిశోభ), వంశీ తల్లూరి గిఫ్ట్ హాంపర్ (యంగ్ ఇంజ నీర్స్), సతీష్ కుమార్ గారె ఇయర్‌రింగ్స్ (దిగిరా కలెక్షన్స్) గెలుచుకున్నారు. అలాగే హరి పాతూరి పట్టు చీర (ఎస్ఆర్‌బీ సిల్క్స్), మోహన మురళి గాలి డిజైనర్ చీర (ఆర్తిషా డిజైనర్స్), ప్రశాంత్ కనితి అందమైన వేంకటేశ్వర విగ్రహం (యిప్పీ మేకర్), నౌషద్ పాషా అందమైన కృష్ణుడి విగ్రహం (యిప్పీ మేకర్), సుధీర్ కుమార్ కొనంకి అందమైన డ్రైస్ (శాంతిస్ ఫ్యాషన్), నేహా పాండిచ్చేరి ఫ్యాషన్ ఇయర్‌రింగ్స్ (గెహ్నా జ్యువెలరీ) బహుమతులుగా అందుకున్నారు.



సుప్రీంకోర్టు కొలీజియంపై అసంతృప్తి

రాష్ట్రపతికి మాజీ సీజేఐ బి.ఆర్.గవాయ్ లేఖ


ఢిల్లీ: సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులపై మాజీ సీజేఐ జస్టిస్ బి.ఆర్. గవాయ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొలీజియం సిఫార్సుల్లో జోక్యం చేసుకోవాలని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆయన విజ్ఞప్తి చేశారు. న్యాయమూర్తుల నియామకాలు, బదిలీల సిఫార్సుల్లో జోక్యం చేసుకోవాలని ఆమెను కోరారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు మాజీ సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ మూడు పేజీల లేఖ రాశారు. ప్రతిభ, వైవిధ్యాన్ని పక్కనపెట్టి ఒకే వర్గానికి పెద్దపీట వేస్తున్నారని ఆయన ఆరోపించారు. దేశ జనాభాలో 5 శాతం కంటే తక్కువ జనాభా ఉన్న వర్గానికి సుప్రీంకోర్టులో 40 శాతానికిపైగా ప్రాతినిధ్యం వహిస్తుం దని సోదాహరణగా ఆ లేఖలో మాజీ సీజేఐ జస్టిస్ బి.ఆర్. గవాయ్ వివరించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ, మహిళలతో పాటు ఇతర అగ్రవర్ణాలకూ అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. శిక్షాత్మక బదిలీలకు గురైన జడ్జీలకు ప్రముఖ హైకోర్టుల చీఫ్ జస్టిస్‌లుగా పదోన్నతులు కల్పిస్తున్నారని విమర్శించారు. కొలీజియం సిఫార్సులకు జవాబుదారీతనం ఉండాలని మాజీ సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ అభిప్రాయపడ్డారు. తన రాజ్యాంగ విధులు నిర్వర్తించాలని ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆయన ఈ లేఖలో విన్నవించారు. ఈ లేఖ ప్రతులను ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌లకు సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ పంపారు.

అనుమానిత జైషే ఉగ్రవాది అరెస్ట్

గుజరాత్: వడోదరలో ఒక వ్యక్తిని గుజరాత్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) అరెస్టు చేసింది. జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థతో అతనికి సంబంధాలు ఉన్నట్లు ఏటీఎస్ అధికారులు అనుమానిస్తున్నారు. వడోదరలోని ఓ బస్టాండ్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి ఒక ఏకే 47 రైఫిల్‌తో పాటు 23 రౌండ్ల మందుగుండు సామగ్రిని కూడా స్వాధీనం చేసుకున్నారు. అతనికి ఆ రైఫిల్ ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరికి ఇవ్వడానికి అతను ఆ రైఫిల్‌ను రవాణా చేస్తున్నాడు వంటి వివరాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. దేశంలో విదేశీ ఉగ్రవాదులు ఉన్నారన్న సమాచారం అందిన నేపథ్యంలో ఆ వ్యక్తిని అరెస్టు చేశారు. ఇంటెలిజెన్స్ వర్గాల ప్రకారం జమ్మూకశ్మీర్‌లో కనీసం 65 మంది విదేశీ టెర్రరిస్టులు ఉన్నారు. వారిలో 55 మందికి జైషే మహమ్మద్, లష్కరే తాయి బాతో సంబంధాలు ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. కాగా.. కశ్మీర్ లోయలో స్థానిక ఉగ్రవాదుల సంఖ్య సున్నాకు చేరింది. దీంతో విదేశీ ఉగ్రవాదులను ఎరివేసేందుకు భద్రతా బలగాలు ఆపరేషన్లు చేపట్టాయి. ఉగ్రవాదులకు సహకరిస్తున్న స్థానికులపైనా అధికారులు కన్నేసి ఉంచారు.

డీలిమిటేషన్ బిల్లు పాస్‌కు మ్యాజిక్ ఫిగర్ 360 మద్దతు కూడగట్టే పనిలో కేంద్రం





ఢిల్లీ: లోక్‌సభలో డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకునేం దుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. బిల్లు పాస్ అయ్యేందుకు అవసరమైన 360 ఓట్ల మేజిక్ ఫిగర్‌ను లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుత రాజకీయ సమీకరణాలు అనుకూలిస్తే ఈ లక్ష్యాన్ని చేరుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలో ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించిన డీఎంకే, ఎన్సీపీ (శరద్‌చంద్ర పవార్ వర్గం) పార్టీలు ఈసారి మద్దతు ఇచ్చే అవకాశం ఉంది. రాష్ట్రాలవారీగా లోక్‌సభ స్థానాలను 50 శాతం పెంచుతామనే హామీని బిల్లు ముసాయిదాలోనే చేరిస్తే మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఆ రెండు పార్టీలు స్పష్టం చేశాయి. కాంగ్రెస్‌తో తమిళనాడులో రాజకీయ విభేదాల నేపథ్యంలో ఇండియా కూటమి నుంచి వైదొలిగిన డీఎంకే కూడా తన వైఖరిని మార్చుకుంది. బిల్లుపై వ్యతిరేకతను పక్కనపెట్టింది. డీలిమిటేషన్ అనంతరం పార్లమెంటులో తమిళనాడుకు ప్రస్తుతం ఉన్న 7.2 శాతం ప్రాతినిధ్యం కొనసాగాలని డీఎంకే కోరుతోంది. రాష్ట్రాలవారీగా సీట్లను 50 శాతం పెంచుతామనే నిబంధనను బిల్లులో చేరిస్తే తమకు అభ్యంతరం లేదని డీఎంకే తెలిపింది. ఆ పార్టీకి లోక్‌సభలో 22 మంది ఎంపీలు ఉన్నారు.

ఏప్రిల్ 17న రాజ్యాంగ సవరణ బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో కేంద్ర ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. మొత్తం 528 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనగా, 298 మంది బిల్లుకు అనుకూలం గా, 230 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. రాజ్యాంగ సవరణ ఆమోదానికి అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీకి 352 ఓట్లు కావాల్సి ఉండగా, 54 ఓట్లు తక్కువ పడ్డాయి. ప్రస్తుతం లోక్‌సభలో 540 మంది సభ్యులు పూర్తిస్థాయిలో హాజరైతే మూడింట రెండొంతుల మెజారిటీ సాధించేందుకు సుమారు 360 ఓట్లు అవసరమవుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే కొందరు ఎంపీలు గైర్హాజరైతే అవసరమైన ఓట్ల సంఖ్య తగ్గే అవకాశం ఉంది. ఎన్డీయేకు ప్రస్తుతం 319 మంది సభ్యుల మద్దతు ఉందని కేంద్రం అంచనా వేస్తోంది. ఇందులో బీజేపీకి చెందిన ఎంపీలు 241 మంది ఉన్నారు. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 28 మంది ఎంపీల్లో 20 మంది పార్టీ నుంచి బయటకు వచ్చి ప్రత్యేకంగా ఏర్పడిన ఎన్‌సీపీఐఎల్‌లో చేరి ఎన్డీయేకు మద్దతు ఇస్తున్నారు. అలాగే పంజాబ్‌కు చెందిన శిరోమణి అకాలీదళ్ నుంచి మరో ఎంపీ మద్దతు కూడా కేంద్ర ప్రభుత్వానికి లభించింది. ఇక శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీకి చెందిన ఎనిమిది మంది ఎంపీల మద్దతు లభిస్తే ఎన్డీయే బలం 328కి చేరుతుంది. డీఎంకేకు చెందిన 22 మంది ఎంపీల మద్దతు కూడా లభిస్తే మొత్తం బలం 350కి చేరుతుంది. అయినప్పటికీ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించేందుకు మరో 10 ఓట్లు అవసరమవుతాయి. దీంతో మిగిలిన ఓట్లను సమీకరించడంపై కేంద్రం దృష్టి సారించింది.

తిరుప్పరంకుండ్రం దీపం వివాదం

తమిళనాడు ప్రభుత్వానికి సుప్రీంకోర్టు షాక్



తమిళనాడు: తమిళనాడులోని తిరుప్పరంకుండ్రం కార్తీక దీపం వివాదం కీలక మలుపు తిరిగింది. సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైన తమిళనాడు ప్రభుత్వ అధికారు లపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), డీజీపీ, మదురై జిల్లా కలెక్టర్‌తో పాటు ఆలయ ధర్మకర్తలకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది. అంతేకాదు శనివారం కొండపై దీపత్తూన వద్ద కార్తీక దీపం వెలగించాల్సిందేనని స్పష్టం చేసింది. తిరుప్పరంకుండ్రం కొండపై ఉన్న ఆలయం, దర్గా భద్రతను కేంద్ర రిజర్వ్ పోలీసు దళం (సీఆర్‌పీఎఫ్)కు అప్పగిస్తూ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆలయ ధర్మకర్తల మండలిని సస్పెండ్ చేసి, ఆల య నిర్వహణ పర్యవేక్షణకు రిటైర్డ్ న్యాయమూర్తులను రిసీవర్లుగా నియమించింది. కోర్టు ఆదేశాలను అమలు చేయకుండా రాజకీయ పెద్దల సూచనల మేరకు అధికారులు వ్యవహరించారనే ఆరోపణ లపైనా ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. దీపత్తూన్ వద్ద కార్తీక దీపం వెలిగించేందుకు మరోసారి అవకాశం కల్పిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. నవంబర్ 28న దీపత్తూన్ వద్ద కార్తీక దీపాన్ని వెలిగించాలని స్పష్టం చేసింది. కొత్తగా నియమించిన రిసీవర్లు ఈ కార్యక్రమం జరిగేలా చూడాలని ఆదేశించింది ఆలయ అధికారులు, సంబంధిత యంత్రాంగం కోర్టు ఆదేశాలను అమలు చేయాలని స్పష్టం చేసింది. కోర్టు ఉత్తర్వుల అమలుపై ఎలాంటి బేరసారాలకు తావులేదని ధర్మాసనం పేర్కొంది. ఆలయ ధర్మకర్తలు అనుమతి ఇవ్వకపోవడంతోనే దీపం వెలిగించలేకపో యామని మదురై జిల్లా కలెక్టర్ కోర్టుకు వివరించారు. ఈ విషయంలో క్షమాపణలు కూడా చెప్పారు. అయితే కలెక్టర్ వివరణ, క్షమాపణలతో సుప్రీంకోర్టు సంతృప్తి చెందలేదు. కోర్టు ఆదేశాలను అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేసింది. ధర్మకర్తలు అనుమతించలేదనే కారణంతో సుప్రీంకోర్టు ఆదేశాలను పక్కనపెట్టడం కుదరదని పేర్కొంది.

డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ: డీలిమిటేషన్‌తో ముడిపడి ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సేవా తీర్థ్‌లో జరిగిన ప్రత్యేక భేటీలో కేబినెట్ ఈ కీలక నిర్ణయాన్ని తీసుకుంది. మరోవైపు డీలిమిటేషన్ తర్వాత ఏ రాష్ట్రమూ తన లోక్‌సభ సీట్ల నిష్పత్తి కోల్పోకుండా కేంద్రం బిల్లును సవరించిందని సమాచారం. వచ్చే వారం జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టేందుకు కసరత్తులు చేస్తోంది. కాగా డీలిమిటేషన్‌తో కూడిన మహిళా రిజర్వేషన్ బిల్లును ఏప్రిల్‌లో మోదీ సర్కార్ ప్రవేశపెట్టగా.. అది వీగిపోయిన సంగతి తెలిసిందే. దీన్ని ఎలాగైనా ఆమోదింపజేసుకోవాలని కేంద్రం పట్టు మీద ఉంది. ఈ క్రమంలో సంఖ్యాబలం పెంచుకునే చర్యలు ఇప్పటికే తీసుకుంది.





రష్యా చరిత్రలోనే భారీ రక్షణ బడ్జెట్

మూడేళ్లకు రూ.50 లక్షల కోట్లకు పైగా..

రష్యా: సోవియట్ యూనియన్ పతనం తర్వాత ఎన్నడూ లేనంత భారీ రక్షణ బడ్జెట్‌కు రష్యా పార్లమెంట్ తాజాగా ఆమో దం తెలిపింది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేం దుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శాంతి ప్రయత్నాలు చేస్తున్న వేళ.. పుతిన్ ప్రభుత్వం రక్షణ రంగానికి ఇంత భారీ బడ్జెట్ కేటాయించడం ఆసక్తికరంగా మారింది. 2027 నుంచి 2029 వరకు మూడేళ్ల కాలానికి ఏకంగా 609 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.55 లక్షల కోట్లు) డిఫెన్స్ బడ్జెట్‌ను కేటాయించింది. రష్యా పార్లమెంట్ దిగువ సభ అయిన స్టేట్ డ్యూమా నవంబరు 24న 2027–29 బడ్జెట్‌కు మూడో, తుది ఆమోదం తెలిపింది. ఈ బడ్జెట్ ప్రకారం 2027లో రక్షణ రంగానికి 17.15 లక్షల కోట్ల రూబుళ్లు కేటాయించనున్నారు. 2026లో కేటాయించిన 12.93 లక్షల కోట్ల రూబుళ్లతో పోలిస్తే ఇది దాదాపు 33 శాతం అధికం. ఇక, 2028లో 16.61 లక్షల కోట్ల రూబుళ్లు, 2029లో 16.30 లక్షల కోట్ల రూబుళ్లు రక్షణ రంగానికి ఖర్చు చేయాలని రష్యా ప్రణాళిక రూపొందించింది. ఈ మూడేళ్లలో మొత్తం సైనిక వ్యయం 50 లక్షల కోట్ల రూబుళ్లను దాటనుంది. 2027లో రష్యా మొత్తం ప్రభుత్వ వ్యయం 48.74 లక్షల కోట్ల రూబుళ్లుగా అంచనా వేశారు. ఇందులో రక్షణ రంగానికే 35.2 శాతం నిధులు కేటాయించనున్నారు. అంటే దేశం ఖర్చు చేసే ప్రతి మూడు రూబుళ్లలో ఒకటి కంటే ఎక్కువ మొత్తం సైనిక అవసరా లకే వెళ్తుంది. రక్షణ రంగానికి భారీగా నిధులు కేటాయి స్తున్న రష్యా.. మరోవైపు కొన్ని పౌర సంక్షేమ రంగాల ఖర్చులను తగ్గిస్తోంది. 2026తో పోలిస్తే జాతీయ ఆర్థిక రంగానికి కేటాయిం పులు 3 శాతం, గృహ నిర్మాణం, మౌలిక సదుపాయాలకు సం బంధించిన ఖర్చులు 8 శాతం తగ్గనున్నాయి. ఆరోగ్య రంగానికి కేటాయింపులు 3 శాతం, సామాజిక సంక్షేమానికి సంబంధించిన నిధులు 6 శాతం తగ్గనున్నాయి.

మాకీస్ థ్యాంక్స్ గివింగ్ పరేడ్ వాయిదా

అమెరికాలో 400 విమానాల రద్దు

అమెరికా: అమెరికాలో గురువారం తఫాన్ బీభత్సం సృష్టిం చింది. థ్యాంక్స్ గివింగ్ వేడుకల సమయంలో భారీ వర్షాలు కురిశాయి. దీనికితోడు ఈదురుగాలులు కూడా వీచాయి. దీంతో లక్షల మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. న్యూయార్క్‌లో ఏటా నిర్వహించే ప్రసిద్ధ మాకీస్ థ్యాంక్స్ గివింగ్ పరేడ్‌ను తఫాన్ ప్రభావంతో నిర్వాహకులు వాయిదా వేశారు. వందేళ్ల చరిత్రలో తొలిసారిగా ఈ వేడుకను వాయిదా వేశారు. 'నార్ ఈస్టర్'గా పిలిచే ఈ తుఫాన్ సెంట్రల్ అమెరికా, తూర్పు అమెరికాను అతలాకుతలం చేసింది. తుఫాన్ ధాటికి పెన్సిల్వేనియా, మేరీ ల్యాండ్, వర్జీనియా రాష్ట్రాల్లో విద్యుత్ సరఫరా తీవ్రంగా దెబ్బతింది. 9 లక్షలకు పైగా ఇళ్లు, వ్యాపార సంస్థలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అంతేకాకుండా విమాన రాకపోక లపైనా తుఫాన్ ప్రభావం పడింది. దాదాపు 400 విమానాలు రద్దు కాగా.. మరో రెండు వేలకు పైగా విమానాలు ఆలస్యంగా నడిచాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ న్నారు. న్యూయార్క్‌లోని మాన్‌హట్టన్ వీధుల్లో రంగురంగుల భారీ బెలూన్లతో నిర్వహించే మాకీస్ థ్యాంక్స్‌గివింగ్ పరేడ్‌కు ఏటా లక్షల మంది హాజరవుతుంటారు. అయితే తుఫాన్ నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని శనివారానికి వాయిదా వేశామని నిర్వాహకులు ప్రకటించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం



తీసుకున్నట్లు వారు వెల్లడించారు. కాగా.. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో వరుసగా మూడేళ్ల పాటు ఈ పరేడ్‌ను రద్దు చేశారు. అన్నేళ్ల తర్వాత ఈ వేడుక నిర్వహించలేకపోవడం ఇదే తొలిసారి. పరేడ్ వాయిదా పడడంపై మాకీస్ పరేడ్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ విల్ కాస్ విచారం వ్యక్తం చేశారు. భద్రతను దృష్టిలో ఉంచుకునే కార్యక్రమాన్ని వాయిదా వేశామని, భద్రతకే అత్యంత ప్రాధాన్యమని ఆయన స్పష్టం చేశారు.

ఎన్విడియా సీఈవో ఎఫైర్ వెనుక చైనా కుట్ర లేదు

యూఎస్ నిఘా అధికారులు

అమెరికా: అగ్రదేశంలో కలకలానికి దారి తీసిన ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్ ఎఫైర్ ఉదంతం దాదాపు ముగింపునకు వచ్చేసినట్టే కనిపిస్తోంది. ఈ ఎఫైర్ వెనుక చైనా హస్తం లేదని అమెరికా నిఘా వర్గాలు అంచనాకు వచ్చినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇప్పటికే జెన్సన్ ఎన్విడియా సీఈఓగా పునర్ నియమితులైన విషయం తెలిసిందే. జెన్సన్‌కు ఆలిస్ దగ్గరవ్వడం వెనుక చైనా నిఘా వర్గాల ముందస్తు వ్యూహం ఉందనేందుకు ఆధారాలు లభించలేదని అమెరికా నిఘా వర్గాలు తెలిపాయి. జెన్సన్, ఆలిస్‌ల బంధం వారి వ్యక్తిగతమైనదని అధి కారులు తేల్చారు. ఈ మేరకు యూఎస్ నిఘా అధికారులు కాంగ్రెషనల్ సిబ్బందికి ఓ సమావేశంలో తెలిపినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ సమావేశంలో అమెరికా నిఘా సంస్థ సీఐఏతో పాటు ఎఫ్‌బీఐ అధికారులు



కూడా పాల్గొన్నారు. అయితే, జెన్సన్‌తో బంధంలో ఉన్న సమయంలోనే ఆలిస్ చైనా నిఘా వర్గాలతో టచ్‌లో ఉందని అమెరికా అధికా రులు చెప్పారు. కానీ, వారికి కావాల్సిన కీలక సమాచారాన్ని ఆలిస్ అందించినట్టు ఆధారాలు లభించలేదని అన్నారు. ఆలిస్ భర్త కాంగ్ వీ చైనా నిఘా వర్గాలకు కీలకమైన వ్యక్తిగా అమెరికా అధికా రులు పేర్కొన్నారు. అయితే ఆలిస్‌కు అమెరికా క్లీన్ చిట్ ఇవ్వలేదని కూడా వార్తలు వెలువడుతున్నాయి. ఆలిస్ పరిచ యస్తులు, చైనాకు ఎన్విడియా చిప్‌ల దారిమళ్లింపు అమెరికా దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది.ఇక కాంగ్రెషనల్ అధికారులతో జరిగిన సమావేశంలో అమెరికా నిఘా అధికారులు కొంత కీలక సమాచారాన్ని పంచుకోనట్టు అమెరికా మీడియాలో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ ఎఫైర్‌కు సంబం ధించి అమెరికా మంత్రి మార్కో రూబియో దృష్టికి వచ్చిన నివేదిక గురించి యూఎస్ అధికారులు కాంగ్రెస్ వర్గాలతో పంచుకోలేదని సమాచారం.

టాయిలెట్ పేపర్‌కు యమ డిమాండ్

భారీగా కొని నిల్వ చేసుకుంటున్న అమెరికన్లు

వాషింగ్టన్: అమెరికాకు ఇప్పుడు మంచిరోజులు నడవడం లేదని భావిస్తున్న స్థానిక ప్రజలు సరుకులను పెద్దఎత్తున కొని ఇళ్లలో నిల్వ చేసుకుంటున్నారు. ముఖ్యంగా టాయిలెట్ పేపర్లు, జనరేటర్లు, ఫ్రీజ్ డ్రైయిడ్ ఫుడ్ వంటి అత్యవసర సరుకులను వేలంవెర్రిగా కొంటున్నారు. అమెరికాలో కృత్రిమ మేధ(ఏఐ) సంబంధ సమస్యలతో వ్యవస్థలు తరచూ ఇబ్బంది పడుతున్నాయి. దీంతో రానున్న కాలం ఎలా ఉండబోతుందోననే భయం అమెరికా పౌరులను వేధిస్తోంది. ఫలితంగా ఎడాపెడా కొనుగోళ్లు జరుపుతు న్నారు. ఈ పరిణామం అత్యవసర వస్తువుల ధరలను అమాంతం పెంచేసిందని 'బ్లూమ్‌బర్గ్ ఎకనామిక్స్' నిపుణులు విశ్లేషిస్తున్నారు. బ్లాక్ ఫ్రైడే సందర్భంగా భారీ డిస్కౌంట్ల ప్రకటనకు రిటైలర్లు సిద్ధం అవుతున్న వేళ కూడా ఆన్‌లైన్‌లో ధరలకు రెక్కలు రావడం విశేషం. ఫ్రీజ్ డ్రైయిడ్ ఫుడ్ ధరలు 12ు పెరిగాయి. ట్రాక్ చేసిన లిస్టులో మూడో వంతు సరుకులు దొరకడం లేదని, అదే గత ఏడాది ట్రాక్ చేసిన 16 సరుకుల లిస్టులో ఒకటి మాత్రమే లభ్యం కాలేదని 'బ్లూమ్‌బర్గ్ ఎకనామిక్స్' తెలిపింది. కొందామన్నా ఆన్‌లైన్‌లో



జనరేటర్లు దొరకడం లేదు. ఇరాన్‌తో యుద్ధం తర్వాత అమెరికాలో చమురు ధరలు భయపెడుతున్నాయి. ముఖ్యంగా ఆహార ఉత్పత్తుల ధరలపై ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది.

మిస్ యూనివర్స్ విజేతపై విమర్శలు



ఫిలిప్పీన్స్: మిస్ యూనివర్స్–2026 పోటీల ఫలితాలు తీవ్ర చర్చకు దారితీశాయి. ప్యూర్టోరికోకు చెందిన జెన్నిఫర్ బారెటో ఈ ఏడాది విశ్వసుందరి కిరీటాన్ని గెలుచుకున్నారు. అయితే ఆమె విజయంపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోటీల్లో న్యాయనిర్ణేతల నిర్ణయం సరిగ్గా లేదని, విజేతను ముందు గానే నిర్ణయించారేమోనని కొందరు నెటిజన్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఫిలిప్పీన్స్ తరఫున పాల్గొన్న బీ మిల్లన్–విండోర్స్కి సమాధానాలు, ప్రదర్శన బాగున్నాయని, ఆమెకే కిరీటం దక్కాల్సిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మిస్ యూనివర్స్ 75వ పోటీలు నవంబర్ 24న ప్యూర్టోరికో రాజధాని శాన్ జువాన్‌లో జరిగాయి. వివిధ దేశాలకు చెందిన మొత్తం 116 మంది అందగత్తెలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. చివరకు ఆతిథ్య దేశం ప్యూర్టోరికోకు చెందిన 27 ఏళ్ల జెన్నిఫర్ బారెటో విజేతగా నిలిచారు. డొమినికన్ రిపబ్లిక్‌కు చెందిన మెలిస్సా న్యూనెజ్ మొదటి రన్నరప్‌గా, వెనిజులాకు చెందిన క్లారా వేగా రెండో రన్నరప్‌గా నిలిచారు. ఫిలిప్పీన్స్‌కు చెందిన బీ మిల్లన్–విండోర్స్కి మూడో రన్నరప్‌గా నిలిచారు. ఫలితాలు వెలువడిన వెంటనే సోష ల్ మీడియాలో విమర్శలు మొదలయ్యాయి. పోటీలకు ఆతిథ్యమి చ్చిన ప్యూర్టోరికోకే కిరీటం దక్కడం వెనుక కొందరు అనుమానాలు వ్యక్తం చేశారు. పోటీల ఫలితాలు ముందే నిర్ణయించారంటూ కొందరు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చివరి ప్రశ్నోత్తరాల సమయంలో జెన్నిఫర్ ఇచ్చిన సమాధానం మిగతా పోటీదారులతో పోలిస్తే అంతగా ఆకట్టుకోలేదని పలువురు అభిప్రాయపడ్డారు.

యూకేను వీడుతున్న వారిలో భారతీయులే అధికం

లండన్: యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)కు వలసవచ్చే వారి బదులు తిరిగి వెళ్లే వారి సంఖ్య అధికమవుతోంది. తిరిగివెళ్లే వారిలో భారతీయులు మొదటి స్థానంలో ఉండగా, చైనీయులు రెండో స్థానంలో ఉన్నారు. జాతీయ గణాంకాల కార్యాలయం (ఆఫీస్ ఫర్ నేషనల్ స్టాటిస్టిక్స్–ఓఎన్ఎస్) విడుదల చేసిన అధికారిక లెక్కల్లో ఈ విషయం వెల్లడయింది. ఈ ఏడాది జూన్‌లో ముగిసిన ఏడాది కాలంలో మొత్తం 85 వేల మంది భారతీయులు తిరిగి వెళ్లారు. వీరిలో 55 వేల మంది స్టడీ వీసాపై వచ్చినవారు, 28 వేల మంది వర్క్ వీసాపై వచ్చినవారు, 2 వేల మంది ఇతర వీసాలపై వచ్చిన వారు ఉన్నారు. ఇదే కాలంలో 51 వేల మంది చైనీయులు తిరిగి వెళ్లారు. మరోవైపు యూకేకు వెళ్లున్నవారి సంఖ్యలోనూ తగ్గుముఖం కనిపిస్తోంది. ఇదే సమయంలో 77 వేల మంది స్టడీ వీసా మీద, 40 వేల మంది వర్క్ వీసా మీద వెళ్లారు. ఈ విషయంలోనూ భారతీయులు అగ్రస్థానంలో ఉండడం గమనార్హం.

తొలిరోజు ముగిసిన ఆట...కివీస్ 246/5

38 ఓవర్లు వేసినా బుమ్రాకు వికెట్ నిల్!

క్రైస్ట్‌చర్చ్ వేదికగా న్యూజిలాండ్, భారత్ మధ్య జరుగుతున్న రెండో టెస్టు శుక్రవారం ప్రారంభమైంది. తొలి రోజు ఆట ముగిసేసమయానికి కివీస్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 85 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 246 పరుగులు చేసింది. టామ్ బ్లండెల్ (53) అజేయ అర్ధశతకం సాధించగా, గ్లెన్ ఫిలిప్స్ (36) క్రీజులో ఉన్నారు. కెప్టెన్ టామ్ లాథమ్ (59) అర్ధసెంచరీ సాధించాడు. కాన్వే(31), నికోల్స్(16), డారిల్ మిచెల్(31) పర్వాలేదనిపించా రు. రచిన్ రవీంద్ర(0) విఫలమయ్యారు. భారత బౌలర్లలో ఆకాశ్ దీప్ 2 వికెట్లు తీయగా, అన్షుల్ కాంబోజ్, గుర్నూర్ బ్రార్, వాషింగ్టన్ సుందర్ తలా ఒక వికెట్ పడగొట్టారు. ఈ క్రమంలోనే టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఓ చెత్త రికార్డును నమోదు చేశాడు. 2021 డబ్ల్యూటీసీ ఫైనల్ తర్వాత ఒక టెస్టు సిరీస్‌లో వికెట్ తీయకుండా ఎక్కువ ఓవర్లు వేయడం ఇదే కావడం గమనార్హం. ఆనాటి డబ్ల్యూటీసీ ఫైనల్లో బుమ్రా 36 ఓవర్లు వేసి ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. తాజాగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో ఇప్పటివరకు 38 ఓవర్లు వేసి కనీసం ఒక వికెట్ తీయకుండా ఆ చెత్త రికార్డును అధిగమించాడు. వెల్లింగ్టన్ టెస్టులో న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్ లో తొలి ఓవర్‌లోనే వికెట్ తీసిన బుమ్రా ఆ తర్వాత 19 ఓవర్లలో మరో వికెట్ పడగొట్టలేకపోయాడు. తొలి సెషన్‌లో ఓ పెనర్ల దూకుడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకోగా.. తొలి సెషన్‌లో న్యూజిలాండ్ ఓపెనర్లు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. కాన్వే, టామ్ లాథమ్ కలిసి తొలి వికెట్‌కు 77 పరుగులు జోడించి శుభారంభం అందించారు. అయితే గుర్నూర్ బ్రార్ కాన్వేను ఔట్ చేసి భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు. రెండో సెషన్‌లో మాత్రం భారత బౌలర్లు విజృంభించా రు. టీ విరామం అనంతరం న్యూజిలాండ్ బ్యాటర్లు జోరును ప్రదర్శించారు. డారిల్ మిచెల్ (31) ఔటైనప్పటికీ, టామ్ బ్లండెల్ అజేయ అర్ధ శతకంతో పాటు ఆఖర్లో గ్లెన్ ఫిలిప్స్ కూడా ధాటిగా ఆడాడు. దీంతో కివీస్ 5 వికెట్ల నష్టానికి 246 పరుగులతో తొలి రోజు ఆటను ముగించింది.



11వ స్థానంలో జయదేవ్ ఉనాద్కత్ రికార్డ్



సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ (ఎస్ఎంఏటీ) 2026-27లో సౌరాష్ట్ర కెప్టెన్ జయదేవ్ ఉనాద్కత్ బ్యాట్‌తో అరుదైన ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. గురువారం ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియం లో తమిళనాడుతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో 11వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన ఉనాద్కత్ 26 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 40 పరుగులు చేశాడు. పురుషుల టీ20 క్రికెట్ చరిత్రలో 11వ స్థానంలో వచ్చిన బ్యాటర్ చేసిన అత్యధిక వ్యక్తిగత స్కోరు ఇదే కావడం విశేషం. గతంలో బిగ్ బాష్ లీగ్‌లో డానీ బ్రిగ్స్ (35 నాటౌట్) పేరిట ఉన్న రికార్డును ఉనాద్కత్ అధిగమించాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో తమిళనాడుతో సౌరాష్ట్ర తలపడిం ది. తొలుత బ్యాటింగ్ చేసిన తమిళనాడు 20 ఓవర్లలో 8 వికెట్లకు 192 పరుగులు చేసింది. సన్నీ సంధూ (44), ఆండ్రే సిద్ధార్థ్ (38), సచిన్ (37), రాజ్‌కుమార్ (36) రాణించారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన సౌరాష్ట్ర టాప్, మిడిల్ ఆర్డర్ కుప్పకూలి 92 పరుగులకే 9 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన ఉనాద్కత్.. చేతన్ సకార్యా (21 నాటౌట్)తో కలిసి 10వ వికెట్‌కు 62 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు.

క్వార్టర్స్‌లో తన్వీ, ఉన్నతి



లఖ్‌నవూ: తన్వీ శర్మ, ఉన్నతి హుడా, అన్‌మోల్ ఖర్బ్‌తో పాటు డిఫెండింగ్ చాంప్ ట్రీసా జాలీ-గాయత్రి జోడీ సయ్యద్ మోదీ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకొన్నారు. గురువారం జరిగిన మహిళల డబుల్స్ రెండో రౌండ్‌లో ట్రీసా-గాయత్రి జంట 21-9, 21-8తో శ్రేయ-ప్రణవిపై, అశ్విని భట్-శిఖా గౌతమ్ జంట 16-21, 21-12, 21-19తో మాన్య-రేశికపై గెలిచారు. మహిళల సింగిల్స్‌లో అన్‌మోల్ 21-16, 21-15తో అస్మిత చాలీహాపై, ఉన్నతి 21-14, 21-18తో ఇషికా జైస్వాల్‌పై, తన్వీ శర్మ 18-21, 21-18, 21-18తో ముతిర ఆయు పుష్పితసరిపై నెగ్గారు. పురుషుల సింగిల్స్‌లో తుషార్ సువీర్ 21-14, 21-12తో సుశ్వత్ దలాల్‌పై గెలిచి ముందంజ వేశాడు.

యశస్వి జైస్వాల్ అరుదైన ఘనత..

సచిన్ టెండూల్కర్ ప్రపంచ రికార్డు బ్రేక్



భారత యువ సంచలనం యశస్వి జైస్వాల్ టెస్టు క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించాడు. న్యూజిలాండ్‌తో క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లీ ఓవల్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో బరిలోకి దిగడంతో తన కెరీర్‌లో మరో మైలురాయిని అందుకున్నాడు. ఇప్పటివరకు ఆడిన తొలి 33 టెస్టు మ్యాచ్‌లను 33 వేర్వేరు మైదానాల్లో ఆడిన రెండో క్రికెటర్‌గా చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో భారత మాజీ బ్యాటర్ సంజయ్ మంజ్రేకర్ రికార్డును సమం చేయగా.. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్(32 వేదికలు) రికార్డును అధిగమించాడు. జైస్వాల్ 2023 జులై 12న వెస్టిండీస్‌తో విండ్సర్ పార్క్ వేదికగా జరిగిన మ్యాచ్‌తో టెస్టు అరంగేట్రం చేశాడు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆడిన ప్రతి టెస్టు మ్యాచ్‌ను వేర్వేరు వేదికల్లోనే ఆడటం విశేషం. గతంలో మంజ్రేకర్ తన తొలి 33 టెస్టులను వేర్వేరు మైదానాల్లో ఆడి ఈ ఘనత సాధించాడు. ఇప్పుడు జైస్వాల్ కూడా అదే రికార్డును అందు కున్నాడు. ఈ ఘనతతో దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్‌ను కూడా జైస్వాల్ అధిగమించాడు. సచిన్ తన తొలి 32 టెస్టు మ్యాచ్‌లను వేర్వేరు వేదికల్లో ఆడాడు. ఇక భారత మాజీ పేసర్ జవగళ్ శ్రీనాథ్, వెస్టిండీస్ మాజీ క్రికెటర్ దినేశ్ రామ్‌దిన్ తొలి 24 టెస్టులను వేర్వేరు మైదానాల్లో ఆడి ఈ జాబితాలో సంయుక్తంగా నాలుగో స్థానంలో ఉన్నారు.

మరో రికార్డుకు అవకాశం!

జనవరిలో ఆస్ట్రేలియాతో జరగనున్న బోర్డర్-గావస్కర్ ట్రోఫీ లోనూ అతడికి మరో అరుదైన రికార్డు సృష్టించే అవకాశం ఉంది. వచ్చే ఏడాది జనవరి 21న నాగ్‌పూర్‌లోని విదర్భ క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో జరగనున్న తొలి టెస్టులో జైస్వాల్ బరిలోకి దిగితే.. తన తొలి 34 టెస్టులను 34 వేర్వేరు వేదికల్లో ఆడిన తొలి ఆటగాడిగా నిలిచే అవకాశం ఉంటుంది. ఈ ఐదు టెస్టుల సిరీస్‌లో చెన్నై, గువాహటి, రాంచీ, అహ్మదాబాద్ కూడా వేదికలుగా ఉండనున్నాయి.

బౌలింగ్‌లో విఫలమయ్యాం..

శ్రీలంక చేతిలో ఓటమిపై తిలక్ వర్మ

ఏసీసీ మెన్స్ ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2026 సెమీఫైనల్లో భారత్-ఎ ఓటమిపై కెప్టెన్ తిలక్ వర్మ స్పందించాడు. బౌలింగ్‌లో పూర్తిగా తేలిపోయామని అంగీకరించాడు. భారత్-ఏ జట్టు తొలుత బ్యాటింగ్‌లో 317 పరుగుల భారీ స్కోరు చేసినప్పటికీ.. బౌలింగ్‌లో పూర్తిగా తేలిపోయింది. 318 పరుగుల లక్ష్యాన్ని శ్రీలంక రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఈ ఓటమితో భారత్-ఎ టోర్నీ నుంచి నిష్క్రమించింది. 'శ్రీలంక ఓపెనర్లకు క్రెడిట్ ఇవ్వాల్సిందే. ఇద్దరూ అద్భుతంగా ఆడారు. నేను అందుబాటులో ఉన్న బౌలర్లందరినీ ప్రయత్నించాను. కానీ బౌలింగ్‌లో మాకు ఇది బ్యాడ్ డే. ఒక్కోసారి ఇలాంటి రోజులు ఎదురవుతుంటాయి. శ్రీలంక బ్యాటర్లకు అభినందనలు. ఛేదనలో తొలి 15 ఓవర్లు అత్యంత కీలకమని ముందే అంచనా వేశా. ఆ సమయంలో ఓవర్‌కు ఆరు పరుగుల లోపే కట్టడి చేస్తే.. ఆ తర్వాత పిచ్ నెమ్మదించి బౌలర్లకు సహకరిస్తుందని భావించా. అయితే ప్రణాళికలను మైదానంలో అమలు చేయడంలో విఫలమ య్యాం. పిచ్ స్వభావాన్ని బట్టి 318 పరుగులు మంచి స్కోరే అనిపించింది. కానీ ఆ స్కోరును మేము కాపాడుకోలేక పోయాం' అని తిలక్ వర్మ వెల్లడించాడు.



హర్షిత్ రాణాపై నెటిజన్లు ఫైర్!

ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2026 టోర్నమెంట్‌లో భారత్ 'ఎ' జట్టు ప్రయాణం ముగిసింది. గురువారం దోహాలో జరిగిన సెమీ-ఫైనల్‌లో శ్రీలంక 'ఎ' చేతిలో ఎనిమిది వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. మొదట బ్యాటింగ్ చేసిన తిలక్ వర్మ సేన 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 317 పరుగుల భారీ స్కోర్ చేయగా... శ్రీలంక 'ఎ' కేవలం 41.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. లసిత్ క్రూస్‌పుల్లే (116), సినెత్ జయవర్ధనే (105) సూపర్ సెంచరీలతో శ్రీలంక 'ఎ' జట్టును ఫైనల్‌కు చేర్చడంలో కీలక పాత్ర పోషిం చారు. మరోవైపు టీమిండియా పేసర్ హర్షిత్ రాణాకు సంబం ధించిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. శ్రీలంక-ఎ జట్టుతో జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో హర్షిత్ రాణా ఏడు ఓవర్ల బౌలింగ్‌లో ఏకంగా 61 పరుగులు ఇచ్చి.. కేవలం ఒకే ఒక్క వికెట్ తీశాడు. అయితే తన బౌలింగ్‌లో లంక బ్యాటర్ బంతిని బౌండరీకి తరలించగా.. అక్కడే ఫీల్డింగ్ చేస్తున్న షాబాజ్ అహ్మద్ బంతిని అందుకోవడంలో కాస్త ఆలస్యం



చేశాడు. దీంతో తీవ్ర అసహనానికి లోనైన హర్షిత్.. షాబాజ్‌ను దూషించాడు. తొందరగా బంతి అందుకో అంటూ పరుష పదజాలం వాడాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ నేపథ్యంలో నెటిజన్లు హర్షిత్ రాణా ప్రవర్తనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చైతన్య రథం
సినిమా
శనివారం 28 నవంబరు 2026 IX

బాలయ్య - కొరటాల మూవీకి మ్యూజిక్ డైరెక్టర్ ఎవరంటే?



నందమూరి బాలకృష్ణ, స్టార్ డైరెక్టర్ కొరటాల శివతో జతకట్ట బోతోన్న విషయం తెలిసిందే. వీరిద్దరి కాంబి నేషన్ అనగానే అందరికీ ముందుగా గుర్తొచ్చే సినిమా 'సింహా'. 2010లో వచ్చిన ఆ బ్లాక్‌బస్టర్ సినిమాకు కొరటాల రచయితగా పనిచేశారు. ఆ సినిమాలో బాలయ్య పలికిన పవర్‌ఫుల్ డైలాగులు ఇప్పటికీ థియే టర్లలో మార్మోగుతూనే ఉంటాయి. అలాంటిది, ఇన్నేళ్ల తర్వాత తొలిసారిగా బాలయ్యను కొరటాల డైరెక్ట్ చేయబోతుండటంతో ఈ ప్రాజెక్ట్ (ఎన్‌బీకే112)పై భారీ హైప్ క్రియేట్ అయింది. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు కూడా ఘనంగా పూర్తయ్యాయి. యువసుధ ఆర్ట్స్, ఎస్ఎల్వి సినిమాస్ బ్యానర్లపై సుధాకర్ మిక్కిలినేని, సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అయితే, ఈక్రేజీప్రాజెక్ట్‌కు సంబంధించి ఇప్పుడు ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో ఒక ఆసక్తికర అప్‌డేట్ చక్కర్లు కొడుతోంది. అదేంటంటే.. ఈ సినిమా అనౌన్స్ అయిన ప్పటి నుంచి దీనికి కోలీవుడ్ రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తాడని బలంగా ప్రచారం జరిగింది. ఎందుకంటే కొరటాల శివ గత చిత్రం 'దేవర'కు అనిరుధ్ అందించిన మ్యూజిక్,బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఏ రేంజ్‌లో హిట్ అయ్యాయో అందరికీ తెలిసిందే. అందుకే బాలయ్య సినిమాకు కూడా అనిరుధ్‌నే తీసుకుంటారని అంతా ఫిక్స్ అయ్యారు. కానీ తాజా సమాచారం ప్రకారం...ఈసినిమాకు మ్యూజిక్ డైరెక్టర్‌గా జీవీ ప్రకాశ్ కుమార్‌ను మేకర్స్ ఫైనల్ చేసినట్లు టాలీవుడ్ వర్గాల్లో గట్టిగా టాక్ వినిపిస్తోంది. దర్శకుడు, నిర్మాతలు ఇప్పటికే జీవీని కలిసి కథను వివరించారని,ఆయనకూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని తెలుస్తోంది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటనరావాల్సి ఉంది.

సంపద ఉన్నా సామాన్యుడిలా...



వెండితెరపై విలన్‌గా కనిపిస్తే భయపెట్టగలరు.. గంభీరమైన పాత్రల్లో నటిస్తే తనదైన ముద్ర వేయగలరు. కానీ నిజ జీవితంలో మాత్రం ఆయన చాలా సరదాగా ఉంటారు. స్టార్‌డమ్‌ను పక్కనపెట్టి సామాన్యులతో కలిసిపోతారు. తన హోదా, స్థాయిని ఏమాత్రం పట్టించుకోకుండా అందరితో ఆప్యాయంగా మెలిగే ఆ నటుడే జగపతిబాబు. సంపన్న కుటుంబంలో పుట్టి పెరిగిన ఆయన.. ఆ తర్వాత ఆర్థికంగా ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొ న్నారు. చిల్లిగవ్వ లేని పరిస్థితి నుంచి మళ్లీ తన కాళ్లపై తాను నిలబడి పూర్వ వైభవాన్ని కూడా దాటే స్థాయికి ఎదిగారు. నటుడిగా ఎన్నో విజయాలు అందుకున్నారు. అయినప్పటికీ ఆయనలోని నిరాడంబరత మాత్రం మారలేదు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే మాటకు ఆయన వ్యక్తిత్వం ఉదాహరణగా నిలుస్తోంది. తాజాగా ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఓ వీడియో వైరల్‌గా మారింది. కొంతమంది వర్కర్లతో కలిసి ఆయన భోజనం చేశారు. వారు తెచ్చుకున్న ఆహారాన్ని స్వయంగా రుచి చూశారు. అంతేకాదు.. వారి కోసం ప్రత్యేకంగా బిర్యానీ తెప్పించి వారితో కలిసి కూర్చుని భోజనం చేశారు. తన స్టార్‌డమ్‌ను పక్క నపెట్టి వారితో సరదాగా గడిపిన తీరు నెటిజన్ల మనసులు గెలుచు కుంటోంది. ఇక ఈ వీడియోకు సంబంధించిన మరో సరదా విషయం అభిమానులను నవ్విస్తోంది. 'ఉదయం నాలుగు గిన్నెల అన్నం తిన్న జగ్గూభాయ్.. రాత్రి భోజనంతో ఊరందరినీ మించిపోయారు. ఏంటీ తిండిపోతుతనం!' అంటూ సరదాగా చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.

'ఆర్సీ17'లో యువ నటులకు ఆహ్వానం



మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్, మాస్టర్ స్టోరీటెల్లర్ సుకుమార్ కాంబినేషన్‌లో రాబోతోన్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'ఆర్సీ17'. ఇండస్ట్రీ హిట్ 'రంగస్థలం' తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న రెండో సినిమా కావడంతో దీనిపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, టీ-సిరీస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తోన్న ఈ భారీ ప్రాజెక్ట్ పూజా కార్యక్రమాలు ఇటీవలే ఘనంగా జరిగాయి. తాజాగా నటనపై ఆసక్తి ఉన్న ఔత్సాహికులకు చిత్ర బృందం ఒక అద్భుతమైన బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఈ సినిమా కోసం వివిధ వయసు ల నటీనటుల కోసం అన్వేషిస్తున్నట్లు చిత్ర బృందం అధికారికంగా క్యాస్టింగ్ కాల్ పోస్టర్‌ను విడుదల చేసింది. "కొత్త ప్రపంచం.. కొత్త కథ.. బహుశా మీ కోసమే ఓ పాత్ర ఎదురుచూస్తుందేమో" అంటూ మేకర్స్ ఈ ఆడిషన్స్‌కు ఆహ్వానం పలికారు. 16 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపు వయసున్న స్త్రీ, పురుషులు ఈ సినిమాలో నటించడానికి దరఖాస్తు చేసుకోవచ్చని తెలుపుతూ ఓ ప్రకటనను మేకర్స్ విడుదల చేశారు.

ఎలా అప్లై చేయాలి?

యాక్టింగ్ టాలెంట్ ఉండి, రామ్ చరణ్ - సుకుమార్ సినిమా లో నటించాలని ఆశపడే వారు తమ పోర్ట్‌ఫోలియో, ఆడిషన్ వివరాలను ఈ కింది మార్గాల ద్వారా పంపించవచ్చు:
ఈమెయిల్ ఐడీ:
src17casting@gmail.com,
వాట్సాప్ నంబర్: 9110564651,

సంప్రదించాల్సిన సమయం: ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు, తిరిగి మధ్యా హ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు మాత్రమే. వాట్సాప్ నంబర్‌కు కేవలం టెక్ట్స్ మెసేజ్‌లు మాత్రమే పంపాలి..ఎట్టి పరిస్థితుల్లోనూ ఫోన్ కాల్స్ చేయకూడదు. అలాగే ఆడిషన్స్ కోసం ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ పంపకూడదని చిత్ర బృందం స్పష్టమైన నిబంధనలు విధించింది.

ఆలయాల బాట పట్టిన స్టార్స్



ప్రముఖ సినీ తారలు ఆధ్యాత్మిక యాత్రలు చేస్తూ ఆలయాలను సందర్శిస్తున్నారు. తాజాగా టాలీవుడ్ హీరో అక్కినేని నాగచైతన్య శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకోగా.. హీరోయిన్ మీనాక్షి చౌదరి తిరుమల శ్రీవారి సేవలో పాల్గొన్నారు. గురువారం ఇద్దరు సినీ ప్రముఖులు వేర్వేరు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని గురువారం సినీ హీరో అక్కినేని నాగచై తన్య దర్శించుకున్నారు. ఆలయం వద్ద అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి.. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి సేవలో మీనాక్షి చౌదరి

హీరోయిన్ మీనాక్షి చౌదరి గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయం లోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయం వెలుపల మీనాక్షి చౌదరి మీడియాతో మాట్లాడుతూ డిసెంబరు 4వ తేదీన 'వృషకర్మ' సినిమా విడుదల కానుందని, ఈ క్రమంలో శ్రీవారి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చానన్నారు. రాబోయే ఏడాది కూడా మంచి ప్రాజెక్టులు ఉన్నా యన్నారు. అలాగే నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.



ట్రెడిషనల్ లుక్‌లో శ్రీలీల

సినీనటి శ్రీలీల గురువారం హైదరాబాద్‌లో సందడి చేశారు. జూబ్లీహిల్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ సిల్క్ షోరూంను ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం షోరూంలోని వివిధ రకాల చీరలను శ్రీలీల ఆసక్తిగా పరిశీలించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంప్రదా యంలో చీరలకు ప్రత్యేక స్థానం ఉందని, చీరలు మహిళల అందాన్ని మరింత రెట్టింపు చేస్తాయని అన్నారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా చీరల డిజైన్లలోనూ ఎన్నో మార్పులు వస్తున్నాయని, సంప్రదాయాన్ని కాపాడుతూనే ఆధునికతను జోడించడం మంచి పరిణామమని అభిప్రాయపడ్డారు. భారతీయ వస్త్రకళను ప్రోత్సహిస్తూ కొత్త తరానికి చేరువ చేసే ఇలాంటి ప్రయత్నాలు అభినందనీయమని అన్నారు. కాగా.. సంప్రదాయ చీరకట్టులో అందంగా మెరిసిన శ్రీలీల ఈ ప్రారంభోత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. క్రీమ్ అండ్ గోల్డ్ కలర్ చీరలో శ్రీలీల మెరిసిపోయారు. చీరకు ఉన్న ఎమరాల్డ్ గ్రీన్ బోర్డర్, దానిపై అందంగా రూపొందించిన గోల్డ్ జరీ వర్క్ ఆమె లుక్‌కు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి. దీనికి జతగా డీప్ గ్రీన్ కలర్ స్లీవ్‌లెస్ బ్లౌజ్ ధరించారు. స్టేట్‌మెంట్ గోల్డ్ జుంకాలు, అందమైన ఇయర్ కఫ్, చిన్న బిందీతో మెరిసిపోయారు. ట్రెడిషనల్ ఎలిగెన్స్ కు మోడ్రన్ ఫ్యాషన్ టచ్ జోడించిన ఆమె లుక్ అభిమానులను ఇట్టే కట్టి పడేసింది. అక్కడికి వచ్చిన వారి చూపులు తిప్పుకోనివ్వ కుండా తన నవ్వు, అందంతో మెస్మరైజ్ చేసింది. శ్రీలీల రాకతో షోరూం ప్రాంగణంలో సందడి నెలకొంది. తమ అభిమాన నటి వస్తున్నారన్న విషయం తెలుసుకున్న అభిమానులు ఆమెను చూసేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆమెతో సెల్ఫీలు దిగేందుకు ఏగబడ్డారు. అభిమానులకు అభివాదం చేస్తూ శ్రీలీల సందడి చేశారు. దీంతో షోరూం పరిసరాల్లో జాతర వాతావరణం నెలకొంది. ప్రస్తుతం ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీలీలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతున్నాయి.

